గురువారం
8•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 44
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

కృష్ణమ్మ ఉధృతం

నారాయణపుర నుంచి 4.56 లక్షల క్యూసెక్కుల వరద

జూరాలకు గంటగంటకూ పెరుగుతున్న ప్రవాహం.. ఉజ్జయినినుంచి మరో 1.25 లక్షల క్యూసెక్కులు

నేడు జూరాలకు 4 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో!

శ్రీశైలానికి 3.45 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. పూర్తిస్థాయి నిల్వసామర్థ్యం దిశగా శ్రీశైలం డ్యామ్

శని లేదా ఆదివారం తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు! .. త్వరలోనే నాగార్జునసాగర్‌కు జలకళ

హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. మొన్నటి వరకు నిరాశాజనకంగా ఉన్న వరద.. గత కొన్ని రోజులుగా అంతకంతకూ ఉధృతమవుతున్నది. నారాయణపుర నుంచి వేల క్యూసెక్కుల్లో మొదలైన ఇన్‌ఫ్లోలు.. ఇప్పుడు లక్షల్లోకి చేరుకుంటున్నాయి. దీనికితోడు ఉజ్జయిని నుంచి వచ్చే వరద ప్రవాహం కూడా తోడవటంతో జూరాలనుంచి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతున్నది. బుధవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాలకు 3.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 3.22 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. గురువారం సాయంత్రానికి జూరాలకు ఇన్‌ఫ్లో నాలుగు లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రానికి 153 టీఎంసీలకు చేరుకున్న శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండేందుకు సిద్ధమవుతున్నది. భారీ వరద కొనసాగనుండటంతో శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా దిగువకు జలాల్ని వదిలే

మిగతా 3వ పేజీలో

కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

శ్రీశైలంలో జలవిద్యుత్ జోరు
- 900 మెగావాట్లు ఉత్పత్తి
- జూరాలలో కొనసాగుతున్న పవర్ జనరేషన్
- మొత్తంగా 1250 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్న జెన్‌కో

3

ఢిల్లీలో బుధవారం సుష్మా స్వరాజ్ అంత్యక్రియల్లో ఆమె పార్థివదేహానికి సెల్యూట్ చేస్తున్న భర్త స్వరాజ్ కౌషల్, కుమార్తె బాన్సురి . చిత్రంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ తదితరులు కూడా ఉన్నారు.

సుష్మకు కన్నీటి వీడ్కోలు

లోధీ రోడ్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి

నివాళులర్పించిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు

భావోద్వేగానికి గురైన ప్రధాని, కన్నీటిపర్యంతమైన ఎల్‌కే అద్వానీ

ప్రియతమనేతకు తుదివీడ్కోలు పలికేందుకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అభిమానులు

4

శ్రీనగర్‌లోని మార్కెట్ ప్రాంతం నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

నివురుగప్పిన నిప్పు కశ్మీర్!

100 మంది అరెస్ట్.. ఒకరి మృతి

దక్షిణ కశ్మీర్‌లో పర్యటించిన అజిత్ దోవల్

ఇక ఆర్టికల్ 370 చెల్లదంటూ రాష్ట్రపతి నోటిఫికేషన్

భారత హైకమిషనర్‌ను బహిష్కరించిన పాక్

ద్వైపాక్షిక సంబంధాలు తగ్గించుకోవాలని నిర్ణయం

5

ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో జమ్ముకశ్మీర్ నివురుగప్పిన నిప్పులా ఉన్నది. రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కేంద్ర బలగాలు 100 మందికి పైగా అరెస్టు చేశాయి. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూసేందుకే వీరిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్‌లో కర్ఫ్యూ ఉన్న నేపథ్యంలో ఒక నిరసనకారుడిని భద్రతాబలగాలు వెంబడించగా, అతడు జీలం నదిలోకి దూకి ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు. మరోవైపు జాతీయ భద్రత సలహాదారు అజిత్‌దోవల్ బుధవారం దక్షిణ కశ్మీర్‌లో పర్యటించారు. స్థానికులు, పోలీసులతో ముచ్చటించారు. ఆర్టికల్ 370 ఇక చెల్లు బాటు కాదంటూ రాష్ట్రపతి సంతకం చేసిన నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. కశ్మీర్‌పై భారత్ చర్యలను నిరసిస్తూ పాకిస్థాన్ భారత హైకమిషనర్‌ను బహిష్కరించింది. భారత్‌తో సంబంధాలను తగ్గించుకోవాలని నిర్ణయించింది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని నిలిపివేసింది.

• నేతన్నల బతుకుల్లో వెలుగులు నింపిన సీఎం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కలెక్టర్ కృష్ణభాస్కర్ కూడా ఉన్నారు

సిరిసిల్ల ఘనత కేసీఆర్‌దే

చేనేత పరిశ్రమకు రూ.1200 కోట్లు.. సమైక్య ప్రభుత్వంలో ఇచ్చింది 70 కోట్లే

ప్రతి సోమవారం చేనేత దుస్తులు ధరించాలి

కాళేశ్వరం ప్రాజెక్టు చారిత్రాత్మకం.. వేగంగా నిర్మించి ప్రపంచ చరిత్రలోకెక్కాం

కాళేశ్వరం నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు నోబెల్ ఇవ్వాలని కేంద్ర ఐఏఎస్‌ల బృందం పేర్కొన్నది

మధ్యమానేరుకు అదనంగా రూ.350 కోట్లు ఖర్చుచేశాం

నిర్వాసితులపై విపక్షాలది కపట ప్రేమ

ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

వృద్ధిరేటులో తెలంగాణ దూకుడు

జీఎస్డీపీ పెరుగుదలలో టాప్

ప్రస్తుత ధరల వద్ద **15%** వృద్ధిరేటు

రూ.8.67 లక్షల కోట్లకు చేరిన రాష్ట్ర సంపద

2017-18తో పోలిస్తే రూ.1.14 లక్షల కోట్లు అధికం

దేశంలోని పెద్ద రాష్ట్రాల వృద్ధిరేటు 13 శాతంలోపే

జాతీయ సంపదలో 0.29 శాతం పెరిగిన రాష్ట్ర వాటా

మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ తాజా లెక్కల్లో వెల్లడి

2

తమ్ముడి తాయిలం.. అన్నకు అన్యాయం

ఇంట్లో కిరాయి ఉన్నందుకు రుణం తీర్చుకొన్న వీఆర్వో

వారసులను పిలువకుండా పట్టా మార్పిడి

కేసముద్రం రైతు రామచంద్రారెడ్డి ఆవేదన

ధర్మగంట

9

రైతుబీమాకు 930 కోట్లు

2019-20కి ఎల్ఐసీకి చెల్లించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం

8

గృహ, వాహన రుణాలు మరింత చౌక

- వరుసగా నాలుగోసారి కీలక వడ్డీరేట్లను తగ్గించిన ఆర్బీఐ
- ఈసారి రెపో, రివర్స్ రెపోలపై 0.35 శాతం కోత
- ఈ ఏడాది 110 బేసిస్ పాయింట్లు తగ్గుదల

11

రికార్డు స్థాయికి పసిడి

- తులంపై ఒకేరోజు రూ.1,113 పెరుగుదల
- రూ.37,920కి చేరిన ధర

11

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుత్తా నామినేషన్

- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రెండు సెట్లు అందజేత
- ఎన్నిక లాంఛనమే!

2

చికెన్ ధరలు (వెన్‌కాబ్)

ఫారం ధర	73.00	రిటైల్ లైవ్	95.00
డ్రెస్‌డ్	138.00	స్కిన్‌లెస్	157.00

గుడ్ల ధరలు (వందకు)

హైదరాబాద్	328.00	రంగారెడ్డి	328.00
మెదక్	328.00	కరీంనగర్	331.00
వరంగల్	331.00	చిల్లర ధర	3.90

ఆషాఢ బోనాలు విజయవంతం

మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు తలసాని, మహమూద్‌అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

- మంత్రులు మహమూద్‌అలీ, అల్లోల, తలసాని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బోనాల ఉత్సవాలను అందరి సహకారంతో ఘనంగా జరుపుకొన్నామని రాష్ట్ర మంత్రులు మహమూద్‌అలీ, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బోనాలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో సచివాలయంలో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని చాటే బోనాల ఉత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నామని తెలిపారు. సమావేశంలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ మానిక్‌రాజ్, రంగారెడ్డి, మేడ్చల్ జాయింట్ కలెక్టర్లు హరీశ్, శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ డీఆర్వో భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి

- ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు కల్పిస్తున్న వెసులుబాటు తెలంగాణవారికీ ఇవ్వాలి
- టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కలియుగ వైకుంఠంగా విలసిల్లుతున్న తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారిని దర్శించుకోవడానికి టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే యాత్రికులకు ప్రత్యేకదర్శన ప్రవేశం కల్పించాలని రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కోరారు. ఈ విషయమై ఆయనకు బుధవారం లేఖ రాయడంతోపాటు ప్రత్యేకంగా ఫోన్‌చేసి మాట్లాడారు. తెలంగాణ నుంచి సగటున ప్రతిరోజు 10వేల మంది యాత్రికులు తిరుమలను సందర్శిస్తారని, తిరుమలకు నడిచే 32 టీఎస్ ఆర్టీసీ సర్వీసుల్లోనే దాదాపు వెయ్యి మందికిపైగా రోజూ తిరుమలకు వెళ్తారని తెలిపారు. ప్రజారవాణా, పర్యాటక సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో టీటీడీ ప్రత్యేక ప్రవేశం టికెట్లను మంజూరుచేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు చేరుకునే ప్రయాణికులకు ఈ వెసులుబాటు ఉన్నదని, అదే విధానాన్ని టీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు కూడా కల్పించాలని అభ్యర్థించారు. టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ప్రతిరోజూ వెయ్యి దర్శన టికెట్లను కేటాయించాలని కోరారు. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి కొత్త విధానాలకు శ్రీకారం చుట్టారని సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మొదలైన ఐసెట్ కౌన్సెలింగ్

- స్లాట్ బుకింగ్‌కు రేపటివరకు గడువు
- నేటినుంచి 11 వరకు సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాలకు ఐసెట్-2019 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు 14,369 మంది విద్యార్థులు స్లాట్‌బుక్ చేసుకున్నారు. స్లాట్ బుకింగ్‌కు శుక్రవారం వరకు గడువు విధించారు. గురువారం నుంచి 11 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, గురువారం నుంచి 12 వరకు వెబ్‌ఆప్షన్ల ఎంపిక, 14న ఐసెట్ సీట్ల కేటాయింపు ఉంటుంది. పూర్తివివరాలకు tsicet.nic.in వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలి.

గురుకుల డిగ్రీ లెక్చరర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ గురుకుల డిగ్రీ కళాశాలల్లో కామర్స్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేశారు. 466 పోస్టుల భర్తీకి అభ్యర్థుల రాతపరీక్ష, ఇంటర్వ్యూల నిర్వహణ పూర్తయింది. అభ్యర్థుల తాత్కాలిక ఎంపిక జాబితాను బోర్డు బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. పూర్తి వివరాలకు treirb.telangana.gov.in, treirb.net వెబ్‌సైట్లను పరిశీలించాలని సూచించింది.

నేటినుంచి డీఈఈసెట్ తుదివిడుత కౌన్సెలింగ్

ఈ నెల 24న సీట్ల కేటాయింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈడీ) కళాశాలల్లో సీట్ల భర్తీకి గురువారం నుంచి తుదివిడుత డీఈఈసెట్-2019 కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఎస్ సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 20 వరకు వెబ్‌ఆప్షన్ల ఎంపిక ఉంటుందని, 22 నుంచి 24 వరకు సీట్ల కేటాయిస్తామని తెలిపారు. మొదటి, రెండోవిడుతలో సీట్లు రానివారు, సీట్లు పొంది రిపోర్ట్ చేయని వారంతా తుది విడుత కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం కల్పించామని తెలిపారు.

రేపట్నుంచి 'దోస్త్' స్పెషల్‌డ్రైవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దోస్త్ స్పెషల్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి బుధవారం షెడ్యూల్ విడుదలచేశారు. శుక్రవారం నుంచి 13 వరకు కొత్తగా రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తూ, ఈ నెల 13న ప్రత్యేక క్యాటగిరీవారికి ధ్రువపత్రాల పరిశీలనకు అన్ని యూనివర్సిటీల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ నెల 14న సీట్లను కేటాయిస్తామని, సీట్లు పొందిన విద్యార్థులు 16 వరకు రిపోర్ట్ చేయడానికి గడువు విధించామని చెప్పారు. పూర్తి వివరాలకు దోస్త్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.01 గంటలకు

సూర్యాస్తమయం: 6.42 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం అష్టమి ఉదయం 10.32 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: విశాఖ రాత్రి 9.28 వరకు, తదుపరి అనురాధ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.43 నుంచి 2.19 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.57 నుంచి 3.32 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.19 నుంచి సాయంత్రం 5.01 వరకు, వర్జ్యం: తె.జా. 3.10 నుంచి 4.46 వరకు.

లోకం పోకడ

హనీమూన్‌కు కశ్మీర్‌కు వెళ్దాం అన్నావ్ సరే.. ఇల్లుకొని సంసారం కూడా అక్కడే పెట్టేద్దామంటే కుదరదు!

జీఎస్డీపీ వృద్ధిరేటులో తెలంగాణ టాప్

- రూ.8.67 లక్షల కోట్లకు చేరిన రాష్ట్ర సంపద
- 2017-18తో పోలిస్తే రూ.1.14 లక్షల కోట్లు అధికం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్డీపీ) వృద్ధిరేటులో తెలంగాణ దేశంలోనే టాప్‌గా నిలిచింది. పెద్ద రాష్ట్రాలను సైతం తలదన్నుతూ 15 శాతం వృద్ధిరేటుతో ముందు వరుసను కైవసం చేసుకున్నది. సంపదను సైతం అంతకంతకూ పెంచుకుంటూ సంపన్న రాష్ట్రంగా స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నది. తెలంగాణ ఆవిర్భవించిన ఐదేండ్లలోనే రాష్ట్రం మొత్తం సంపద జీఎస్డీపీ 4 లక్షల కోట్ల నుంచి రూ.8.5 లక్షల కోట్లను దాటింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ తాజా లెక్కల ప్రకారం ప్రస్తుత ధరల వద్ద తెలంగాణ మొత్తం సంపద రూ.8,66,875 కోట్లకు చేరుకున్నది. 2017-18లో రూ.7,53,804 కోట్లుగా ఉన్న సంపద 2018-19 ఆర్థిక సంవత్సరం పూర్తయిన క్రమంలో అదనంగా రూ.1.14 లక్షల కోట్లు పెరిగిందని స్టాటిస్టిక్స్ విభాగం వెల్లడించింది. ప్రస్తుత ధరల వద్ద సంపద పెరుగుదల రేటు 15 శాతంగా ఉన్నది. మొత్తం సంపదలో తెలంగాణ కంటే ఏడు రాష్ట్రాలు ముందున్నప్పటికీ వృద్ధిరేటులో మన రాష్ట్రం ముందువరుసలో నిలిచింది. భౌగోళికంగా, జనాభాపరంగా పెద్దవైన ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల సంపద తెలంగాణ కంటే ఎక్కువగా ఉన్నా వృద్ధిరేటులో వెనుకబడ్డాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం సంపద తెలంగాణ కంటే రూ.50 వేల కోట్లు అదనంగా ఉన్నా.. వృద్ధిరేటులో మాత్రం మన రాష్ట్రమే ముందున్నది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కేరళ, హర్యానా, బీహార్, ఒడిశా, అసోం రాష్ట్రాలు గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలను ఇంకా కేంద్రానికి సమర్పించలేదు. జూన్ నెలాఖరు వరకు అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం ఎలా చూసినా వృద్ధిరేటులో తెలంగాణ అగ్రభాగాన ఉన్నది.

- దేశంలోని పెద్ద రాష్ట్రాల వృద్ధిరేటు 13 శాతంలోపే..
- జాతీయ సంపదలో 0.29 శాతం పెరిగిన రాష్ట్ర వాటా
- మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ తాజా లెక్కల్లో వెల్లడి



జాతీయ సంపదలో పెరిగిన రాష్ట్ర వాటా

రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తించిన రంగాల్లో నిర్దిష్ట సమయంలో ఉత్పత్తయిన వస్తువులు, సేవల మార్కెట్ విలువను జీఎస్డీపీగా పరిగణిస్తారు. రాష్ట్రంలో వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య సంపద, భూగర్భ వనరులు, పారిశ్రామిక ప్రగతి, ఉత్పత్తి, రవాణారంగం, సొంతపన్నుల రాబడి తదితర విషయాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర సంపదను లెక్కిస్తారు. వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తులు గణనీయంగా పెరుగడం, కొత్త పరిశ్రమలు తరలిరావడం, పెట్టుబడులు వెల్లువెత్తడం, భవన నిర్మాణ రంగం, రియల్ మార్కెట్ పుంజుకోవడం, పారిశ్రామిక ఉత్పత్తులతోపాటు ఉపాధి పెరుగడం, సేవారంగాల్లో గణనీయ ప్రగతి వంటి అంశాలు తెలంగాణ రాష్ట్ర సంపద భారీగా పెరుగడానికి దోహదపడుతున్నాయి. జాతీయ సగటును మించి వేగంగా వృద్ధిరేటును సాధించిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. 2016-17లో రూ.6,59,676 కోట్లుగా ఉన్న మొత్తం సంపద.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.7,53,804 కోట్లకు పెరిగింది. 12 శాతం వృద్ధిరేటు చోటుచేసుకున్నది. 2018-19లో సంపద రూ.8,66,875 కోట్లకు పెరిగి, వృద్ధిరేటు 15 శాతంగా నమోదైంది. మొత్తం సంపద తెలంగాణ కంటే ఎక్కువగా ఉన్న మిగతా పెద్ద రాష్ట్రాల వృద్ధిరేటు 13 శాతంలోపే ఉండటం విశేషం. జాతీయ సంపదలో తెలంగాణ వాటా కూడా క్రమంగా పెరుగుతున్నది. గతంలో 3 నుంచి 4శాతం లోపే ఉన్న సంపద తాజాగా 4.29 శాతానికి పెరిగింది. దక్షిణ భారతదేశం మొత్తం వాటా 28.66 శాతంగా ఉన్నది. రాష్ట్రంలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయరంగాల్లో జీఎస్డీపీ వృద్ధిరేటు స్థిరధరల వద్ద 10 శాతం దాటింది. జీఎస్డీపీ వృద్ధిరేటు బాగా పెరిగింది. 2017-18ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ప్రస్తుత ధరల వద్ద తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిరేటు 15 శాతానికి పెరిగింది.

'సిరి'సిల్ల ఘనత కేసీఆర్‌దే

నేతన్నల బతుకుల్లో వెలుగులు నింపిన సీఎం

ప్రతి సోమవారం చేనేత దుస్తులు ధరించాలి

- కాళేశ్వరం నిర్మించి చరిత్రలోకెక్కాం
- ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఉమ్మడిపాలనలో ఆత్మహత్యలతో ఉరిసిల్లగా మారిన సిరిసిల్లను 'సిరి'సిల్లగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని సిరిసిల్ల ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తిచేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రపంచచరిత్రలోకెక్కిందని చెప్పారు. 'ఈ ప్రాజెక్టును నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు నోబెల్ బహుమతి ఇవ్వాలని కేంద్ర ఐఏఎస్‌ల బృందం పేర్కొన్నది. ఇంకేం కావాలి!' అని అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత బస్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం శివనగర్‌లోని కుసుమ రామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. పొదుపుభవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరై జిల్లా అభివృద్ధిపై సభ్యులకు సూచనలు చేశారు. అక్కడినుంచి జిల్లాకేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపానికి చేరుకుని, టీఆర్ఎస్ పట్టణ బూత్‌కమిటీ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు.

స్వరాష్ట్రంలో చేనేతకు రూ.1200 కోట్లు

సమైక్య పాలనలో చేనేత, మరమగ్గాల కార్మికుల ఆత్మహత్యలకు ప్పాలడితే నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కేటీఆర్ విమర్శించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.70 కోట్లు కేటాయిస్తే స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం రూ.1200 కోట్లు కేటాయించిందని చెప్పారు. చేనేత, మరమగ్గాల పరిశ్రమలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి, చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులకు రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికులకు నెలకు రూ.15వేల వేతనం అందాలన్న ఉద్దేశంతో బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు సిరిసిల్లకే ఇచ్చి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు. చేనేత కార్మికులకు చేతినిండా పనికల్పించడం కోసం ప్రతి సోమవారం చేనేత దుస్తులు ధరించాలని చేనేతలక్ష్మి పథకం ప్రవేశపెట్టామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యోగులంతా చేనేత దుస్తులు ధరించేలా చర్యలు తీసుకున్న కలెక్టర్ కృష్ణభాస్కర్‌ను కేటీఆర్ అభినందించారు.

కోటి ఎకరాల మాగాణే లక్ష్యం

తెలంగాణ కోటి ఎకరాల మాగాణి కావాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని కేటీఆర్ ఉద్ఘాటించారు. మధ్యమానేరు ప్రాజెక్టు సమైక్యపాలనలో నత్తనడకన సాగిందని కేటీఆర్ విమర్శించారు. దానిని రీడిజైన్‌చేసి అదనంగా రూ.350 కోట్లు కేటాయించి, సకాలంలో పూర్తిచేశామని చెప్పారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం 99% పరిష్కరించిందని చెప్పారు. సమస్యల పేరు చెప్పి ధర్నాలు, ఆందోళనలు చేస్తూ నిర్వాసితులపై విపక్షాలు కపటప్రేమ చూపిస్తున్నాయని మండిపడ్డారు. వేములవాడలో జరుగుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతున్నదన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. నిజజీవితంలో తాను తారకరాముడి పాలన చూస్తున్నానని అన్నారు. సిరిసిల్లకు కేటీఆర్ ఎమ్మెల్యే కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. కాళేశ్వరంను పూర్తిచేసిన సీఎంకు ధన్యావాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, కలెక్టర్ కృష్ణభాస్కర్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లకు కేంద్రం ఇచ్చేది రూ.200 కోట్లు

ఆసరా పెన్షన్లకింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 కోట్లు చెల్లిస్తున్నదని కేటీఆర్ తెలిపారు. అందులో కేంద్రం ఇచ్చేది రూ.200 కోట్లు మాత్రమేనన్నారు. దీనిపై కొంతమంది తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. అన్ని గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రజాప్రతినిధులకు కేటీఆర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు.

సిరిసిల్లలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో బీపీ చెక్ చేయించుకొంటున్న కేటీఆర్

చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

ట్వీట్ చేసిన క్యాథరీన్ హడ్డా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో అమెరికా మాజీ కాన్సుల్ జనరల్ క్యాథరీన్ హడ్డా శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ రోజు నాకు ఎన్నో మధురస్మృతులను గుర్తుకు తెస్తున్నది. నేను భారత్‌లో లేనందుకు బాధపడుతున్న. అర్లింగ్‌టన్‌లో ఉన్నా చేనేత వస్త్రాలనే ధరిస్తున్న' అని ట్విట్టర్లో పేర్కొన్నారు.

చేనేతకు ప్రభుత్వాల ప్రోత్సాహం

ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు ఇతోధిక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. కేంద్ర వస్త్రమంత్రిత్వశాఖ, లాక్మే ఫ్యాషన్ వీక్ సంయుక్త ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇలాహె అర్బాన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం పద్మశ్రీ గజం గోవర్ధన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఫ్యాషన్ డిజైనర్లు పద్మజ (ముంబై), సోహమ్ దేవ్ (కలకత్తా), శంతన్ (అహ్మదాబాద్) రూపొందించిన ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది.

చేనేత కార్మికులకు రుణమాఫీ పథకం కింద చెక్కు అందజేస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో మాజీ ఎంపీ గుండు సుధారాణి, జీసీ కమిషన్ చైర్మన్ జీఎస్ రాములు, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ తదితరులు కూడా ఉన్నారు.

హోంమంత్రి మహమూద్‌అలీ సమక్షంలో ఆసు యంత్రాల పంపిణీకి చింతకింది మల్లేశంతో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్. చిత్రంలో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, తానా ప్రతినిధులు శశికాంత్, నిరంజన్ తదితరులు కూడా ఉన్నారు.

నేతన్న సంక్షేమానికి 373 కోట్లు

- భారీగా నిధులిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే: మహమూద్‌అలీ
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 24 మందికి అవార్డుల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేత కార్మికుల సంక్షేమానికి గతంలో ఎన్నడూలేని విధంగా రూ.373 కోట్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రశంసించారు. ఉమ్మడి రాష్ట్రంలో నేతన్నల ఆత్మహత్యలు జరిగేవని, వాటినిచూసి చలించిన సీఎం కేసీఆర్.. తెలంగాణలో ఎవరూ బలవన్మరణాలకు పాల్పడకూడదనే ఉద్దేశంతో పెద్దఎత్తున నిధులు కేటాయించారని గుర్తుచేశారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో నంబర్‌వన్ సీఎం అని, తెలంగాణ దేశంలో నంబర్ వన్ స్టేట్ అని అన్నారు. విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమానికి గుర్తుగానే జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు చెప్పారు. పద్మశాలీల కోసం సీఎం కేసీఆర్ రెండున్నర ఎకరాల భూమి, భవనానికి రూ.5 కోట్లు కేటాయించారని మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గుండు సుధారాణి, మండల శ్రీరాములు, జెల్లా మార్కండేయులు, గజం గోవర్ధన్, చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకుడు శ్రీనివాస్, టెస్కో జీఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు

చేనేతరంగంలో విశేష కృషిచేసినవారికి రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో అవార్డులు అందించి రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రంతో సన్మానిస్తున్నది. పోచంపల్లి ఇక్కత్ విభాగంలో గూడ శ్రీను, ఆనందం పరమేశం (యాదాద్రి భువనగిరి), పగిడిమర్రి శ్రీనివాస్, కందగట్ల శ్రీనివాసులు, మిర్యాల వెంకటేశం, జెల్లా శ్రీశైలం (నల్లగొండ), వినం భాస్కర్ (మహబూబ్‌నగర్), గజం ప్రవీణ్, గజం శంకరయ్య (రంగారెడ్డి), డర్రీస్ విభాగంలో మడికొండ వెంకటస్వామి, వీరబత్తిని రమేశ్, సయ్యద్ ఉస్మాన్ (వరంగల్ అర్బన్), గొల్లభామ చీరల విభాగంలో గూడూరి విఠల్, కాల్వ సుధాకర్, బల్లా దత్తాద్రి, వీరబత్తిని సోమయ్య, నారాయణపేట చేనేతలో పెడూరు శ్రీనివాస్ (మహబూబ్‌నగర్), గద్వాల చీరల విభాగంలో ఏ గోపాల్‌రావు (గద్వాల), జనరల్ క్యాటగిరీలో గడ్డం వెంకటేశ్వర్లు, గొర్రె బాపు, వెల్ది హరిప్రసాద్, గుండేటి రామచంద్రం, ఆడెపు రాజేశం, వీరుగొండ ఓదేలు (వరంగల్ అర్బన్)కు అవార్డులు దక్కాయి. అవార్డు గ్రహీతలను మంత్రి మహమూద్ అలీ సన్మానించారు.

ఆసు యంత్రాల పంపిణీకి ఎంవోయూ

ఆసు యంత్రాల పంపిణీకి చింతకింది మల్లేశంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. జాతీయ చేనేత దినం సందర్భంగా బుధవారం మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో హోంమంత్రి మహమూద్‌అలీ సమక్షంలో ఒప్పందం జరిగింది. మొత్తం వ్యయంలో 50 శాతం తానా భరిస్తుండగా.. 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం, మరో 25 శాతాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, తానా ప్రతినిధులు వల్లిపల్లి శశికాంత్, సంగవరపు నిరంజన్, కోయ హరీశ్, చింతకింది మల్లేశం ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్రంలో వేయి మందికి ఈ యంత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. అనంతరం డిజైనర్ రీనా సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆహూతులను ఆకట్టుకున్నది.

గుత్తా సుఖేందర్‌రెడ్డికి మద్దతుగా వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుత్తా నామినేషన్

- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రెండు సెట్లు అందజేత
- సభ్యుల బలాబలాల ఆధారంగా గుత్తా ఎన్నిక లాంఛనమే!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ్యుల కోటాలో శాసనమండలికి ఎన్నికయ్యేందుకు టీఆర్ఎస్ అభ్యర్థిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలుచేశారు. మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ వెంట రాగా సుఖేందర్ రెడ్డి.. అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ నరసింహాచార్యులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. టీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మరో సెట్ నామినేషన్ సమర్పించారు. నామినేషన్లకు తుది గడువు ఈ నెల 14 వరకు ఉన్నది. 16న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ, అదేరోజు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాల ఆధ

కృష్ణమ్మ ఉధృతం

జోగుళాంబ గద్వాల జిల్లాలో బుధవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో జూరాల ప్రాజెక్టు అవుట్ ఫ్లో

మొదటిపేజీ తరువాయి...

అద్భుతదృశ్యం రెండుమూడు రోజుల్లోనే సాక్షాత్కరించే అవకాశాలు ఉన్నాయి.

ఆల్మట్టి, నారాయణపుర నుంచి భారీ వరద

కృష్ణాబేసిన్‌లో ఎగువనుంచి వరద భారీస్థాయిలో వస్తున్నది. మహారాష్ట్రలో భారీగా కురుస్తున్న వర్షాలకుతోడు కర్ణాటక పరిధిలోనూ వానలతో ఆల్మట్టికి భారీగా వరద కొనసాగుతున్నది. బుధవారం రాత్రి పదిగంటల సమయానికి అవుట్‌ఫ్లో 4 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నదన్న కేంద్ర జలసంఘం ముందస్తు అంచనాతో కర్ణాటక అధికారులు ఆల్మట్టి నుంచి అవుట్‌ఫ్లోను పెంచారు. ఆల్మట్టి ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నుంచి నారాయణపుర ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌కు 60 కిలోమీటర్ల దూరమే ఉండటంతో ఆల్మట్టిలో విడుదలైన నీళ్లు గంటల్లోనే నారాయణపురకు చేరుకుంటున్నాయి. గంటగంటకూ వరద పరిమాణం పెరుగుతూ ఉండటంతో నారాయణపుర అధికారులు అవుట్‌ఫ్లోను అంతేమొత్తంలో పెంచారు. దీంతో బుధవారం ఉదయం 11 గంటలకు 3.93 లక్షల క్యూసెక్కులుగా ఉన్న అవుట్‌ఫ్లో.. అరగంటలోనే 4.03 లక్షల క్యూసెక్కులకు, మధ్యాహ్నం రెండుగంటలకు 4.23 లక్షల క్యూసెక్కులకు పెరిగి.. రాత్రి పదిగంటల సమయానికి ఏకంగా 4.56 లక్షల క్యూసెక్కులకు చేరుకున్నది. జూరాలకు ఇన్‌ఫ్లో 3.30 లక్షల క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లోను క్రమంగా పెంచుతున్నారు. రాత్రి 9 గంటల సమయానికి జూరాల అవుట్‌ఫ్లో 3.22 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. నారాయణపుర జలాలు జూరాలకు చేరుకునేందుకు 24 గంటల సమయం పడుతుంది. ఎగువన ఉజ్జయిని కూడా నిండుకుండలా మారింది. 117.24 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం ఉన్న ఉజ్జయినిలో నిల్వ 117.24 టీఎంసీలకు చేరుకోవడం.. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో అధికారులు రెండు లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను మొదలుపెట్టారు. ఈ వరద జలాలు శుక్రవారం సాయంత్రానికి జూరాలకు చేరుకునే అవకాశం ఉన్నది. భీమా వరదసైతం కలిస్తే నారాయణపేట జిల్లా తంగిడి నుంచి జూరాల ప్రాజెక్టు వరకు కృష్ణమ్మ మరింత ఉగ్రరూపం దాల్చనున్నది. నారాయణపుర అవుట్‌ఫ్లో నాలుగు లక్షల క్యూసెక్కులకు పైగా ఉండటంతో గురువారం జూరాల ఇన్‌ఫ్లో నాలుగు లక్షల మైలురాయిని దాటనున్నది. ఈ పరిస్థితిలో దిగువన నదీతీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంచేశారు. పరిస్థితిని నారాయణపేట కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ చేతన పర్యవేక్షిస్తున్నారు. తుంగభద్రకు కూడా బుధవారం వరద పెరిగింది. జలాశయానికి 91వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తున్నది. వంద టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న టీబీ డ్యాంలో ప్రస్తుతం 42.40 టీఎంసీలు ఉన్నాయి.

153 టీఎంసీలకు శ్రీశైలం జలాశయం

జూరాలనుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండిపోనున్నది. శ్రీశైలం ఎఫ్‌ఆర్‌ఎల్ 885 అడుగులస్థాయిలో 215.81 టీఎంసీలు కాగా.. బుధవారం సాయంత్రం ఆరుగంటలకు 872.60 అడుగుల నీటిమట్టంతో 153 టీఎంసీలకు చేరుకున్నది. మరో 62 టీఎంసీలు చేరితే శ్రీశైలం పూర్తిస్థాయి నిల్వసామర్థ్యానికి చేరుకుంటుంది. ఎగువనుంచి వస్తున్న వరదను బేరీజువేస్తే రోజుకు 30-35 టీఎంసీల వరకు వచ్చి చేరే అవకాశాలు ఉన్నాయి. రెండురోజుల్లో ఇది పూర్తికావాల్సి ఉండగా.. ఎడమ, కుడి గట్టు విద్యుత్ కేంద్రాలతోపాటు పలు ప్రాజెక్టులద్వారా కూడా నీటిని విడుదలచేస్తుండటం, ఆ పరిమాణాన్ని కూడా పెంచే అవకాశమున్నందున శ్రీశైలం గేట్లు తెరిచేందుకు మరికొంత సమయం పట్టే అవకాశమున్నది. వరద ఉధృతి దృష్ట్యా శనివారం లేదా ఆదివారం గేట్లు ఎత్తే అవకాశాలు లేకపోలేదని అధికారులు చెప్తున్నారు.

ఏడేండ్లలో రికార్డుస్థాయి ఇన్‌ఫ్లో!

నేటి అర్ధరాత్రి జూరాలకు నాలుగు లక్షల క్యూసెక్కులు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాబేసిన్‌లో తెలంగాణ ముఖద్వారమైన జూరాల మీదుగా కృష్ణమ్మ పోటెత్తుతుండటంతో రెండు రాష్ట్రాల పరిధిలోని కృష్ణాబేసిన్ ఆయకట్టులో ఆనందం వెల్లివిరుస్తున్నది. వరద అంతకంతకూ పెరుగుతుండటంతో కర్ణాటక నుంచి ఏకంగా నాలుగు లక్షల క్యూసెక్కులకు పైగా వరదను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలవద్ద ఇన్‌ఫ్లో బుధవారం అర్ధరాత్రికి నాలుగు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉన్నదని అధికారులు చెప్పారు. అదే జరిగితే గత ఏడేండ్లలో ఇదే రికార్డుస్థాయి ప్రవాహం కానున్నది.

జూరాల జలాశయం వద్ద ఆయా సంవత్సరాల్లో నమోదైన గరిష్ఠ ఇన్‌ఫ్లో-అవుట్‌ఫ్లో వివరాలిలా ఉన్నాయి

సంవత్సరం	తేదీ	గరిష్ఠ ఇన్‌ఫ్లో	గరిష్ఠ అవుట్‌ఫ్లో	ఆ సమయానికి జలాశయ సామర్థ్యం
2012-13	7.9.2012	1,45,070	1,50,581	11.211
2013-14	31.7.2013	2,74,305	2,73,111	9.738
2014-15	5.8.2014	1,56,963	1,65,031	9.738
2015-16	13.9.2015	32,754	36,401	10.544
2016-17	6.8.2016	2,13,215	2,26,627	6.969
2017-18	18.10.2017	1,94,283	1,94,270	9.214
2018-19	25.7.2018	1,83,960	1,80,203	9.193
2019-20	7.8.2019	3,33,000	3,22,780	7.553

సాగర్‌పై చిగురించిన ఆశలు

రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన నాగార్జునసాగర్ జలాశయానికి ఈసారి కూడా జలకళ వచ్చినట్లేనని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. 2014లో చివరిసారిగా సాగర్‌కు మంచి వరద వచ్చి నిండుకుండలా మారింది. ఆ ఏడాదిలో 563.39 టీఎంసీల జలాలు రావడంతో సుమారు పది టీఎంసీలు సర్‌ప్లస్ అయి దిగువకు పోయాయి. ఆ తర్వాత సాగర్‌కు వరదకళ రాలేదు. 2015-16 నుంచి గత ఏడాదివరకు శ్రీశైలానికి మాత్రమే ఇన్‌ఫ్లోలు పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రీశైలంలోని నిల్వల్ని సాగర్‌కు వదిలి, రెండు రాష్ట్రాలు తాగు, సాగునీటి అవసరాలు తీర్చుకోవాల్సివచ్చింది. ఎగువన వరద మరో వారం పదిరోజులపాటు కొనసాగితే నాగార్జునసాగర్‌కు కూడా పూర్తిస్థాయిలో జలకళ రానున్నది. ఆంధ్రా ప్రాంతానికి తాగునీటి అవసరాలకోసం సాగర్ నుంచి కుడికాల్వకు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం నీటిని విడుదలచేశారు.

వివిధ ప్రాజెక్టులలో మంగళవారం నీటి మట్టాల వివరాలు...

రిజర్వాయర్	ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1696.78	129.72	90.00	3,64,000	4,00,217
నారాయణపుర	1615.00	1604.13	37.64	24.13	4,00,000	4,51,680
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	93,265	1,25,300
జూరాల	1045.00	1041.50	9.66	7.55	3,30,000	3,22,780
తుంగభద్ర	1633.00	1613.50	100.86	42.40	91,237	1,560
శ్రీశైలం	885.00	873.10	215.81	154.52	2,82,180	87,938
నాగార్జునసాగర్	590.00	511.80	312.05	134.74	74,835	17,560
సింగూరు	1717.93	1670.52	29.91	0.47	20	20
నిజాంసాగర్	1405.00	1368.32	17.80	0.14	25	10
శ్రీరాంసాగర్	1091.00	1055.70	90.31	9.80	13,637	274
లోయర్‌మానేరు	920.00	881.60	24.07	3.46	354	204
కడెం	700.00	694.83	7.60	6.32	7979	7,984
ఎల్లంపల్లి	485.56	484.84	20.18	19.50	54,450	67,155

జలాభిషేకం

శ్రీశైలంలోని జల విద్యుత్‌కేంద్రం

శ్రీశైలంలో జలవిద్యుత్ జోరు

- ఉధృత వరదతో 900 మెగావాట్ల పూర్తిస్థాయి కరంటు ఉత్పత్తి
- జూరాలలోను పవర్ జనరేషన్.. మొత్తం 1250 మెగావాట్లు ఉత్పత్తి
- నాగార్జునసాగర్, పులిచింతలలోనూ ఏర్పాట్లు
- జలవిద్యుత్ కేంద్రాలపై సీఎండీ ప్రభాకర్‌రావు సమీక్ష

హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కృష్టమ్మకు వచ్చిన వరదతో సాగునీరే కాదు.. జలవిద్యుత్ కూడా అందివస్తున్నది. శ్రీశైలం జలాశయం నీటినిల్వ 153 టీఎంసీలకు చేరుకోవడంతో అక్కడి భూగర్భ జలవిద్యుత్‌కేంద్రంలో గరిష్ఠ సామర్థ్యంతో తెలంగాణ జెన్‌కో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. 150 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఆరు యూనిట్లద్వారా మొత్తం 900 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం తెలంగాణ జెన్‌కోకు ఉన్నది. నీటి ప్రవాహ ఉధృతి సానుకూలంగా ఉండటంతో.. గరిష్ఠ సామర్థ్యంలో మొత్తం 900 మెగావాట్ల జలవిద్యుత్ అక్కడ ఉత్పత్తి అవుతున్నది. రాబోయే కొద్దిరోజులపాటు ఇదే ప్రవాహ ఉధృతి కొనసాగనుండటంతో గరిష్ఠ జలవిద్యుత్ ఉత్పత్తిని కొనసాగించాలనే లక్ష్యంతో జెన్‌కో ఉన్నది. నాగార్జునసాగర్, పులిచింతలలో కూడా విద్యుత్ ఉత్పత్తికోసం వ్యవస్థలను సిద్ధంచేసింది. తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు బుధవారం ఆయా పవర్‌స్టేషన్ల అధికారులు, జెన్‌కో అధికారులతో మాట్లాడి, కృష్ణానదిలో నీటిప్రవాహ ఉధృతిని, రిజర్వాయర్లలో నీటి మట్టాలను సమీక్షించారు. వారంక్రితం కర్ణాటక నుంచి నీటిప్రవాహం ప్రారంభమైనప్పటినుంచే జూరాలలో జలవిద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో ప్రారంభించింది. కర్ణాటకకు బదులు పద్ధతిలో 200 మెగావాట్ల విద్యుత్‌ను అందిస్తూ వచ్చింది. ప్రస్తుతం కృష్ణానదిలో నీటిప్రవాహ ఉధృతి చాలా ఎక్కువ ఉండటంతో జూరాలలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధ్యంకావటంలేదు. ప్రవాహ ఉధృతిని అనుసరించి విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని, ప్రతిరోజూ.. ప్రతి గంటా అప్రమత్తంగా ఉండాలని, సమయానుకూలంగా కావాల్సిన వ్యూహం అనుసరించాలని జూరాల విద్యుత్ ప్లాంట్ల అధికారులకు సీఎండీ చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా.. 1250 మెగావాట్ల ఉత్పత్తి

ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో కృష్ణానదిలో ప్రవహిస్తున్న వరదను ఉపయోగించుకుని తెలంగాణ జెన్‌కో వీలైనంతవరకు జలవిద్యుత్ ఉత్పత్తి చేయాలనే ఆలోచనను అమల్లోకి తెచ్చింది. సీఎం కే చంద్రశేఖర్‌రావు సూచనతో.. జలవిద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది. జూరాలలో 39 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు యూనిట్లు ఉండగా.. పూర్తిస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తిచేస్తున్నారు. లోయర్ జూరాలలో 40 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు యూనిట్లు ఉన్నాయి. శ్రీశైలంలో 900 మెగావాట్ల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తున్నారు. దీనితో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1250 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. మన రాష్ట్ర అవసరాలకు అండగా జలవిద్యుత్ నిలుస్తున్నది.

నాగార్జునసాగర్, పులిచింతలలోనూ..

బుధవారం సాయంత్రానికి నాగార్జునసాగర్‌లో 134 టీఎంసీల నీరు ఉన్నది. శ్రీశైలం రెండుమూడురోజుల్లో పూర్తిగా నిండే అవకాశం ఉండటంతో అక్కడ గేట్లు ఎత్తేయడం ఖాయంగా కనిపిస్తున్నది. దీనితో నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతుందని, ఆ సమయంలో సాగర్‌లో 815 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని జెన్‌కో నిర్ణయించింది. నాగార్జునసాగర్ నిండి.. అక్కడినుంచి కూడా నీరు విడుదలయితే పులిచింతలలో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నది. కొన్నేండ్లుగా కృష్ణానదిలో నీటిప్రవాహం తగ్గుతున్నందున జూరాల నుంచి పులిచింతల వరకు అన్ని జలవిద్యుత్ కేంద్రాల్లో ఒకేసారి పూర్తిసామర్థ్యంతో జలవిద్యుత్ ఉత్పత్తి ఇటీవలికాలంలో సాధ్యంకాలేదు. ఈసారి కృష్ణానదిలో నీటిప్రవాహం ఎక్కువగా ఉండటంతో అన్ని జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి చేయడానికి జెన్‌కో సర్వసన్నద్ధంగా ఉన్నది.

కొనసాగుతున్న గంగమ్మ పరవళ్లు

- ప్రాణహిత నుంచి 3.53 లక్షల క్యూసెక్కులు
- మేడిగడ్డలో 46 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- అన్నారంలోకి 76 వేల క్యూసెక్కులు
- ఎల్లంపల్లిలో పదిగేట్లు ఎత్తివేత

మేడిగడ్డ బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న గోదావరి నీరు

ములుగు జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:

గోదావరి ఉధృతి కొనసాగుతున్నది. కాళేశ్వరం వద్ద గోదావరిలోకి ప్రాణహిత నుంచి 3.53 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి కలుస్తున్నది. మేడిగడ్డ బరాజ్‌లో ప్రస్తుతం 2.93 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఇంజినీర్లు తెలిపారు. మానేరు నది, సుందిల్ల బరాజ్‌లో 37 గేట్లు ఎత్తడంతో 53,000 క్యూసెక్కుల నీరు, సుందిల్లనుంచి అన్నారం బరాజ్‌వరకు 35 చిన్నచిన్న వాగులనుంచి వస్తున్న నీరు కలిపి మొత్తం 76,600 క్యూస్కెక్కులు వస్తుండటంతో అన్నారంలో 17గేట్లద్వారా నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 6.82 టీఎంసీ నీరు నిల్వ ఉన్నది. కడెం ప్రాజెక్టుకు 7,979 క్యూసెక్కుల వరద వస్తుండగా.. దిగువకు 7,984 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎల్లంపల్లికి 54,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 67,155 క్యూసెక్కులను వదులుతున్నారు. మరోవైపు పేరూరు దగ్గర గోదావరిలో సుమారు 7.60 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. దిగువన ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో 10.62 లక్షల క్యూసెక్కులు ఉండగా.. అవుట్‌ఫ్లో 10.51 లక్షల క్యూసెక్కులు ఉన్నది. ఈ నీటిసంవత్సరంలో గోదావరి నుంచి దాదాపు 655 టీఎంసీలు సముద్రంలో కలిశాయి.

భద్రాద్రి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం ఏజెన్సీలో మళ్లీ గోదావరి పెరుగుతున్నది. బుధవారం ఉదయం 7 గంటలకు 39.2 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం.. 11 గంటలకు 39.1 అడుగులకు తగ్గింది. కానీ.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి క్రమంగా పెరుగుతూ రాత్రి పది గంటల సమయంలో 43 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

బొగత విశ్వరూపం

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలోని బొగత జలపాతం ఉధృతంగా దుంకుతున్నది. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో గుట్టలపై నుంచి వస్తున్న వరదనీటితో తెలంగాణ నయాగరా బుధవారం విశ్వరూపం చూపింది. జలపాతం వద్ద ఉన్న హట్స్ దాటి చిల్డ్రన్స్‌పార్క్ వద్దకు నీరు ప్రవహిస్తుండటంతో జలపాతం సందర్శనకు అనుమతిని నిలిపివేసినట్లు ఎఫ్‌ఆర్వో డోలీ శంకర్ తెలిపారు. జలపాతం ప్రవేశమార్గంతోపాటు.. చీకుపల్లి గ్రామం వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. వర్షాలు ఎక్కువగా ఉండడం వల్ల బొగత ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నదని అటవీ అధికారులు తెలిపారు.

త్వరలోనే 'బాహుబలి' వెట్‌రన్

మంథని, నమస్తే తెలంగాణ/ధర్మారం/ రామడుగు: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ అండర్‌టన్నెల్‌లోని బాహుబలి మోటర్లకు త్వరలోనే వెట్‌రన్ నిర్వహించనున్నట్లు కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సుందిల్ల బరాజ్‌తోపాటు ఏడో ప్యాకేజీ, ఎనిమిదో ప్యాకేజీ అండర్ టన్నెళ్లను ఈఎన్సీ సందర్శించారు. ధర్మారం మండలం మల్లాపూర్ శివారులోని 7వ ప్యాకేజీ అండర్ టన్నెల్‌లో నీటిసరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేవని సంతృప్తి వ్యక్తంచేశారు. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌లో నీటి లీకేజీ పరీక్షలు జరుగుతున్నాయని, మూడురోజుల్లో పరీక్షలు పూర్తిచేసిన తర్వాత బాహుబలి మోటర్లకు వెట్‌రన్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ప్రాజెక్టు ఈఈ నూనె శ్రీధర్, డీఈ గోపాలకృష్ణ, ఏజన్సీ ప్రతినిధులు ఉన్నారు.

HOLY MARY INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
(Approved by AICTE, Affiliated to JNTUH, Accredited by NAAC 'A' Grade)
Bogaram(V), Keesara(M), Medchal(D). Hyderabad- 501 301
Ph : 98488 89961 / 62 / 63 /64 / 65, www.hits.ac.in
Applications are invited for eligible candidates and also attended with Original Certificates on or before 10-08-2019, seats will be allotted as per Convenor, TSEAMCET-2019 guidelines.
SPOT ADMISSION NOTIFICATION

Course	Branch	On or before
B.Tech	CSE, ECE, CIVIL, EEE, MEC	10.08.2019

PRINCIPAL

క్షేత్రీయ కార్యాలయ : తెలంగాణ /రీజినల్ కార్యాలయం: తెలంగాణ
కర్మచారి రాజ్య బీమా నిగమ /కార్మిక రాజ్య బీమా సంస్థ
5-9-23, హిల్ ఫోర్ట్ రోడ్, హైదరాబాద్ /హిల్ ఫోర్ట్ రోడ్,
ఆదర్శ్‌నగర్, హైదరాబాద్-500063
ఐ.ఎస.ఓ./ISO 9001:2015(క్యు.ఎం.ఎస./QMS)ప్రమాణిత కార్యాలయ/ ధృవీకృత కార్యాలయం
దూరభాష/ ఫోన్040-23232356,7,8 Fax:040-23235048
సవరణ
eprocure.gov.in/procure/app మరియు ఈ దినపత్రికలో 31.07.2019న ప్రచురించబడిన శాఖ కార్యాలయం, రామగుండం కొరకు వసతి అద్దెకు తీసుకొనుటపై టెండరు ID 2019_ESIC_490744_1 కొరకు, టెండరు దాఖలు తేది: 20.08.2019న మ. 1.00 గం|| వరకు పొడిగించబడింది. టెండరు 21.08.2019న మ. 1.00 గం.కు తెరువబడుతుంది. ఇతర నియమ నిబంధనలలో ఎట్టి మార్పులేదు.
అడిషనల్ కమిషనర్ & లీజినల్ డైరెక్టర్

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
(రిజిస్టర్డ్) గురుకులం, హైదరాబాద్
స్పోర్ట్స్ అకాడమిలు మరియు స్పోర్ట్స్ పాఠశాలల కోసం పార్ట్ టైమ్ కోచ్‌ల కోసం దరఖాస్తుల దాఖలు
ప్రస్తుతమున్న TTWREIS సంస్థలలో 23 మినీ స్పోర్ట్స్ అకాడమిలు మరియు 2 స్పోర్ట్స్ పాఠశాలలు TTWREIS ఏర్పాటుచేసింది. సంస్థలో పార్ట్‌టైం కోచ్‌లుగా పని చేయుటకు ఆసక్తిగలవారు NS-NIS , 1సంవత్సరం డిప్లొమా/6 వారాల కోర్సు మొ|| వాటియొక్క అర్హతతో దరఖాస్తు చేసుకోగలరు. స్పోర్ట్స్ అకాడమిలు మరియు స్పోర్ట్స్ పాఠశాలల కోసం పార్ట్‌టైం కోచ్‌ల కోసం TTWREIS కార్యాలయం వద్ద దరఖాస్తు దాఖలు కోసం ఆఖరి తేదీ 8-8-2019 నుండి 19-8-2019 వరకు. తదుపరి వివరాలు www.tgtwgurukulam.telangana.gov.in వద్ద లభిస్తాయి. వివరాలకు సంప్రదించండి: 9121174434, 9182564280, 9440410023.
తేది: 6-8-2019
ప్రదేశం: హైదరాబాద్
సం/- డా|| ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, IPS, కార్యదర్శి (FAC)
DIPR RO No.299-PP/CL/Advt/1/2019-20, Dt: 7/8/2019

గ్రీన్ గాంధీనగర్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల విద్యాలయంలో 2016 జూలై 5న మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్

మిట్టపల్లి గురుకుల విద్యాలయంలో 2016 జూలై 5న సీఎం కేసీఆర్ నాటిన మొక్క ప్రస్తుతం ఏపుగా ఇలా..

ఏపుగా పెరిగిన సీఎం కేసీఆర్ నాటిన మొక్క

సిద్దిపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న హరితహారం రెండోవిడుత కార్యక్రమంలో భాగంగా 2016 జూలై 5న సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల విద్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మొక్క నాటారు. ప్రస్తుతం ఆ మొక్క పెరిగి వృక్షంగా మారుతున్నది. గురుకుల విద్యార్థులు, పాఠశాల సిబ్బంది అందరూ అక్కడ నాటిని ప్రతి మొక్కను సంరక్షిస్తున్నారు.

- ఆదర్శంగా సూర్యాపేట పురపాలిక విలీన గ్రామం
- హరితహారంలో నాటిన మొక్కలు 79 వేలు
- ప్రతి ఇంటిముందు మొక్కతో ఊరంతా పచ్చదనం

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

మొక్కలు పెంచాలన్న ఆసక్తికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమం తోడైంది. ప్రతి ఇంటి ముందు మొక్కలు పెట్టడం మొదలైంది. ఇండ్లలోనూ పూలు, పండ్ల మొక్కలు నాటడం ఉద్యమంలా మారింది. ఇలా సూర్యాపేట పురపాలికలో విలీన గ్రామమైన గాంధీనగర్ ప్రస్తుతం పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా తయారైంది. ఎటుచూసినా హరితమే కనిపిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నది. హరితహారం కార్యక్రమం ద్వారా నాలుగువిడుతల్లో 79 వేల మొక్కలు నాటగా, అవి ప్రస్తుతం ఏపుగా పెరిగాయి.

సూర్యాపేట శివారు గాంధీనగర్‌లో నాటిన మొక్కలు

గాంధీనగర్‌లో 2006లోనే అప్పటి సర్పంచ్ వట్టె జానయ్యయాదవ్ మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. కానీ, హరితహారం కార్యక్రమంతో ఈ గ్రామం మరింత పచ్చగా మారింది. హరిత స్ఫూర్తితో కొనసాగాలని తొలివిడుత హరితహారంలో మొక్క నాటిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. అప్పటి నుంచి జానయ్యయాదవ్ నాటిన మొక్కలను కాపాడేందుకు సొంతంగా ట్యాంకర్‌ను ఏర్పాటుచేశారు. దాదాపు 85శాతానికి పైగానే మొక్కలు బతికాయి. 2001 నుంచి 2019వరకు గ్రామానికి చెందిన వట్టె జానయ్య యాదవ్, రేణుక దంపతుల్లో ఎవరినో ఒకరిని ఉప సర్పంచ్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీగా ప్రజలు గెలిపించారు. తొలి రోజుల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి ఇండ్లలో నాటించగా.. నేడు అవి వృక్షాలుగా మారాయి.

బాధ్యతగా మొక్కల సంరక్షణ

ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టగా నాలుగువిడుతల్లో ఈ గ్రామంతోపాటు రెండు ఆవాస తండాల్లో 79 వేల మొక్కలు నాటారు. గతంలోనే మొక్కల పెంపకంపై కొంత మేర అవగాహన ఉన్న గ్రామస్థులు హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను చేపట్టారు. ఇండ్ల ముందు నాటిన మొక్కలకు నీళ్లు పోయడం ప్రారంభించారు. నీటిఎద్దడి ఏర్పడిన పలుమార్లు జానయ్య యాదవ్ ఓ ట్యాంకర్‌ను ఏర్పాటుచేసి మొక్కలకు నీటిని పోయించారు. గ్రామంలోని రోడ్లకు రెండుపక్కల నాటిన మొక్కలకు కంచె ఏర్పాటుచేయడంతో అవి ఏపుగా పెరుగుతున్నాయి.

Hindustan Unilever Limited
PRIME LAND PARCEL FOR SALE IN "MULTI PURPOSE USE" ZONE NEAR HYDERABAD
Offering prime land parcel with existing structure on "as is where is" basis situated along NH-202, at Ghatkesar (near Hyderabad), Telangana
- Freehold with clear & marketable title
- Located within growth corridor of Outer Ring Road entitled for multipurpose use zone
- Land measuring approx. 25.4 Acres on independent plot survey No. 590, 591, 592, 600, Ghatkesar, Medchal-Malkajgiri district
- Built up area of approx. 13,457 sq. mtr of existing factory structure
- Current use of property is industrial & change of land use is permissible. Almost entire land is classified as 'Special Development zone' for residential, commercial, institutional use etc.

The last date of receiving sealed bids in prescribed bid format at HUL office, Andheri, Mumbai is by 3rd September, 2019
For further details please contact: CBRE South Asia Pvt. Ltd.
SANDEEP +91 99633 08811
gsandeep.reddy@cbre.co.in
MANOJ +91 99664 82532
barlapudi.manoj@cbre.com
CBRE
CIN - U74140DL1999PTC100244

సుష్మాస్వరాజ్ నివాసంలో నివాళులు అర్పిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఢిల్లీలోని శ్మశానవాటికలో సుష్మాస్వరాజ్ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న మోదీ..

సుష్మను తలుచుకొని భావోద్వేగానికి గురైన దృశ్యం

సుష్మాస్వరాజ్ తన సోదరిలాంటివారంటూ కన్నీటిపర్యంతం అవుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శిష్యురాలి మరణంతో విషణ్ణవదనంతో ఎల్‌కే అద్వానీ

ఇండోర్‌లో తనను పాకిస్థాన్ నుంచి మాతృభూమి భారత్‌కు తీసుకొచ్చిన కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌ను తలచుకొని ఏడుస్తున్న గీత. చిన్నతనంలో అనుకోకుండా సరిహద్దు దాటి పాకిస్థాన్‌కు వెళ్లిపోయిన మూగ, చెవిటి బాలిక గీత.. 15 ఏండ్ల తర్వాత సుష్మాస్వరాజ్ సాయంతో తిరిగి భారత్‌కు చేరుకున్నారు.

చిన్నమ్మకు కన్నీటి వీడ్కోలు

ఢిల్లీలో అశేష అభిమానులు వెంటరాగా సుష్మాస్వరాజ్ పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో శ్మశానవాటికకు తరలిస్తున్న దృశ్యం

సుష్మాస్వరాజ్ అంత్యక్రియలు పూర్తి

- నివాళులర్పించిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, పలువురు ప్రముఖులు
- భావోద్వేగానికి గురైన ప్రధాని, కన్నీటిపర్యంతమైన ఎల్‌కే అద్వానీ
- ప్రియతమ నేతకు తుది వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన వేలాది మంది అభిమానులు
- అంత్యక్రియల్లో పాల్గొన్న మోదీ, అమిత్‌షా తదితరులు



న్యూఢిల్లీ, ఆగస్టు 7: గుండెపోటుతో హఠాన్మరణం చెందిన కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ (67) అంత్యక్రియలు బుధవారం పూర్తయ్యాయి. ఢిల్లీలో లోధీ రోడ్‌లోని శ్మశానవాటికలో దహనసంస్కారాలు పూర్తిచేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే, పార్టీలకతీతంగా పలువురు నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. తమ ప్రియతమ నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు వేల మంది అభిమానులు, బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. అధికారిక లాంఛనాల మధ్య విద్యుత్ దహనవాటిలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. అంతకుముందు రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ, అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా, ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, గులాంనబీ ఆజాద్, సీపీఎం నేత బృందా కారత్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, యోగాగురువు రామ్‌దేవ్ బాబా, నోబెల్ గ్రహీత కైలాశ్ సత్యార్థి సహా పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, వివిధ పార్టీల నేతలు జంతర్‌మంతర్‌లోని సుష్మ నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. సుష్మాస్వరాజ్ రాజకీయ గురువు, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ ఆమె పార్థివదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. టీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్ కూడా సుష్మకు నివాళులర్పించారు. దేశం ఒక గొప్ప నేతను కోల్పోయిందని, తెలంగాణ బిల్లు విషయంలో ఆమె ఎంతో సాయం చేశారని కేకే గుర్తుచేశారు. అనంతరం సుష్మ మృతదేహాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం బీజేపీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. అమిత్‌షా, జేపీ నడ్డా ఆమె పార్థివదేహంపై జాతీయ పతాకాన్ని కప్పారు. అనంతరం పలువురు నేతలు, వందల మంది అభిమానులు నివాళులు అర్పించారు. 'సుష్మా స్వరాజ్ అమర్‌రహే' అని నినాదాలు చేశారు. అనంతరం మృతదేహాన్ని లోదీ రోడ్‌లోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా సుష్మ భర్త స్వరాజ్ కౌషల్, కుమార్తె బన్సురి ఆమె పార్థివదేహానికి 'సెల్యూట్' చేసి అంతిమ వీడ్కోలు పలికారు. కుమార్తె బన్సురి.. సుష్మకు అంత్యక్రియలు నిర్వహించారు.

భారత రాజకీయాల్లో ధ్రువతార

సుష్మాస్వరాజ్ పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనంతరం అమిత్‌షా మాట్లాడుతూ ఆమె హఠాన్మరణం బీజేపీతోపాటు భారత రాజకీయాల్లో తీరని లోటన న్నారు. సుష్మ మరణం తనతోపాటు కోట్లాది మందిని శోకసంద్రంలో ముంచిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'భారత రాజకీయాల్లో సుష్మ ఒక ధ్రువతార. అసలైన రాజకీయ ప్రతినిధి. గత ఐదేండ్లలో విదేశాంగశాఖ మంత్రిగా ఆమె దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్నత శిఖరాలకు చేర్చారు. ఆమె లేనిలోటు సుస్పష్టం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. సుష్మాస్వరాజ్ హఠాన్మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ పేర్కొన్నారు. 'నా ప్రతి పుట్టినరోజు నాడు ఆమె నాకు ఇష్టమైన చాక్‌లెట్ కేక్‌ను బహుమతిగా ఇచ్చేవారు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా తప్పలేదు. యువ నేతగా నా బృందంలోకి అడుగుపెట్టి అత్యంత సమర్థురాలిగా నిరూపించుకున్నారు. కొన్నేండ్లలోనే భారత రాజకీయాల్లో గొప్ప పేరు సంపాదించారు. పార్టీలోని ప్రధాన నేతల్లో ఒకరిగా ఎదిగారు. దేశంలోని మహిళలందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆమె గొప్ప వక్త కూడా. ఆమె వాక్పటిమ, జ్ఞాపకశక్తిని చూసి నేను అబ్బురపడేవాడిని' అంటూ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సుష్మ తనకు సోదరి వంటిదని, ఆమె పార్టీలకు అతీతంగా అందరు నేతలతో సుహృద్భావంతో మెలిగేవారని గులాంనబీఆజాద్ కొనియాడారు. భారత విదేశాంగ విధానానికి సుష్మ ప్రతీకగా నిలిచారని జమాత్ ఉలేమా ఏ హింద్ మౌలానా జాతీయాధ్యక్షుడు సుహైబ్ ఖాస్మి కొనియాడారు.

అంత్యక్రియలకు హాజరైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, గడ్కరీ, రాజ్‌నాథ్, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే తదితరులు

సుష్మ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న సోనియా

అద్భుతమైన వక్త

సోనియా సంతాపం

న్యూఢిల్లీ: సుష్మ స్వరాజ్ అద్భుతమైన వక్త, గొప్ప పార్లమెంటేరియన్ అని కాంగ్రెస్ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. సుష్మ హఠాన్మరణంపై సంతాపం తెలుపుతూ ఆమె భర్త స్వరాజ్ కౌశల్‌కు సోనియా బుధవారం లేఖ రాశారు. ' సుష్మా స్వరాజ్ ఆకస్మిక మరణం నన్ను చాలా బాధించింది. సుష్మ అసాధారణ ప్రత్యేకతలు ఉన్న మహిళ. ఆమె ధైర్యం, సంకల్పం, అంకితభావం, సామర్థ్యం.. ఆమె చేపట్టిన ప్రతి పదవికి వన్నెతెచ్చాయి. సుష్మ అద్భుతమైన వక్త. గొప్ప పార్లమెంటేరియన్. ఆమెలోని కరుణ వంటి గుణాలతో భారతీయ దౌత్యానికి మానవీయ కోణాన్ని ఆపాదించారు. లోక్‌సభలో చాలా కాలం సభ్యులుగా ఉన్న మా ఇద్దరి మధ్య వ్యక్తిగత అనుబంధం చాలా ధృఢమైనది. ఆమె లేని లోటు పూడ్చలేనిది' అని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా గౌరవం పొందిన వ్యక్తి

మన్మోహన్ సింగ్

సుష్మ స్వరాజ్ పార్టీలకతీతంగా గౌరవం పొందిన వ్యక్తి అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కొనియాడారు. ఆమె ఆకస్మిక మరణంపై తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. 'సుష్మ చాలా గొప్ప పార్లమెంటేరియన్, అసాధారణమైన ప్రతిభ కలిగిన కేంద్ర మాజీ మంత్రి. ఆమె మరణంతో గౌరవం, అంకితభావం ఉన్న నాయకురాలిని దేశం కోల్పోయింది' అని అభివర్ణించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సుష్మతో తనకున్న అనుబంధాన్ని మన్మోహన్ సింగ్ గుర్తు చేసుకున్నారు.

మనసును గెలిచి.. గుండెల్లో నిలిచి..

- సుష్మ మరణం తీరని లోటు
- ఓ సోదరిని, స్నేహితురాలిని కోల్పోయామన్న ప్రపంచదేశాలు

సుష్మాస్వరాజ్ ఆత్మశాంతి కోసం భూటాన్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: మానవత్వం, మంచితనం, చెరగని చిరునవ్వుతో భారత ప్రజల హృదయాలనేగాక ప్రపంచ దేశాల మనసును దోచుకున్న విదేశాంగ శాఖ మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్‌కు అన్ని దేశాల నాయకులు నివాళులర్పించారు. చైనా, అమెరికా, శ్రీలంక, సింగపూర్ తదితర దేశాలు, ఐక్యరాజ్యసమితి ఆమె సేవలను కొనియాడాయి. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మాట్లాడుతూ 'మంచి స్నేహితురాలిని కోల్పోయాం. భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో సుష్మ కృషి మరువలేనిది. ఆమె సేవలను బంగ్లాదేశీలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు' అని తెలిపారు. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజాస్వామ్యం పెరుగుతున్నా కొద్దీ శాంతి విస్తరిస్తుందని సుష్మ పేర్కొనేవారని గుర్తుచేశారు. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి హూ చున్యింగ్ మాట్లాడుతూ భారత్, చైనా మధ్య సంబంధాల బలోపేతంలో సుష్మ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమసింఘే స్పందిస్తూ సుష్మాస్వరాజ్ లాంటి నిజమైన స్నేహితురాలు మరణించడం బాధాకరమని తెలిపారు. సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రి వివియన్ బాలకృష్ణన్ మాట్లాడుతూ సుష్మ మంచి స్నేహితురాలని, ప్రవాస భారతీయుల కోసం ప్రపంచ వేదికలపై తన గొంతును వినిపించేవారని పేర్కొన్నారు. రష్యా విదేశాంగ శాఖ ట్వీట్ చేస్తూ సుష్మాస్వరాజ్ ఆకస్మిక మృతిపై సంతాపం తెలియజేస్తున్నామని పేర్కొంది. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి అల్జెండర్ జీగ్లర్ స్పందిస్తూ సుష్మాస్వరాజ్ అత్యంత వినయవంతురాలని, మర్యాదస్తురాలని కొనియాడారు. ఆమె మృతికి సంతాపం తెలుపుతున్నామన్నారు. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రాన్ మల్కా సుష్మాస్వరాజ్ నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి జారిఫ్ ట్వీట్ చేస్తూ 'సుష్మాస్వరాజ్ ఆకస్మిక మృతి భారతీయులకేగాక ఇరాన్ ప్రజలకు కూడా బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షురాలు మరియా ఫెర్నాండా ఎస్పినోసా ట్వీట్ చేస్తూ 'సుష్మా స్వరాజ్ మరణించిన విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యా. అమె అత్యంత ప్రభావశీల మహిళ. ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేశారు' అని పేర్కొన్నారు.

అంబాలా ముద్దుబిడ్డ

బాల్యంలో సోదరుడితో..

చండీగఢ్: ఎంత ఎత్తుకు ఎదిగినా.. మూలాలు మరిచిపోని నేత సుష్మాస్వరాజ్. ఆమె హఠాన్మరణంతో చండీగఢ్‌లోని అంబాలా కంటోన్మెంట్ శోకసంద్రంలో మునిగిపోయింది. సుష్మ బాల్యమంతా ఈ ప్రాంతంలోనే గడిచింది. ఆమె కుటుంబం అంబాలాలోని బీసీ బజార్‌లో నివాసం ఉండేవారు. పాఠశాల విద్య నుంచి దేశం మెచ్చే రాజకీయ నేతగా ఎదిగేవరకు ఆమె ప్రతి అడుగూ ఈ ప్రాంతంలోనే మొదలైంది. అంబాలాలోని ఎస్డీ కాలేజ్‌లో చదువు పూర్తిచేసిన అనంతరం సుష్మ చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీకి వెళ్లి లా కోర్సు చేశారు. 'సుష్మ ఆరో తరగతి నుంచే రాజకీయాలవైపు మొగ్గుచూపేవారు. కొన్నేండ్లకే ఆమె తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకున్నారు' అని బీసీ బజార్‌కు చెందిన శ్యామ్ బిహారీ గుర్తుచేసుకున్నారు. ఆమె ప్రతి ఒక్కరితోనూ ప్రేమగా ఉండేవారని, ఎవరు, ఎప్పుడు సహాయం అడిగినా చేయడానికి ముందుండేవారని చెప్పారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తి అయినా సరే ఆపదలో ఉంటే సహాయానికి వెనుకాడేవారు కాదన్నారు. సుష్మను తామంతా 'అత్తా' అని పిలిచేవారమని ఒకప్పటి ఆమె ఇంటి పనిమనిషి గౌరీ తెలిపారు.

బళ్లారి మాతృమూర్తి!

- కర్ణాటకతో సుష్మకు విడదీయరాని అనుబంధం

సోనియాతో సాన్నిహిత్యం

బెంగళూరు: విదేశాంగశాఖ మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌కు కర్ణాటకతో ప్రత్యేకించి బళ్లారితో విడదీయరాని అనుబంధం ఉన్నది. 1999లో బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతో సుష్మ తలపడ్డారు. అప్పటివరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన ఆ స్థానంలో 50,000 ఓట్ల తేడాతో సుష్మ ఓటమి పాలైనప్పటికీ, ఆ తర్వాత కూడా నియోజకవర్గ ప్రజలతో సంబంధాలను కొనసాగించారు. ఆ తర్వాతి ఏడాది నుంచి దశాబ్ద కాలం పాటు ఏటా వరలక్ష్మి వ్రతం వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె బళ్లారి వచ్చేవారు. కన్నడ భాష నేర్చుకుని, సభలు, సమావేశాల్లో కన్నడలోనే మాట్లాడుతూ ఎంతో మంది హృదయాలను గెలుచుకున్నారు. తనను కలువడానికి వచ్చిన కర్ణాటక నేతలతో ఆమె కన్నడలోనే సంభాషించేవారు. 'కర్ణాటకతో ప్రత్యేకించి బళ్లారితో సుష్మాస్వరాజ్ వ్యక్తిగత అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. అందుకే ఆమెను బళ్లారి మాతృమూర్తిగా పిలుస్తుంటారు' అని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సుష్మ భర్తకు పంపిన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

ఈ నవ్వులకు ఇక సెలవు

2005లో ఢిల్లీలో నిర్వహించిన తీజ్ పండుగ సందర్భంగా..

రాజకీయ గురువు ఎల్‌కే అద్వానీతో..

1998లో పార్టీ విజయోత్సవాల్లో భాగంగా..

కాంగ్రెస్ నేత ఆజాద్‌తో..

పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీని ఆలింగనం చేసుకుంటున్న సుష్మ

సుష్మ నా తల్లిలాంటి వారు

తల్లితో హమీద్ అన్సారీ(ఫైల్)

దేశంకాని దేశంలో అష్టకష్టాలు పడిన భారతీయులకు విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు సుష్మ స్వరాజ్ ఎంతో అండగా నిలిచిన సంగతి తెలిసిందే. సుష్మ ఆకస్మిక మృతి నేపథ్యంలో సహాయం పొందిన వారు ఆమె ను తలచుకుని కుమిలిపోతున్నారు. 'సుష్మ మరణవార్తలను మేం వదంతులుగా భావించాం. మంచి వ్యక్తి అంత త్వరగా ఎందుకు చనిపోయారు. ఆమెను కలిసి ఏడాది కూడా కాలేదు. నన్ను తన కుమారుడిలాగా చూసుకున్నారు' అంటూ హమీద్ అన్సారీ కన్నీరుమున్నీరయ్యారు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన పాక్ యువతితో ప్రేమలో పడిన ఆయన 2012లో పాక్‌లోకి ప్రవేశించగా పోలీసులు అరెస్ట్ చేసి సైన్యానికి అప్పగించారు. 2015లో ఒక పాక్ జర్నలిస్ట్ కథనంతో అన్సారీ కస్టడీని ఆ దేశం ఒప్పుకుంది. నకిలీ పత్రాలతో ప్రవేశించినందుకు పాక్ విధించిన మూడేండ్ల జైలు శిక్ష 2018 డిసెంబర్ 15తో ముగిసింది. అయితే సరైన గుర్తింపు పత్రాలు లేకపోవడంతో అన్సారీ భారత్‌కు రాలేకపోయారు. సుష్మ చొరవతో ఎట్టకేలకు ఆరేండ్ల తర్వాత భారత్‌కు తిరిగి వచ్చారు.

వచ్చి మీ ఫీజు రూ.1 తీసుకోండి

హరీశ్‌సాల్వే

పాక్ ఉరి శిక్ష విధించిన భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషన్ జాదవ్ కేసుపై మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్‌సాల్వే అంతర్జాతీయ కోర్టులో వాదించి గెలిచిన సంగతి తెలిసిందే. ఈ కేసు కోసం తాను రూపాయి మాత్రమే ఫీజు తీసుకుంటానని ఆయన నాడు ప్రకటించారు. మంగళవారం సుష్మ చనిపోక ముందు ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన అంశాన్ని ఆయన మీడియాతో పంచుకున్నారు. 'రాత్రి 8.50కి ఆమెతో ఫోన్‌లో మాట్లాడా. బుధవారం వచ్చి మీ ఫీజు రూ.1 తీసుకెళ్లండని చెప్పారు. విలువైన ఫీజు తప్పక తీసుకుంటానని చెప్పా. అనంతరం గంటలోపే ఆమె ఈ లోకాన్ని విడిచారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

మా కోసం నాలుగేండ్లు కష్టపడ్డారు..

తమ వారి ఆచూకీ కోసం సుష్మ నాలుగేండ్లు కష్టపడ్డారంటూ.. ఇరాక్‌లో ఐఎస్ ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన 39 మంది భారతీయుల బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. 2014లో పంజాబ్‌కు చెందిన 39 మంది యువకులు ఉపాధి కోసం ఇరాక్ వెళ్లారు. ఐఎస్ ఉగ్రవాదులు మోసుల్‌లో వారిని కిడ్నాప్ చేసి బాదూష్‌కు తరలించి అక్కడ చంపేశారు. ఈ సంగతి తెలియని వారి కుటుంబాలు తమ వారి ఆచూకీ కోసం నాటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను పలు మార్లు కలిసి వేడుకున్నారు. దీంతో ఆమె నాలుగేండ్లపాటు శ్రమించి ఎట్టకేలకు 39 మంది అవశేషాలను భారత్‌కు రప్పించారు. సుష్మ చొరవతోనే తమ వారి అవశేషాలు దక్కాయని మృతుల్లో ఒకరైన మంజిందర్ సింగ్ సోదరుడు గురుపిందర్ కౌర్ తెలిపారు.

శోకసంద్రంలో ప్రవాసులు

కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ ఆకస్మిక మృతితో ప్రవాస భారతీయులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ఆపన్న హస్తం అందించి, దేశ దౌత్యవిధానానికి మానవీయ రూపమిచ్చిన మాతృమూర్తి ఇక లేరని తెలిసి తల్లడిల్లుతున్నారు. ప్రజానేతగా, 'కేరింగ్' మంత్రిగా ఆమె చిరస్థాయిగా నిలిచిపోతారని ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్ వ్యవస్థాపక కార్యదర్శి జగ్‌దీప్ అహ్లూవాలియా అన్నారు. 2017లో హరికేన్ 'హార్వే' కారణంగా వరదలు పోటెత్తినప్పుడు యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్‌లో చిక్కుకుపోయిన 200 మంది భారతీయ విద్యార్థులను రక్షించడంలో ఆమె చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేసుకున్నారు. సుష్మ మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని ఒక్లహామా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ కక్ విచారం వ్యక్తం చేశారు.

ఆర్టికల్ 370 ఇక చెల్లదు

- రాష్ట్రపతి అధికారిక ప్రకటన



న్యూఢిల్లీ, ఆగస్టు 7: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370లోని నిబంధనలు ఇక చెల్లుబాటు కాబోవని రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన తీర్మానానికి పార్లమెంట్ ఉభయసభలు ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ మేరకు రాష్ట్రపతి సంతకంతో కూడిన ఒక ప్రకటన వెలువడింది. 'ఆర్టికల్ 370లోని క్లాజ్ (3) ద్వారా దఖలుపడిన అధికారాలను అనుసరించి పార్లమెంట్ సిఫార్సు మేరకు 2019 ఆగస్టు 6 నుంచి ఆర్టికల్ 370లోని అన్ని నిబంధనలు ఇకపై చెల్లుబాటు కాబోవని రాష్ట్రపతి ప్రకటించారు' అని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అలాగే, రాజ్యాంగంలోని అన్ని నిబంధనలు, సమయానుసారం చేసే సవరణలు, ఎలాంటి మార్పులు, మినహాయింపులు లేకుండా జమ్ముకశ్మీర్‌కు వర్తిస్తాయని వివరించారు. ఆర్టికల్ 152 లేదా ఆర్టికల్ 308 లేదా రాజ్యాంగంలోని ఏ ఇతర ఆర్టికల్ అయినా లేదా జమ్ముకశ్మీర్ రాజ్యాంగంలోని ఏ ఇతర నిబంధనలు లేదా ఏ ఇతర చట్టం, పత్రం, తీర్పు, ఆర్డినెన్స్, ఆదేశం, నిబంధన, నియంత్రణ, నోటిఫికేషన్, లేదా ఏ ఇతర ఒప్పందాలు కూడా దీనికి అడ్డంకి కాబోవు అని అందులో వివరించారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడంతోపాటు జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన తీర్మానం, బిల్లుకు పార్లమెంట్ మంగళవారం ఆమోదముద్ర వేసిన విషయమూ విదితమే.

హఫీజ్ సయీద్ దోషే

- ఉగ్రవాదులకు నిధులు సమకూర్చాడు
- పాకిస్థాన్ ఉగ్రవాద నిరోధక విభాగం వెల్లడి
- కోర్టులో అధికారిక పత్రం సమర్పణ

లాహోర్, ఆగస్టు 7: ముంబై దాడుల సూత్రధారి, జమాత్ ఉద్ దవా (జేయూడీ) అధిపతి హఫీజ్ సయీద్.. ఉగ్రవాదులకు నిధుల అందజేత కేసులో దోషేనని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద నిరోధక విభాగం (సీటీడీ) బుధవారం అక్కడి కోర్టులో వెల్లడించింది. అంతర్జాతీయ ఉగ్రవాది అయిన హఫీజ్‌ను బుధవారం గుజ్రన్‌వాలాలోని యాంటీ టెర్రరిజం కోర్టులో (ఏటీసీలో) ప్రవేశపెట్టారు. ఇదే కోర్టులో పంజాబ్ సీటీడీ పోలీసులు అతడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ఉగ్రవాదులకు నిధుల అందజేత కేసులో సయీద్ దోషేనని ఈ మేరకు కోర్టులో చలాన్ (అధికారిక పత్రం) సమర్పించినట్లు సీటీడీ అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసు పంజాబ్‌లోని మండి బౌద్దీన్‌కు సంబంధించినది కావడంతో దీనిని గుజరాత్ ఏటీసీ కోర్టుకు బదిలీ చేయాలని ప్రాసిక్యూషన్ చేసిన విజ్ఞప్తి మేరకు కోర్టు ఈ కేసును అక్కడకు బదిలీ చేసినట్లు వివరించారు. (పంజాబ్, గుజరాత్ పేర్లతో పాకిస్థాన్‌లోనూ ప్రాంతాలున్నాయి. పంజాబ్ రాష్ట్రం కాగా, దానిలో గుజరాత్ ఒక జిల్లా) తదుపరి విచారణ గుజరాత్ ఏటీసీలో జరుగనుందని చెప్పారు. లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు అయిన హఫీజ్ సయీద్ ఉగ్రవాదులకు నిధుల అందజేత కేసులో ముందస్తు బెయిల్ తెచ్చుకునేందుకు జూలై 17న లాహోర్ నుంచి గుజ్రన్‌వాలాకు వెళ్తుండగా మార్గమధ్యంలో సీటీడీ పోలీసులు అడ్డగించి అతడిని అరెస్ట్ చేశారు. అత్యంత భద్రతతో కూడిన కోట్ లఖ్‌పట్ జైలుకు తరలించారు. 2008లో 166 మంది ప్రాణాలను బలిగొన్న ముంబై ఉగ్రదాడులకు హఫీజ్ సయీదే సూత్రధారి. 2008 డిసెంబర్‌లో అతడిని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అమెరికా కూడా సయీద్‌పై కోటి డాలర్ల రివార్డును ప్రకటించింది. ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నాడన్న అభియోగాలపై హఫీజ్‌తోపాటు 12మంది జేయూడీ నాయకులపై సీటీడీ పోలీసులు జూలైలో 23 కేసులు నమోదుచేశారు. పుల్వామా ఉగ్రదాడి అనంతరం అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో జేయూడీ, దాని అనుబంధ ధార్మిక సంస్థ ఫలా ఎ ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్) ఆస్తులను పాకిస్థాన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. లాహోర్, మురిద్కేలలో జేయూడీ ప్రధాన కార్యాలయాల్లోకి అడుగుపెట్టకుండా హఫీజ్‌ను అడ్డుకుంది. ఉగ్రవాదులకు నిధుల అందజేత అభియోగాలపై సయీద్ బావమరిది అబ్దుల్ రెహ్మాన్ మక్కీని కూడా ఇటీవల అరెస్ట్ చేసింది.

భారత రాయబారి బహిష్కరణ

- కశ్మీర్‌పై భారత్ చర్యలను నిరసిస్తూ పాకిస్థాన్ నిర్ణయం
- ద్వైపాక్షిక వాణిజ్యం నిలిపివేత.. ఒప్పందాలపై సమీక్ష
- ఆగస్టు 14న కశ్మీరీలకు సంఘీభావం.. 15న బ్లాక్ డే
- ఎన్ఎస్‌సీ సమావేశంలో పాక్ నిర్ణయాలు

అజయ్ బసారియా

ఇస్లామాబాద్, ఆగస్టు 7: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయంపై పాకిస్థాన్ తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది. కశ్మీర్‌పై భారత్ ఏకపక్షంగా, అక్రమంగా నిర్ణయం తీసుకున్నదని ఆరోపిస్తూ తమ దేశంలోని భారత హైకమిషనర్ (రాయబారి) అజయ్ బిసారియాను బహిష్కరించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను తగ్గించుకోవాలని, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. అలాగే రెండు దేశాల మధ్య ఒప్పందాలను సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నది. పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అధ్యక్షతన బుధవారం జరిగిన జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భేటీ అనంతరం పాక్ విదేశాంగ శాఖ మంత్రి మెహమూద్ ఖురేషి మాట్లాడుతూ.. 'మా రాయబారులు ఇకపై ఢిల్లీలో ఉండరు. అలాగే ఇక్కడున్న భారత రాయబారిని వెనక్కి పంపుతాం' అని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత హైకమిషనర్ అజయ్ బిసారియా పాక్‌లో విధులు నిర్వహిస్తుండగా, పాకిస్థాన్ హైకమిషనర్ మొయిన్ ఉల్ హక్ ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించాల్సి ఉన్నది. భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తలెత్తే పరిణామాలు, జమ్ముకశ్మీర్‌తోపాటు, నియంత్రణ రేఖ వెంబడి పరిస్థితులపై సమావేశంలో చర్చించినట్లు ఎన్ఎస్‌సీ భేటీ అనంతరం పాక్ ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

ఐక్యరాజ్యసమితి దృష్టికి..

ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి దృష్టికి తీసుకెళ్లాలని ఎన్ఎస్‌సీ సమావేశంలో తీర్మానించారు. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినమైన ఆగస్టు 14వ తేదీని కశ్మీరీలకు సంఘీభావ దినంగా, భారత స్వాతంత్ర్య దినమైన ఆగస్టు 15వ తేదీని బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించారు. కశ్మీర్ లోయలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని ఆరోపిస్తూ, ఈ విషయాన్ని వెలుగులోకి తేవాలని దౌత్య విభాగాలన్నింటినీ పాక్ ప్రధాని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మిలిటరీకి సూచించారు. విదేశాంగ, రక్షణ, అంతర్గత వ్యవహారాల శాఖల మంత్రులు, ఆర్థిక సలహాదారు, జమ్ముకశ్మీర్ వ్యవహారాల మంత్రి, త్రివిధ దళాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు ఎన్ఎస్‌సీ సమావేశంలో పాల్గొన్నారు. ఇమ్రాన్‌ఖాన్ మంగళవారం పాకిస్థాన్ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని రద్దు చేయడం వల్ల పుల్వామా తరహా దాడులు జరుగొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల రెండు దేశాల మధ్య యుద్ధం తలెత్తవచ్చని పేర్కొన్నారు. 'ఆ యుద్ధంలో ఎవరూ గెలిచే పరిస్థితి ఉండదు. దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. కశ్మీర్ పరిస్థితిపై వివరించేందుకు ప్రపంచ అధినేతలను సంప్రదిస్తామన్నారు. ఐరాస భద్రతామండలి సహా అన్ని వేదికలపైనా పోరాటం సాగిస్తామని చెప్పారు. అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. కాగా, కశ్మీర్ పరిస్థితిపై సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌కు పాక్ ప్రధాని బుధవారం వివరించారు. పాక్ విదేశాంగ మంత్రి ఖురేషి బుధవారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. కశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని రద్దు చేయడం ద్వారా భారత్ తనకు తానే హాని చేసుకుంటున్నదని చెప్పారు. కశ్మీర్‌పై భారత చర్యలను ఖండిస్తూ, కశ్మీరీలకు మద్దతు తెలుపుతూ పాక్ పార్లమెంట్ ఓ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

పాకిస్థాన్‌లో భారత్ అనుకూల బ్యానర్లు

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని తొలిగిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసిస్తూ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని హైసెక్యూరిటీ రెడ్ జోన్‌తో సహా పలు ప్రాంతాల్లో బ్యానర్లు వెలిశాయి. పాకిస్థాన్‌తోపాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లతో కూడిన అఖండ భారత్‌ను బ్యానర్లలో ముద్రించారు. బలూచిస్థాన్‌పై పాక్‌కు హెచ్చరికలు చేశారు. 'ఈ రోజు మేం జమ్ముకశ్మీర్‌ను తీసుకున్నాం. రేపు బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌నూ తీసుకుంటాం. అఖండ భారత్ కలను ప్రధాని మోదీ సాకారం చేస్తారని నాకు తెలుసు' అని బ్యానర్లలో పేర్కొన్నారు. అయితే వీటిని పాక్ పోలీసులు తొలిగించారు. ఇందుకు సంబంధించి ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దాదాపు ఐదు గంటల తర్వాత బ్యానర్లు తొలిగించారని, ఎందుకు జాప్యం జరిగిందో విచారణ జరుపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రాథమికంగా ఇద్దరిని గుర్తించిన పోలీసులు.. మంగళవారం సాయంత్రం ఒకరిని అరెస్ట్ చేశారు.

బుధవారం షోపియాన్‌లో స్థానికులతో కలిసి బిర్యానీ తింటూ సంభాషిస్తున్న దోవల్

అంతా మీ చేతుల్లోనే ఉన్నది

- జవాన్లతో జాతీయ భద్రతా సలహాదారు దోవల్ వ్యాఖ్య
- దక్షిణ కశ్మీర్‌లో స్థానికులతో మాటామంతీ
- ప్రజాభిప్రాయ సేకరణ, భద్రతపై సమీక్షే లక్ష్యంగా పర్యటన

జమ్ము, శ్రీనగర్/ న్యూఢిల్లీ, ఆగస్టు 7: మన సైనికుల శక్తి సామర్థ్యాలు, వారి ధైర్య సాహసాలపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉన్నదని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తెలిపారు. లక్ష్య సాధన కోసం త్యాగాలకు సిద్ధంగా ఉండాలని, అప్పుడే విజయం మనల్ని వరిస్తుందని సైనికులతో చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను రద్దు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన దక్షిణ కశ్మీర్ ప్రాంతంలో పర్యటించారు. తన పర్యటన కోసం ఆయన ఉగ్రవాద మూలాలు ఎక్కువగా ఉండే దక్షిణ కశ్మీర్ ప్రాంతాన్ని ఎంచుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన షోపియాన్ జిల్లాలో స్థానికులతో ముచ్చటించారు. 'రాష్ట్రంలో భద్రత ఎలా ఉన్నది? ఆర్టికల్ 370ను రద్దు చేసి రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తే బాగుందా?' అంటూ తదితర విషయాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో అంతా బాగానే ఉన్నదని, మీ భద్రత బాధ్యత మాది అని వారితో చెప్పారు. కశ్మీర్ లోయలోని ప్రజల్లో మనోధైర్యం నింపే ప్రయత్నం చేశారు. రోడ్డు పక్కన స్థానికులతో కలిసి బిర్యానీ తిన్నారు. ప్రధానంగా ఆర్టికల్ 370ను రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి ఎలా ఉన్నది? స్థానికులు ఏమనుకుంటున్నారు? భద్రత కట్టుదిట్టంగా ఉన్నదా? అనే అంశాలపై సమీక్షించడం ఎజెండాగా ఆయన పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా దోవల్ కశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ జవాన్లతోనూ చర్చించారు. భద్రతను సమీక్షించి పలు సూచనలు చేశారు. జవాన్ల భుజస్కందాలపైనే దేశ భద్రత ఆధారపడి ఉన్నదని, లక్ష్య సాధనలో త్యాగాలకు వెనుకడుగు వేయవద్దని కోరారు. అనంతరం పోలీసులతో మాట్లాడుతూ అత్యుత్తమ పోలీసు వ్యవ స్థ జమ్ముకశ్మీర్ సొంతమని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన భద్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన దోవల్ తిరిగి ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని గవర్నర్ బుధవారం అధికారులతో సమీక్షించారు. దవాఖానలు పనిచేస్తున్నాయని, సరుకులు కొనుగోలు చేయడానికి ప్రజలు మార్కెట్లకు వెళ్తున్నారని అధికారులు వివరించారు.

నిశ్శబ్ద వాతావరణం

జమ్ముకశ్మీర్‌లో నిశ్శబ్ద వాతావరణం నెలకొన్నది. రాష్ట్రంలో ఇంటర్నెట్ సర్వీసులపై ఇంకా ఆంక్షలు కొనసాగుతున్నాయి. 144 సెక్షన్ అమలవుతున్నది. విద్యా సంస్థలు ఇంకా మూసి ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌కు గుండెకాయ అయిన శ్రీనగర్ నగరంలో రోడ్ల మీద బారికేడ్లు దర్శనమిస్తున్నాయి. ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ బలగాల తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజా రవాణా ఇంకా మెరుగుపడకపోవడంతో శ్రీనగర్ విమానాశ్రయానికి వెళ్లేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర బలగాలు 100మందికిపైగా అరెస్టు చేశారు. వీరిలో రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. అయితే వారి వివరాలు వెల్లడించలేదు. మరోవైపు ఆర్టికల్ 370ను రద్దు చేసిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్ అధికారిక జెండాను త్వరలోనే తొలిగించనున్నారు. శ్రీనగర్‌లో ఒక నిరసనకారుడిని భద్రతా బలగాలు వెంబడించాయని, ఈ సందర్భంగా అతడు జీలం నదిలోకి దూకాడని దీంతో ప్రాణాలు కోల్పోయాడని స్థానికులు పేర్కొన్నారు.

కశ్మీర్‌లో పనిచేస్తున్న కార్మికులు బుధవారం తమ స్వరాష్ట్రాలకు వెళ్లడానికి జమ్ము రైల్వేస్టేషన్‌కు వచ్చిన దృశ్యం

దయాగుణానికి నిలువెత్తు నిదర్శనం

- సుష్మతో ఈ ఏడాది రాఖీ కట్టించుకునే అదృష్టాన్ని కోల్పోయా
- రాజ్యసభ సంతాప తీర్మానంలో చైర్మన్ వెంకయ్యనాయుడు

సుష్మా స్వరాజ్ మృతికి సంతాపం తెలుపుతూ రాజ్యసభలో లేచి నిల్చొని మౌనం పాటిస్తున్న చైర్మన్ వెంకయ్యనాయుడు, ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: విదేశాంగ శాఖ మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ దయాగుణానికి నిలువెత్తు నిదర్శనమని, ఆమె ఎంతో ధైర్యవంతురాలని రాజ్యసభ కొనియాడింది. ఈ దేశం మంచి పరిపాలనాధ్యక్షురాలిని, ప్రభావవంతమైన పార్లమెంటేరియన్‌ను, నిజమైన ప్రజా గొంతుకను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సంతాప తీర్మానం చదువుతూ దయ, ఆప్యాయత, మంచితనానికి సుష్మా స్వరాజ్ మారుపేరని పేర్కొన్నారు. భారత్ అత్యున్నత శిఖరాలకు ఎదుగాలన్నదే ఆమె ఆశయమని తెలిపారు. ప్రజాజీవితంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆమె మాట, బాట మార్గదర్శకమని పేర్కొన్నారు. 'సుష్మాస్వరాజ్ నాకు సోదరిలాంటివారు. ఎప్పుడూ కూడా నన్ను అన్నా అనే పిలిచేవారు. మా ఇంట్లో జరిగే ప్రతి వేడుకకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె తప్పకుండా హాజరయ్యేవారు. ప్రతియేటా రాఖీపౌర్ణమి రోజు నాకు రాఖీ కట్టేవారు. కానీ ఈసారి ఆ అదృష్టాన్ని కోల్పుతున్నా. ఆమె ఆకస్మిక మృతి వ్యక్తిగతంగా నాకు తీరని లోటు' అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'నా జీవితకాలంలో ఇలాంటి రోజును చూడటానికి ఎదురుచూశాను' అని ఆర్టికల్ 370ని రద్దు చేసిన అనంతరం సుష్మ ట్వీట్ చేశారని.. దీన్నిబట్టి ఆమెకు ఒకే దేశం-ఒకే రాజ్యాంగం పట్ల ఎంత గౌరవం ఉన్నదో అర్థమవుతున్నదని వెంకయ్యనాయుడు తెలిపారు.

నిర్బంధంలో కశ్మీర్

- ఎన్నడూ ఊహించని పరిస్థితులు
- కేంద్ర బలగాల గుప్పిట్లో రాష్ట్రం
- భయాందోళనలో 80 లక్షల మంది
- మాజీ యువ ఐఏఎస్ అధికారి షా ఫైజల్ వ్యాఖ్యలు

షా ఫైజల్

న్యూఢిల్లీ, ఆగస్టు 7: కశ్మీర్‌లో ఎన్నడూ ఊహించని పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రంలో 80 లక్షల మంది ప్రజలు ఎన్నడూ లేని విధంగా నిర్బంధ జీవితాన్ని గడుపుతున్నారని మాజీ యువ ఐఏఎస్ అధికారి, జమ్ముకశ్మీర్ పీపుల్స్ మూమెంట్ పార్టీ అధ్యక్షుడు షా ఫైజల్ తెలిపారు. రాష్ట్రాన్ని పాలించిన మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, జమ్ముకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజ్జద్ లోన్‌ను కలిసే అవకాశంలేదని, కనీసం వారికి ఓ మెసేజ్ పంపుదామన్నా ఆ సౌకర్యం కూడా లేదని చెప్పారు. కశ్మీర్ లోయలో కర్ఫ్యూ వాతావరణం కొనసాగుతున్నదని, ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలిపివేశారని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ 'రోడ్ల మీద కొన్ని వాహనాలు కనిపిస్తున్నాయి. కానీ ప్రజాజీవనం పూర్తిగా స్తంభించింది. జనాలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇంతటి భయాందోళనకర వాతావరణాన్ని కశ్మీర్ ప్రజలు గతంలో ఎన్నడూ చూడలేదు' అని పేర్కొన్నారు. 'అధికారులకు శాటిలైట్ ఫోన్లను అందజేశారు. దీంతో నిత్యావసరాల కొరత సమస్య తలెత్తకుండా వాళ్లు సమన్వయం చేసుకుంటున్నారు. కానీ రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో తెలుసుకునే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. టీవీ ప్రసారాలు లేవు. మొబైల్ ఫోన్ సేవలను నిలిపివేశారు. జాతీయ మీడియాను క్షేత్రస్థాయిలోకి అనుమతించడం లేదు. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో అర్థం గాక ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు' అని ఫైజల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు ప్రక్రియ మొదలైనప్పటి నుంచి రాష్ట్రంలో ఎలాంటి హింసాత్మక ఘటన చోటుచేసుకోలేదని చెప్పారు. కొన్నిచోట్ల రాళ్లు రువ్వే ఘటనలు మాత్రం జరిగాయన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని, ఈ ఆర్టికల్‌ను రద్దు చేసి భారత ప్రభుత్వం మోసానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రం కేంద్ర బలగాల గుప్పిట్లో ఉన్నదని, స్థానిక పోలీసులు పూర్తిగా పక్కకు జరిగిపోయారని చెప్పారు. దీంతో కేంద్ర బలగాలు చాలా కఠినంగా వ్యవహరిస్తున్నాయన్నారు. 'విమానాశ్రయం వద్ద కొందరు నన్ను కలిశారు. ఆర్టికల్ 370 రద్దు అయ్యిందని, ఇప్పుడు ఏం చెద్దామని నన్ను అడిగారు. అందరం కలిసి సుప్రీం కోర్టుకు వెళ్దామని సూచించా' అని ఫైజల్ పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ విషయంలో ఇంత జరుగుతున్నా అంతర్జాతీయ సమాజం కండ్లు మూసుకున్నదన్నారు. 'నేను ఎవరి నుంచి ఏదీ ఆశించడం లేదు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలిసి మా హక్కులను ఎలాగైతే లాక్కున్నారో.. మళ్లీ తిరిగి వాటిని మాకు ఇచ్చే రోజు కూడా వస్తుంది' అని వ్యాఖ్యానించారు.

ఆమె ఆప్యాయత అనిర్వచనీయం

సుష్మాస్వరాజ్ మరణంపై కేటీఆర్ సంతాపం

కేటీఆర్ షేర్‌చేసిన సుష్మాతో కలిసున్న ఫొటో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సుష్మాస్వరాజ్ మృతి పట్ల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు. 'కలిసిన ప్రతిసారి ఆమె ఆప్యాయంగా పలకరించేవారు. సుష్మ నిజమైన నేత. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఏ ఆపదలో ఉన్నా సాయం చేయాలని కోరితే ఒక్క ట్వీట్‌తో తానున్నానే భరోసా కల్పించేవారు. మిమ్మల్ని ఎంతో కోల్పోతున్నాం మేడమ్' అని కేటీఆర్ పేర్కొన్నారు. సుష్మతో దిగిన ఫోటోలను కూడా ట్వీట్ చేశారు.

పాక్ వ్యక్తికి కేటీఆర్ కౌంటర్...

సుష్మ మృతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాకిస్థానీకి కేటీఆర్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. సుష్మ మృతిపై ఆయన చేసిన ట్వీట్‌పై షోయబ్ అనే పాకిస్థానీ అనుచితంగా స్పందించాడు. 'కశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగానే ఆమె మృతిచెందారు. ఆమె కోసం నరకం ఎదురుచూస్తోంది' అని ట్వీట్ చేశాడు. దీనికి కేటీఆర్ గట్టి కౌంటర్ ఇచ్చారు. 'ఇది హాస్యాస్పదం. ఒక నాయకురాలి ఆకస్మికమృతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మీ వ్యక్తిత్వం ఏమిటో తెలుస్తున్నది. షోయబ్.. మీ ప్రొఫైల్‌లో చూపిస్తున్నట్లుగా మీరు పాకిస్థానీ అయితే జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన సుష్మస్వరాజ్ లాంటి నేతలను గౌరవించేందుకు ధైర్యం, మర్యాద సంపాదించుకోగలరని కోరుకుంటున్నాను' అని కేటీఆర్ పేర్కొన్నారు.

చాలా బాధగా ఉంది: కవిత

సుష్మ మరణంపై మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్‌లో స్పందించారు. ఆమె మరణ వార్త వినడానికి చాలా బాధగా ఉందన్నారు. సుష్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సుష్మ ప్రసంగాల్లో తనకు నచ్చిన వాటిని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

ప్రగాఢ సానుభూతి: హరీశ్‌రావు

సుష్మ స్వరాజ్ మరణం పట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జాతీయ రాజకీయాలపై తనదైన ముద్ర: నరసింహన్

సుష్మాస్వరాజ్ ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మంచి వక్తని, జాతీయ రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపిన మహిళా నాయకుల్లో ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. అత్యంత ప్రజాదరణ పొందిన నాయకురాలిగా లక్షలాది మంది హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆమె నిర్వర్తించిన అన్ని హోదాలకు గౌరవాన్ని, వన్నెను తెచ్చారని ప్రశంసించారు. దేశం ఒక గొప్ప పార్లమెంటేరియన్‌ను కోల్పోయిందని, ఆమె లేని లోటు భర్తీ చేయలేనిదని గవర్నర్ పేర్కొన్నారు.

దేశానికి తీరని లోటు: విద్యాసాగర్‌రావు

కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ మృతి దేశానికి తీరని లోటని మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఏ పదవి చేపట్టినా అంకిత భావంతో పని చేశారని, స్వతంత్ర భారతదేశంలో పవర్‌ఫుల్ మహిళా నేతగా ఎదిగారని కొనియాడారు. వాజపేయి హయాంలో ఆమెతో కలిసి తాను పనిచేశాననీ, ఏ విషయంలోనైనా ఆమె నిక్కచ్చిగా వ్యవహరించే మనిషని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా సుష్మ తనవంతు సహకారాన్ని అందించారని పేర్కొన్నారు. ఒక ఉత్తమ పార్లమెంటేరియన్‌ను దేశం కోల్పోయిందన్నారు.

గల్ఫ్‌లో చిక్కుకున్నవారికి ఎంతో సాయం చేశారు

గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాట్కూరి బసంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ మృతితో ఈ దేశం ఒక గొప్ప నేతను కోల్పోయిందని గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియే

సుష్మా స్వరాజ్ మరణం బీజేపీకే కాదు, దేశానికే తీరని లోటు.
సుష్మ ఎప్పుడూ ప్రజలకు సహాయం చేసేవారు.
ఆమెకు ట్వీట్ చేస్తే చాలు, సహాయం చేయడానికి ముందుకు వచ్చేవారు.
సరబ్‌జిత్ విషయంలో ఆమె చాలా సహాయపడినారు.

దల్బీర్ కౌర్, సరబ్‌జిత్ సింగ్ సోదరి

ప్రధాని మోదీ జాతీయస్థాయికి ఎదుగడానికి ముందు ప్రధాని పదవి పోటీదారుగా బాల్‌ఠాక్రే మొదటి ప్రాధాన్యం సుష్మా స్వరాజే. బాలా సాహేబ్ ఆమెను ధృడమైన నాయకురాలిగా చూశారు. ఆమెను దీవించినందుకు ఆమె అతనికి ధన్యవాదాలు చెప్పారు.
అలా ఉండేది వాళ్లిద్దరి మధ్య అనుబంధం.

సంజయ్ రౌత్, శివసేన ఎంపీ

చరిత్రలో నేడు

1609

గెలీలియో టెలిస్కోప్‌ను పరీక్షించిన వెనీషియన్ సెనేట్.

1876

ఆటోగ్రాఫిక్ ప్రింటింగ్ పేటెంట్ పొందిన థామస్ ఎడిసన్.

2018

ఆస్ట్రేలియా తమ దేశంలోని అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం న్యూ సౌత్‌వెల్స్‌ను వంద శాతం కరువు ప్రాంతంగా ప్రకటించింది.

భారతీయ నాయకుల హేతువును ప్రశ్నించడం మనకు సంబంధించిన విషయం కాదు. కానీ ఏడు దశాబ్దాల తరువాత జమ్ముకశ్మీర్‌లోని రాజకీయ వ్యవస్థను మార్చాలని అధికార పార్టీ ఎందుకు అనుకున్నట్టు. 1947లో పరిస్థితులు సాధారణంగా లేనందువల్లనే ఇటువంటి వ్యవస్థను ఏర్పాటు చేయడమైనది. జమ్ముకశ్మీర్ రాష్ట్రం సంక్షోభంలో ఉన్నది. 1990 తరువాత ఉగ్రవాద చర్యలు తగ్గిపోయాయి. కొత్త చట్టం ఆశించిన లక్ష్యం నెరవేరాలని, జమ్ముకశ్మీర్ ప్రజల్లో ఉన్న ఎడబాటు పోవాలని, రాష్ట్రంలో ప్రశాంతత నెలకొనాలని కోరుకుందాం.

ది డైలీ స్టార్

వర్ధమాన దేశాలలో పోషకాహార లోపం ప్రమాదకర స్థాయిలో ఉన్నది. ప్రపంచ పోషకాహార నివేదిక ప్రకారం- పదిహేను కోట్ల మంది పిల్లల్లో ఎదుగుదుల సక్రమంగా లేదు. రెండు కోట్ల మంది పిల్లలు జన్మించినప్పుడు తగినంత బరువు లేరు. నేపాల్‌లో ఈ పోషకాహార లోపం తీవ్రంగా ఉన్నది. ప్రణాళికా సంఘం వివరాల ప్రకారం-36 శాతం మంది ఎదుగుదల సరిగా లేదు. 53 శాతం రక్తహీనతతో ఉన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి సమగ్ర పోషకాహార విధానం అనుసరించాలె. గర్భిణులు, శిశువులు, కౌమార వయస్సు వారిని లక్ష్యంగా చేసుకోవాలె.

ది హిమాలయన్ టైమ్స్

కొరవడిన 'సహకారం'

లోక్‌సభ ఎన్నికల తరువాత జరిగిన మొదటి పార్లమెంటు సమావేశాలు ఉపయోగకరంగా జరిగాయనే మాట వినబడుతున్నది. ఒక కోణంలో గమనిస్తే అందులో వాస్తవం కూడా ఉన్నది. ఈ సమావేశాలలో దాదాపు 281 గంటల పాటు చర్చలు సాగాయి. గత 20 ఏండ్లలోనే ఇంతగా చర్చలు సాగడం ఎక్కువగా చెప్పుకోవచ్చు. ఈ కొద్దికాలంలోనే అనేక బిల్లులు ఆమోదం పొందడం కూడా గత 67 ఏండ్లలో అత్యధికమని చెబుతున్నారు. పార్లమెంటులో మొత్తంగా 38 బిల్లులను ప్రవేశపెట్టారు. 28 బిల్లులను ఉభయసభలు ఆమోదిస్తే, ఒక లోక్‌సభ 36 బిల్లులను ఆమోదించింది. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే! పార్లమెంటు పనితీరును ఎన్ని బిల్లులు ఆమోదించిందనే కొలబద్ధతోనే పరీక్షించడం సరైనది కాదు. ప్రజా సంక్షేమానికి సంబంధించి గంటలు కాదుగదా రోజుల తరబడి చర్చించి ఒక్క బిల్లును కూడా ఆమోదించకపోవచ్చు. నిరంకుశ వ్యవస్థలలో నిర్ణయాలు వేగంగా తీసుకోవడం పరిపాటి. కొన్నేండ్లుగా పార్లమెంటులో నిర్మాణాత్మక చర్చలకు బదులు కాలయాపన సాగుతున్నది. అనవసర చర్చల వల్ల సమయం వృథా కావడం వాంఛనీయం కాదు. కానీ పార్లమెంటు తీసుకున్న నిర్ణయాలు ఎటువంటివి, చర్చలు ఎంత అర్థవంతంగా సాగాయి, ప్రజాస్వామిక పాలన సాగుతున్నదా లేదా అనేవి మాత్రమే పార్లమెంటు స్వభావానికి, మన ప్రజాస్వామిక వ్యవస్థ ఫలవంతానికి కొలమానాలుగా నిలుస్తాయి. ఎన్ని బిల్లులను ఉభయసభలు ఆమోదించాయి, ఎంత తొందరగా చట్టాలుగా మారాయనేది ప్రధానం కాదు.

మోదీ రెండవసారి ప్రధాని అయిన తరువాత పార్లమెంటు మొదటి సమావేశాల సందర్భంగా కేంద్రం పోకడ ఏకపక్షంగా మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి. మొదట్లో సహకార సమాఖ్య విధానానికి మద్దతుదారుగా మాట్లాడిన ప్రధాని మోదీ ఇటీవల మాత్రం రాష్ట్రాల అధికారాలను హరించే చట్టాలు తెచ్చారు. కొన్ని బిల్లులైతే ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవిగా విమర్శలకు గురయ్యాయి. వీటిపై చర్చకు తగినంత వ్యవధి తీసుకోకుండా హడావుడిగా ఆమోదింపజేసుకోవడం తప్పుడు సంకేతాలనిస్తున్నది. జాతీయ భద్రతా సంస్థకు (ఎన్ఐఏ) మరిన్ని కోరలు ఇచ్చే బిల్లును రెండు రోజుల వ్యవధిలోనే ఉభయసభలు ఆమోదించాయి. దీనివల్ల రాష్ట్రాల పరిధిలోని అంశాలపై దర్యాప్తు అధికారం కేంద్ర సంస్థకు లభిస్తున్నది. రాష్ట్రాల పరిధిలోకి చొచ్చుకుపోవడం సమాఖ్య సూత్రానికి విరుద్ధమని ప్రతిపక్షాలు అభ్యంతరం చెప్పాయి. వ్యక్తులను ఉగ్రవాదులుగా గుర్తించడానికి అవకాశం కల్పిస్తున్న చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టసవరణ కూడా ఇదే విధంగా అతివేగంగా వారం రోజులలో జరిగింది. ఇది పౌరహక్కులకు సంబంధించిన అంశమే కాకుండా రాష్ట్రాల అధికారాలను హరించేది. సమాచార హక్కు చట్టసవరణ కూడా ఏ కోణంలో చూసినా అభ్యంతరకరమైనదే. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా, రాష్ట్రాలపై పెత్తనానికి అవకాశం కల్పిస్తున్నది. జీతభత్యాలను, పదవీ కాలాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ద్వారా సమాచార కమిషన్‌ను తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకోవడం అప్రజాస్వామికం. ఈ చట్టం ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులపై కూడా కేంద్ర నియంత్రణ ఏర్పడుతున్నది. ఇది రాష్ట్రాల హక్కులను తుంచేయడమే కాదు, ఇతర పార్టీలున్న ప్రభుత్వాలను వేధించడానికి దారితీస్తుంది.

పార్లమెంటులో అన్ని బిల్లులను కూలంకషంగా చర్చించే అవకాశం ఉండదు. అవసరమైన సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి పరిశీలించడం కూడా సాధ్యపడదు. అందువల్ల బిల్లులను స్థాయీ సంఘాలకు, సెలెక్ట్ కమిటీలకు పంపిస్తారు. కానీ ప్రతిపక్షాలు ఎంత కోరినప్పటికీ, వివాదాస్పద బిల్లులను కమిటీలకు పంపించకపోవడం మోదీ ప్రభుత్వం ఏకపక్ష వ్యవహార సరళిని సూచిస్తున్నది. వివాదాస్పద బిల్లులను ప్రజాస్వామిక సంప్రదాయాలకు విరుద్ధంగా హడావుడిగా ఆమోదింపజేసుకున్నది చాలక కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తీరును తప్పుపట్టడం ఆశ్చర్యం కలిగిస్తున్నది.

పార్లమెంటులో అన్ని బిల్లులను కూలంకషంగా చర్చించే అవకాశం ఉండదు. అవసరమైన సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి పరిశీలించడం కూడా సాధ్యపడదు. అందువల్ల బిల్లులను స్థాయీ సంఘాలకు, సెలెక్ట్ కమిటీలకు పంపిస్తారు. కానీ ప్రతిపక్షాలు ఎంత కోరినప్పటికీ, వివాదాస్పద బిల్లులను కమిటీలకు పంపించకపోవడం మోదీ ప్రభుత్వం ఏకపక్ష వ్యవహార సరళిని సూచిస్తున్నది. వివాదాస్పద బిల్లులను ప్రజాస్వామిక సంప్రదాయాలకు విరుద్ధంగా హడావుడిగా ఆమోదింపజేసుకున్నది చాలక కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తీరును తప్పుపట్టడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. తెలంగాణ ఒకప్పుడు రాష్ట్రంగానే ఉండేది. ప్రజల అభీష్టానికి విరుద్ధంగా మరో రాష్ట్రంతో కలిపారు. రాష్ట్ర సాధన డిమాండ్ ఎంతోకాలంగా రగులుతున్నది. 1969లో ప్రజలు ఉద్యమించినప్పుడు కేంద్రం అనేక మందిని కాల్చివేసి నిర్దాక్షిణ్యంగా అణిచివేసింది. వేలాదిమంది తెలంగాణ బిడ్డలు బలిదానాలు చేసినా కనికరించలేదు. రాజ్యాంగంలో లేనప్పటికీ- తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలంటే, ఆంధ్ర ఆధిపత్యవర్గాలకు పైచేయిగా ఉన్న ఏపీ అసెంబ్లీ ఒప్పుకోవాలనే వాదనను ఇరు జాతీయపార్టీలు వినిపించాయి. ఎంతో ప్రజాస్వామ్యబద్ధంగా అనేక దశలుగా చర్చలు సాగిన అనంతరం, ఏపీ అసెంబ్లీ ఆమోదం తరువాత రాష్ట్ర విభజన జరిగింది. ఏ చర్చా లేకుండా, చివరి క్షణం వరకు రహస్యం పాటిస్తూ, హడావుడిగా జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని విభజిస్తూ- ప్రజాస్వామ్య బద్ధంగా సాగిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తప్పు పట్టడమేమిటి?

జనగళం

అమిత్ షా అవివేకం

కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైనప్పుడల్లా తెలంగాణపై విషంగక్కుతూ పబ్బం గడుపుకుంటున్నారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను తలపులు మూసేసి మరీ విభజించిందంటూ ఆంధ్రప్రదేశ్‌పై వల్లెమాలిన ప్రేమ కనబరిచారు. ఇలాంటి అర్థం పర్థం లేని మాటల వెనుక ఉద్దేశమేంటో తెలుసుకోలేని స్థితిలో దేశ ప్రజలు ఉన్నారనుకోవడం అమిత్ షా అవివేకం. ఈ వ్యాఖ్యల వెనుక ఆయన ఉద్దేశం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలహీనమై, బీజేపీ పుంజుకుంటుందని ఆయన ఆశిస్తున్నారు. కానీ అది జరుగని పని, అది కాకపోగా తెలంగాణ ప్రజలు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తారని బీజేపీ నాయకులు తెలుసుకోవాలి.

- అన్నాజి రాజేందర్, కరీంనగర్

కశ్మీర్ టెర్రరిస్టుల అడ్డా

1949, 1954లలో 370, 35ఏతో జమ్ముకశ్మీర్‌కు అధికారాలు కట్టబెట్టారు. పర్యవసానంగా 60 లక్షల కశ్మీరీ పండిట్లు వెళ్లగొట్టబడ్డారు. కాంగ్రెస్‌న చేసిన నిర్వాకం వల్ల కశ్మీరీ పండిట్లు కాందిశీకులయ్యారు. యాభై సంవత్సరాల నుంచి చేస్తున్న చర్చల ద్వారా సాధించేదేమీ లేదు. కాకపోగా పొయ్యిమీద ఉన్నం పొయ్యిలో పడ్డట్లయ్యింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ టెర్రరిస్టుల అడ్డా అన్నది జగమెరిగిన సత్యం. ప్రస్తుత పరిస్థితుల్లో మిలిటరీని పెంచి టెర్రరిస్టులను నిర్మూలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

- వీర పూర్ణచందర్‌రావు, హైదరాబాద్

సుష్మ మరణం తీరనిలోటు

సుష్మా స్వరాజ్‌కు తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉన్నది. కాబట్టి ఆమె మరణించిన విషయం తెలిసిన వెంటనే తెలంగాణ ప్రజలు సామాజిక మాధ్యమాల్లో కన్నీటితో వీడ్కోలు పలికారు. ఇంతగా తెలంగాణ ప్రజలు స్పందించడానికి కారణం ఆమె తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు మద్దతు పలుకడం. దీంతో పాటు ఉద్యమానికి మద్దతుగా ఎన్నో సభలకు ఆమె హాజరవ్వడం. సుష్మా మీకు నివాళి.

- తలారి సతీష్, వికారాబాద్, రంగారెడ్డి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

టంకశాల అశోక్

ఒక అంతర్రాష్ట్ర ప్రేరణ

ఒకరి మంచిపని మరొకరికి ప్రేరణగా మారటం సహజం. ఆ మంచిపని కాళేశ్వరం ఎత్తిపోతల కావటం, అది మహారాష్ట్రలోని వైన్‌గంగ-నల్‌గంగ ఎత్తిపోతలకు ప్రేరణగా మారటం మాత్రం మనకు ప్రత్యేకంగా సంతోషాన్ని కలిగించే విషయం. కాళేశ్వరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఆ ప్రేరణతో తమ రాష్ట్రంలో చిరకాలంగా పెండింగ్‌లో గల వైన్‌గంగ-నల్‌గంగ ఎత్తిపోతలకు పచ్చజెండా ఊపారన్నది తాజా పరిణామం. దీనితో కరువు కాటకాలు, ఆత్మహత్యల విదర్భ ప్రాంతం పంటల మయం కానున్నది.

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కలెక్టర్ అరుణ్ డోంగ్రే, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఈ రచయితకు చెప్పినదానిని బట్టి, వైన్‌గంగ-నల్‌గంగ భారీ నీటిపారుదల పథకం అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నది. ఎత్తిపోతలకు విద్యుత్ అవసరాలు, ఇతర ఖర్చులు ఎక్కువస్థాయిలో అవసరం కావటం ఇందుకు కారణం. అందువల్ల ప్రాజెక్టును ఆమోదించేందుకు ఫడ్నవీస్ ఇంతకాలం వెనుకాడుతూ వచ్చారు. అటువంటిది, అంతకుమించిన విద్యుత్ వినియోగం, ఖర్చుతో తెలంగాణ చేపట్టిన కాళేశ్వరాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానంపై సందర్శించిన ఆయన ఆలోచనలు ఆ వెంటనే మారిపోయాయి. తిరిగివెళ్లిన వెంటనే తమ పథకానికి తల ఊపారు. ఈ విషయం తెలియజేసిన అధికారుల ఆనందానికి అవధులు లేకుండా వుంది.

మహారాష్ట్రలోని మిగులుజలాల నది అయిన వైన్‌గంగ నుంచి తరుగు నది అయిన నల్‌గంగకు 2,721 మిలియన్ మీటర్ క్యూబిక్కుల నీటిని తరలించాలన్నది పథకం. ఇందుకోసం నీటిని మూడు దశల్లో ఎత్తిపోయవలసి ఉంటుంది. అందుకు అవసరమైన విద్యుత్తు 224 మెగావాట్లు. ప్రాజెక్టు మొత్తం వ్యయం 2007-08 నాటి ధరల ప్రాతిపదికన రూ.8,294 కోట్ల చిల్లర కాగా, అందులో విద్యుత్ భారం రూ.1033 కోట్ల చిల్లర. ఇందులో గోసీ ఖుర్ద్ పేరిట వైన్‌గంగ పథకం ఇప్పటికే నిర్మాణంలో ఉన్నది. ఇతరత్రా బహుళ ప్రయోజనాల కోసం ఉద్దేశించిన ఆ ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా నల్‌గంగ నదికి కలిపి పశ్చిమ విదర్భకు సాగునీటిని అందించాలన్నది ఆలోచన. ఆ ప్రాంతపు నైసర్గిక స్వరూపం కారణంగా గ్రావిటీ పద్ధతిలో నీరు వెళ్లే అవకాశం లేదు గనుక ఎత్తిపోతలు తప్పనిసరి. ఎత్తిపోతలు మూడు దశలలో అవసరమవుతాయి. అందుకు 288 మెగావాట్లు, లేదా సంవత్సరానికి 556 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమని అంచనా.

పైన పేర్కొన్న ఖర్చు అంచనాలు 2007-08 నాటి ధరల ప్రకారం వేసినవి అయినందున తాజా లెక్కల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.14,938 కోట్లుకాగా, విద్యుత్ వ్యయం రూ.1643 కోట్లు అయింది. అయినప్పటికీ ఇదంతా తెలిసికూడా మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన కాళేశ్వరం సందర్శన తర్వాత అన్ని సంకోచాలను పక్కనబెట్టి, ఇంతకాలం పెండింగ్‌లో గల ఎత్తిపోతలకు ఆమోదం తెలుపటమన్నది మనం గుర్తించవలసిన విశేషం.

వైన్‌గంగ, నల్‌గంగ నదులు రెండూ విదర్భ ప్రాంతంలోనివే. సంవత్సరం పొడవునా ప్రవహించే సజీవ నది అయిన వైన్‌గంగ తూర్పు విదర్భలో, నదీ ప్రవాహం ఎప్పుడూ సరిగా ఉండని నల్‌గంగ పశ్చిమ విదర్భలో ఉన్నాయి. రెండింటిని కలుపుతూ 300 కిలోమీటర్ల కాలువ తవ్వుతారు. ఎత్తిపోతలు అవసరమైంది ఈ కాలువలో నీటిని పోసేందుకు. నల్‌గంగ నుంచి నీరు లభించేది కరువు కాటకాల మయమైన పశ్చిమ విదర్భ ప్రాంతానికి. ముఖ్యంగా అమరావతి డివిజన్‌కు. పశ్చిమ విదర్భలోని ఆరు జిల్లాల్లో అయిదు అమరావతి డివిజన్‌లో ఉన్నాయి. ఇవన్నీ వర్షాధారిత భూములే. ప్రాజెక్టులు లేవు. సజీవ నదులు ఎక్కువ దూరం

లో లేనప్పటికీ ఆ నీటిని ఇంతకాలం అటువంటి ప్రాంతానికి తరలించలేదు. అందుకు కారణం వ్యయభారం, విద్యుత్ వినియోగ భారం వంటివి ఏవైనా కావచ్చు. కానీ నీరు మాత్రం రాలేదు. పశ్చిమ విదర్భప్రాంత రైతులు విస్తారంగా పత్తి, సోయాబీన్ సాగు చేస్తారు. ఇందుకు కావలసిన వనరులు, పంట అమ్మకపు మార్కెట్లు మోసాలతో కూడినవి, జాతీయ-అంతర్జాతీయ మార్కెట్లతో ముడిబడినవి కావటంతో, అందుకు తగినట్లు నీటి సదుపాయం లేకపోవటంతో అప్పుల పాలై, పంటకు గిట్టుబాటు ధరలు లేక, పేదరికంలో మగ్గుతూ గత ఇరువయ్యేళ్లుగా వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం తెలిసిందే. ఈ ఆత్మహత్యలు మొత్తం దేశంలోనే విదర్భలో అధికం కావటం కూడా తెలిసిందే. దీనిపై రాష్ట్రంలో, కేంద్రంలో ఏ పార్టీ అధికారానికి వచ్చినా హామీలు ఇవ్వటం, ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా విమర్శలు చేయటం మినహా రైతుల కోసం నికరంగా జరిగిందేమీ లేదు.

అటువంటిది ఇపుడు మొదటిసారిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం వ్యయప్రయాసలకోర్చి వైన్‌గంగ నీటిని ఎత్తిపోతల ద్వారా విదర్భకు తీసుకుపోయేందుకు సంకల్పించింది. నీటిని ఎత్తిపోయటం అవసరమని పథకంలో ఉన్నదే. కానీ అందుకయే ఖర్చుకు జంకటం వల్ల ఇంతకాలం పెండింగ్‌లో ఉండిపోయిన ఆ పథకాన్ని ముందుకుతీసుకుపోయేందుకు ఇప్పుడు ప్రేరణ అవుతున్నది కాళేశ్వర ఎత్తిపోతల పథకం కావటం గమనార్హం. కాళేశ్వరం అసలు మొత్తానికే మహారాష్ట్ర పథకాలకు పరోక్ష ప్రేరణ అవుతున్నట్లు కనిపిస్తున్నది. ఆ రాష్ట్రంలో నీటిపారుదల సౌకర్యం గల భూములు 18 శాతం మాత్రమే. ఇది జాతీయ సగటు కన్నా తక్కువ. అనేక నీటి పారుదల పథకాలు కాగితాలపై ఉండిపోయాయి. కొన్ని నత్తనడకన సాగుతున్నాయి. తెలంగాణ ఉదాహరణతో తమ ప్రాజెక్టులను వేగవంతం చేసుకోదలచినట్లు, ప్రభుత్వం అదే ఆలోచనతో ఉన్నట్లు నాందేడ్ అధికారులు ఈ రచయితతో అన్నారు. వైన్‌గంగ నది వార్ధా నదితో కలిసిన తర్వాత ప్రాణహిత నదిగా మారుతుంది. అది చివరకి తెలంగాణలో గోదావరిని చేరటం విశేషం. ఈవిధంగా, దక్కన్ పీఠభూమిలోని భాగాలై, నదులున్నప్పటికీ పథకాలకు నోచుకోక, అనేక సమస్యల్లో వర్షాధారిత స్థితి కూడా ఒకటి అయి, ఇంతకాలం కడగండ్ల పాలైన తెలంగాణ, విదర్భలు రెండూ క్రమంగా జల సంపన్నం కానుండటం ఎంత గొప్ప విషయమో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కాళేశ్వరం వల్ల తెలంగాణ ఇప్పటికే ఆ దశను చేరుతుండగా, వైన్‌గంగ-నల్‌గంగ ద్వారా విదర్భ రానున్నకాలంలో కరువు నుంచి విముక్తి చెందేందుకు మార్గం సుగమం అవుతున్నది.

ఇవే ప్రేరణలు కలిగిస్తున్న ఉత్సాహంతో అన్నట్లుగా, మహారాష్ట్ర ప్రభుత్వం లెండి ప్రాజెక్టు నిర్మాణాన్ని తిరిగి కొనసాగించేందుకు నిర్ణయించింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో గోదావరి నదిపై చేపట్టిన లెండి ప్రాజెక్టు అక్కడి భూములతో పాటు, తెలంగాణ భూములకు నీరందించనున్న అంతరాష్ట్ర పథకం. తెలంగాణలో 22,000 ఎకరాలు, నాందేడ్‌లో 27,000 ఎకరాలు సాగవుతాయి. కొన్ని కారణాల వల్ల కొంతకాలంగా నిలిచిపోయిన నిర్మాణాన్ని అతిత్వరలో, బహుశా ఇదే ఆగస్టు నెలలో తిరిగి ప్రారంభించనున్నట్లు నాందేడ్ అధికారులు ప్రకటించారు. సహకార ఫెడరలిజం అన్నది కేవలం రాజకీయం కాదు. కేవలం కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయం కాదు. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాలు కూడా ఈ పరిధిలోనివే అని అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ అంతర్రాష్ట్ర దౌత్యనీతి ఇదే మార్గంలో సాగుతున్నది.

వైన్‌గంగ, నల్‌గంగ నదులు రెండూ విదర్భ ప్రాంతంలోనివే. సంవత్సరం పొడవునా ప్రవహించే సజీవ నది అయిన వైన్‌గంగ తూర్పు విదర్భలో, నదీ ప్రవాహం ఎప్పుడూ సరిగా ఉండని నల్‌గంగ పశ్చిమ విదర్భలో ఉన్నాయి. రెండింటిని కలుపుతూ 300 కిలోమీటర్ల కాలువ తవ్వుతారు. ఎత్తిపోతలు అవసరమైంది ఈ కాలువలో నీటిని పోసేందుకు. నల్‌గంగ నుంచి నీరు లభించేది కరువు కాటకాల మయమైన పశ్చిమ విదర్భ ప్రాంతానికి. ముఖ్యంగా అమరావతి డివిజన్‌కు. పశ్చిమ విదర్భలోని ఆరు జిల్లాల్లో అయిదు అమరావతి డివిజన్‌లో ఉన్నాయి. ఇవన్నీ వర్షాధారిత భూములే. ప్రాజెక్టులు లేవు.

ఒకే దేశం, ఒకే రాజ్యాంగం

కశ్మీరం

శిరందాసు నాగార్జున

ఒకే దేశం-ఒకే రాజ్యాంగం.. అదే బీజేపీ లక్ష్యం. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ప్రజా అంటూ 'ఏక్తా భారత్' నినాదంతో జనసంఘ్ పార్టీ పుట్టింది. కాలక్రమంలో అది భారతీయ జనతా పార్టీ (బీజేపీ)గా ఏర్పడింది. ఆ పార్టీ సిద్ధాంత రూపకర్త రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) ఉద్దేశం కూడా అదే. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒకే దేశం-ఒకే చట్టం-ఒకే ఎన్నికలు-ఒకే కార్డు, ఒకే విధమైన రిజర్వేషన్ విధానం- దేశ పౌరులందరికీ (స్త్రీ, పురుషులిద్దరికీ) సమన్యాయం- ఉమ్మడి పౌర స్మృతి-ఒకే పన్ను... విధానాలతో బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకుసాగుతున్నది. ఈ నేపథ్యంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. అదే జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు కట్టబెట్టే రాజ్యాంగంలోని 370, 35(ఏ) ఆర్టికల్స్ రద్దు, జమ్ముకశ్మీర్ విభజన నిర్ణయాలు. భారతదేశ చరిత్రలో 1947 ఆగస్టు 15 తర్వాత గుర్తుంచుకోతగిన రోజు 2019 ఆగస్టు 5. ఆ రోజున కేంద్ర హోం మంత్రి అమిత్ షా 103 క్లాజులతో 58 పేజీల 'జమ్ముకశ్మీర్ రీ ఆర్గనైజేషన్ బిల్-2019'ను రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఉమ్మడి జమ్ముకశ్మీర్‌ను జమ్ము-కశ్మీర్, లడఖ్ ప్రాంతాలుగా విభజన అయ్యాయి. జమ్ము-కశ్మీర్ శాసనసభతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా, లడఖ్ శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా అవతరించాయి. ప్రస్తుతం కశ్మీర్ ప్రాంత పరిధిలోని పది జిల్లాలు, జమ్ము ప్రాంతంలోని పది కలిపి 20 జిల్లాలతో రాష్ట్రం ఏర్పడింది. అలాగే లెహ్, కార్గిల్ జిల్లాలతో లడఖ్ ప్రాంతం చట్టసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) కూడా ఈ చట్టం పరిధిలోకి వచ్చింది. ఆ ప్రాంతం మొత్తంపై కేంద్ర అధికార పరిధి పెరిగింది. రాజ్యసభ ఆ బిల్లును ఆమోదించింది. మరోపక్క అదే సమయంలో ఆర్టికల్ 370 రద్దుచేస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీచేశారు. అన్నీ ఏక కాలంలో జరిగిపోయాయి. దాంతో జమ్ము-కశ్మీర్ శాసనసభలో భారత రాజ్యాంగం తక్షణం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఈ బిల్లును ఆగస్టు 6న లోక్‌సభలో చర్చకు పెట్టారు. బీజేపీకి బలం ఉన్నందున అక్కడ కూడా ఆమోదం పొందింది. ఈ బిల్లు రూపొందించడంలో మోదీ, అమిత్ షాలు ఇద్దరూ చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించి ఘన విజయం సాధించారు. ఈ ఇద్దరూ హీరోలుగా నిలిచారు. దేశంలో అత్యధిక మంది ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రక్షణ, శాంతిభద్రతల విషయంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొటూ, డెబ్బై ఏండ్లుగా రావణకాష్ఠంలా రగులుతున్న సమస్యకు పరిష్కారం చూపించారని సంతోషం వ్యక్తంచేస్తున్నారు. స్థిర, చరాస్తులను వదులుకొ ని ఎక్కడెక్కడో తలదాసుకుంటున్న కశ్మీరీ పండిట్‌ల ఆనందానికి అవధు ల్లేవు. ఈ చర్యతో మోదీ, అమిత్ షాలు ఇద్దరూ దేశ చరిత్రలో జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ మాదిరిగా గుర్తుండిపోతారు.

ఆర్టికల్ 370ని రద్దుచేయడాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని ప్రతిపక్షపార్టీలు గగ్గోలు పెట్టడంలో అర్థం లేదు. జమ్ముకశ్మీర్ ప్రాంతంలో శాంతిలేదు. ప్రజలకు భద్రత కరువైంది. ఏడు దశాబ్దాలుగా వారు నరకయాతన అనుభవిస్తున్నారు. రక్షణ వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది. ఆర్టికల్ 370 ద్వారా సంక్రమించిన ప్రత్యేకాధికారాలను అక్కడి ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకోలేకపోయాయి. మరో పక్క ఆ ప్రాంతంలో అశాంతిని పెంచడానికి, కల్లోలం సృష్టించడానికి పాకిస్తాన్ చేస్తున్న చేష్టలు అందరికీ తెలిసినవే. ఈ పరిస్థితులలో ముందుగా ఈ వ్యూహం బయటపెట్టి, చర్చించిన తర్వాత చర్యలకు దిగితే దేశం లోపల, వెలుపల ఎన్నో ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చేది. అందువల్లనే దురాలోచనతో వారు ఈ ఆలోచనను అత్యంత గోప్యంగా ఉంచి, అవసరమైన ముందుజాగ్రత్త చర్యలన్నీ తీసుకొని బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు అమలులోకి రావడం వల్ల ఆ ప్రాంత ప్రజల హక్కులు ఏమీ హరించుకుపోలేదు. వారి గౌరవానికి ఏవిధంమైన భంగం కలుగదు. వారి మత విశ్వాసాలకు, సంస్కృతికి ఎటువంటి హానీ ఉండదు. దేశంలోని ఇతర పౌరులకు ఉన్న అన్ని హక్కులు వారు అనుభవిస్తారు. అన్ని సౌకర్యాలు వారికి ఉంటాయి. అక్కడ శాంతి నెలకొంటే, కేంద్రం శాంతిభద్రతలపై కాకుండా, అభివృద్ధిపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది. వీటన్నికంటే ముఖ్యంగా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కట్టుమల్లారం వాగుపై కల్వర్టు తెగిపోవడంతో తాడు సాయంతో వాగు దాటుతున్న గ్రామస్థులు

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎదుల్లబంధం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంతుంగాచెరువు మత్తడి నీరు

మత్తడి దుంకుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల పరిధిలోని రాయిని చెరువు

మెదక్ జిల్లా కూచన్‌పల్లి వద్ద మంజీరా నదికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

జోరందుకున్న వాన

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాల్లో కుండపోత

గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు..

తీరం దాటిన వాయుగుండం

నేడు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

ఖమ్మం రూరల్ మండలంలో పొంగి ప్రవహిస్తున్న మున్నేరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షం కురవగా.. ఖమ్మం, కరీంనగర్, జగిత్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాగులు పొంగి పొర్లడంతో ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్న వాగులో చిక్కుకోగా, అధికారులు కాపాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం గొందిగూడెంలో ఇసుకవాగు దాటుతున్న వ్యక్తి బుధవారం గల్లంతయ్యాడు. కాగా, వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం బుధవారం తీరం దాటింది. ఈ ప్రభావంతో గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

రోజంతా ఎడతెరిపి లేకుండా..

ఎడతెరిపి లేని వర్షంతో ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులు జలమయమయ్యాయయి. ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద తాకిడి పెరిగింది. వైరా, పాలేరు రిజర్వాయర్లకు కూడా వరద పోటెత్తింది. జిల్లా వ్యాప్తంగా 21.6 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం కురిసింది. చర్ల మండలంలో అత్యధికంగా 159.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతున్నది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం 26.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల రాయిని చెరువు మత్తడి దుంకుతున్నది. పెద్దపల్లి జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 45.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లాలో బుధవారం కుండపోత వర్షం కారణంగా వాగులు, వంకలు, పొంగిపొర్లి చెరువులు మత్తడి పోస్తున్నాయి. వెంకటాపురం(నూగూరు) మండలంలో అత్యధికంగా 174.8 మి.మీ వర్షం కురిసింది. మంగపేట మండలంలో 118.4 మి.మీ వర్షం కురిసింది. మల్లూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 26 అడుగులకు చేరుకొని మత్తడి పోస్తున్నది. గోవిందరావుపేట మండలం లక్నవరం జలాశయం మత్తడి పోస్తున్నది. బుధవారం కురిసిన వర్షంతో రామప్ప చెరువు నీటిమట్టం 25ఫీట్లకు చేరుకున్నది. మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు, మున్నేరు, పాకాల ఏరులు పొంగిపొర్లుతున్నాయి. బయ్యారం పెద్ద చెరువు దాదాపు మూడు అడుగుల మేర మత్తడి పోస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నకొడెపాక చెరువు మత్తడి పడుతున్నది. పెద్దాపూర్‌లో చెరువుకు గండి పడింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి, చిట్యాల, కట్టంగూరు, శాలిగౌరారం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కుమ్రం భీం ఆసీఫాబాద్ జిల్లాలో బుధవారం 23.9 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి మొదలైన వర్షం బుధవారం వరకు కొనసాగింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు, బాల్కొండ నియోజకవర్గాల్లో భారీ వర్షం కురిసింది. భీమ్‌గల్ మండలంలోని కప్పలవాగు, గోన్‌గొప్పుల వాగు పారుతుంది. వేముగంటి ప్రాజెక్టులోకి నీరు రావడంతో మోటర్లను స్టార్ట్ చేసి నీటిని పల్లికొండ చెరువులోకి మళ్లిస్తున్నారు. నందిపేట్‌లో 92 మి.మీ, మోర్తాడ్ 82.4 మి.మీ, నవీపేటలో 7.2 మి.మీ. వర్షం కురిసింది. సూర్యాపేట, సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది.

నిలిచిన రాకపోకలు

వర్షాలతో వాగులు పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పరిధిలోని ఈతవాగు పొంగడంతో కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, మొగళ్లపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లెనిన్‌కాలనీ – ఉంజుపల్లి నడుమ కరివాగు పొంగి ప్రవహిస్తు వడటంతో ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప పరిసర అటవీప్రాంత గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ములుగు జిల్లా మొట్లగూడెం వద్ద మల్లూరు వాగు పొంగడంతో డైవర్షన్ రోడ్డు తెగిపోయి ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు మండలంలోని ధర్మవరపు గ్రామ శివారులోని చెట్టవద్ద వరదనీరు చేరి నీటిలో బైక్‌తో సహా కొట్టుకుపోతున్న యువకుడిని గ్రామస్థులు కాపాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాగణపురం మండలంలో కొండాపూర్ వాగు దాటనివ్వకపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని మందబొగుడ, కోటా (కే), పెద్దగూడ, కరత్వాడ వద్ద వాగుల్లో నీటి ప్రవాహంతో ఆయా గ్రామాల ప్రజలు బయటకు రాలేకపోయారు. వర్షాల కారణంగా కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు సింగరేణి ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మణుగూరు శివారులో నిర్మాణ దశలో ఉన్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోకి వరద నీరు చేరింది. భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసీపీ–2లో 47,142 టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. ఉత్పత్తి రూపేణా సింగరేణి సంస్థకు రూ.11,78 కోట్లు నష్టం వాటిల్లినట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

మంజీరాకు హారతిచ్చిన ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ సలహాదారు మల్లయ్య, ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సుజాత శ్రీనివాస్‌రెడ్డి, రైతులతో కూచన్‌పల్లిలో మంజీరా నదిపై నిర్మించిన చెక్‌డ్యాం వద్ద మంజీరా నదికి హారతినిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మంజీరా నదిలో వాయినం వదిలారు.

వాగులో చిక్కుకున్న భక్తులను రక్షించిన పోలీసులు

మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శనానికి వచ్చి జంపన్న వాగులో చిక్కుకున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ గ్రామానికి చెందిన ఐదుగురు, వరంగల్‌కు చెందిన 17మంది, పస్రాకు చెందిన ఒక వ్యక్తిని పస్రా సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్‌కు మార్ అగ్నిమాపక శాఖ రెస్క్యూ టీం, పోలీసు సిబ్బందితో కలిసి కాపాడారు. - ములుగు, నమస్తే తెలంగాణ

ఇసుకవాగు దాటుతూ వ్యక్తి గల్లంతు

నర్సింహారావు(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంగొందిగూడెంలో బుధవారం ఇసుకవాగు దాటుతున్న వ్యక్తి గల్లంతయ్యాడు. ఎలకలగూడెం గ్రామానికి చెందిన తాటి నర్సింహారావు(52) వాగు దాటే క్రమంలో వాగు ఉధృతికి గల్లంతయ్యాడు. గ్రామస్థులు చూస్తుండగానే ఘటన చోటుచేసుకుంది. సమాచారంఅందుకున్న భద్రాచలం సబ్ కలెక్టర్ భవేష్‌మిశ్రా, తాసిల్దార్ ఎన్ అరుణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎన్డీర్ ఎఫ్ బృందాలను పిలిపించారు. దళాలు గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఘటన స్థలాన్ని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. – అశ్వాపురం

గ్రేటర్‌లో ఓ మోస్తరు వర్షం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో బుధవారం పలు చోట్ల ఓ మోస్తరు జల్లులు కురిశాయి. రాజేంద్రనగర్, అత్తాపూర్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, బేగంపేట, అమీర్‌పేట, అల్వాల్, సికింద్రాబాద్, సైనిక్‌పురి, బోయిన్‌పల్లి లాల్‌బజార్, షేక్‌పేట, మాదాపూర్, పాతబస్తీ, మహేశ్వరం, సరూర్‌నగర్, నాగోల్, ఉప్పల్ తదితర ప్రాంతా ల్లో తేలికపాటి వర్షం కురిసింది. రాగల 24 గంటల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయనీ, ఒకటి, రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 28.7, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 83 శాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

తీరం దాటిన తీవ్ర వాయుగుండం

హైదరాబాద్,నమస్తేతెలంగాణ: ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గరలో వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం బుధవారం మధ్యాహ్నం బాలాసోర్‌కి దగ్గరలో తీరం దాటింది. మధ్యాహ్నం 2.30కు ఉత్తర కోస్తా ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలకి దగ్గరలో కేంద్రీకృతమైంది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో పయనించి క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వానలు కురిసే అవకాశముందన్నారు. గురువారం నుంచి రెండు రోజులు రాష్ట్రంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. కొన్ని చోట్ల అతిభారీ వానలు కురవవచ్చన్నారు.

పచ్చదనంతో పుష్కలంగా వర్షాలు

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

వరంగల్ రూరల్ జిల్లా అన్నారం షరీఫ్ గ్రామంలో మహిళలతో కలిసి బోనాలను ఎత్తుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మొక్క నాటుతున్న స్పీకర్ పోచారం

జగిత్యాల జిల్లా కల్లెడ శివారులో మొక్క నాటుతున్న మంత్రి, ఎమ్మెల్యే

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పచ్చదనంతోనే సకాలంలో వర్షాలు కురుస్తాయని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ వినాయకనగర్‌లో హరితహారంలో పాల్గొని ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు.

కోతుల కోసం బ్లాక్‌లు: మంత్రి కొప్పుల ఈశ్వర్

కోతులను అడవికి పంపాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోనే మొదటిసారిగా కల్లెడ శివారులో ప్రత్యేక బ్లాకులు ఏర్పాటు చేసి పండ్లమొక్కలు పెంచుతున్నామని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కల్లెడ శివారులో పండ్ల మొక్కలను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 50 మంకీ ఫ్రూట్ కోర్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

హరితహారం బాగుంది: కేంద్రబృందం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ హరితహారం బాగున్నదని కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ కామర్స్ ఆర్కే జీనా, ఇరిగేషన్ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కేవీ ప్రసాద్ ప్రశంసించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం శివారులోని బోబ్బ అశోక్‌రెడ్డి ఆపిల్ బేర్, జామ తోటలను, దంతాలపల్లి మండలంలోని లక్ష్మీపురం, కుమ్మరికుంట్ల శివారు పాలేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లను బుధవారం పరిశీలించారు. నర్సింహులపేట ఉన్నత పాఠశాలలో భూగర్భ జలాల పెంపు, హరితహారంపై చేపడుతున్న కార్యక్రమాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పెద్దనాగారంలో మొక్కలు నాటారు.

జనగామ జిల్లాలో 'మెగా హరిత ప్లాంటేషన్'

జనగామ జిల్లాలో 'మెగా హరిత ప్లాంటేషన్' పేరిట బుధవారం ఒక్క రోజే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు 280 గ్రామాల్లో 8.03 లక్షల మొక్కలు నాటారు. మరో 10 లక్షల మొక్కలు గురువారం నాటేందుకు సన్నాహాలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఆయాప్రాంతాల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొలిసారి తెలంగాణలో నిలిచిన గోదారమ్మ

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గూడూరు: సీఎం కేసీఆర్ కృషితో తొలిసారిగా గోదారమ్మ తెలంగాణలో నిలిచిందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ గోడౌన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తున్నప్పుడు ప్రతిపక్షాలు చేసిన విమర్శలు, వేసిన కేసులు చూసి రైతులు వారిని ఈసడించుకుంటున్నారన్నారు. ప్రతి పంచాయతీకి చెత్త డంపింగ్‌కు, మొక్కలను పెంచేందుకు ట్రాక్టర్లను ఇస్తామని అన్నారు. అంతకుముందు వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి బోనాలను ఎత్తుకున్నారు.

నిట్ విద్యార్థి ఆత్మహత్య

కౌషిక్‌పాండే (ఫైల్)

నిట్‌క్యాంపస్(వరంగల్): వరంగల్ జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్) విద్యార్థి కౌషిక్ పాండే(23) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమబెంగాల్‌లోని మాల్డా జిల్లాకు చెందిన కౌషిక్ నిట్‌లో బీటెక్ ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కంప్యూటర్స్‌లో మంచి స్కోర్ రావడం లేదని మానసిక వేదనతోబుధవారం హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి విద్యార్థులు చెపుతున్నారు. రెండు రోజుల క్రితమే కౌషిక్ తన తండ్రితో కలిసి నిట్ కు చేరుకున్నాడు. కొడుకు మానసిక స్థితి కుదుటపడ్డాకే వెళ్తానని హన్మకొండలోనే ఓ లాడ్జీలో బస చేసినట్లు కౌషిక్ తండ్రి విప్లబ్‌పాండే తెలిపారు. బుధవారం ఉదయం పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదనీ, హాస్టల్‌కు వచ్చి చూడగా కౌషిక్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేటలో చేనేత ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చేనేత కార్మికులను ఆదరిద్దాం

- చేనేత ర్యాలీలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: చేనేత కార్మికులను ఆదరించాలనీ, ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి చేనేత ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు పెద్దపీట వేస్తున్నదని.. వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. సిద్దిపేట గొల్లభామ చీరెకు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందని, చేనేత కార్మికులకు దక్కిన అరుదైన గౌరవమని అన్నారు.

నిజామాబాద్‌లో గాంధీ వేషధారణలో ర్యాలీ

ఇందూరు: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 150 మంది విద్యార్థులు గాంధీ వేషధారణలో బుధవారం గాంధీచౌక్ నుంచి ర్యాలీ నిర్వహించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చేనేత దుస్తులనే ధరిస్తామని ప్రిన్సిపాల్ నందురెడ్డి ప్రతిజ్ఞ చేయించారు.

చింతమడకలో కొనసాగుతున్న వైద్యశిబిరం

- మూడోరోజు 669 మందికి పరీక్షలు

సిద్దిపేట జిల్లా చింతమడకలో వైద్య పరీక్షల కోసం క్యూలైన్‌లో వేచిఉన్న గ్రామస్థులు

కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా రూరల్ మండలం చింతమడకలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం కొనసాగుతున్నది. మూడో రోజు బుధవారం 669 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 327 మంది పురుషులు, 342 మందిస్త్రీలు, 62 మంది బాలురు, 59 మంది బాలికలు ఉన్నారు. రక్తం, టూడీఇకో, ఈసీజీ, రొమ్ము పరీక్షలు, ఎక్స్‌రే, క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు. యశోద దవాఖాన ఎండీ సురేందర్‌రావు శిబిరాన్ని సందర్శించారు. డీఎంహెచ్‌వో అమర్‌సింగ్, గడ వైద్యాధికారి కాశీనాథ్ తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ కొత్త ఒరవడిని సృష్టించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుధవారం ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి 208 మందికి చెక్కులను పంపిణీ చేయడంతోపాటు తన సొంత ఖర్చులతో లబ్ధిదారులకు చీరెలను పంపిణీ చేశారు. అనంతరం వారితోకలసి భోజనాలు చేశారు.

- చెన్నూర్, నమస్తే తెలంగాణ

ములుగులో జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పల్లా

కొలువుదీరిన జెడ్పీ పాలకవర్గాలు

- 32 జెడ్పీలు, 538 మండలాల్లో బాధ్యతల స్వీకరణ
- ములుగు సమావేశంలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పల్లా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జెడ్పీలన్నింటిలో పాలకవర్గాలు కొలువుదీరాయి. 32 జిల్లా పరిషత్‌లు, 538 మండల పరిషత్‌లలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. 28 జిల్లాల్లో జెడ్పీ చైర్మన్లు గత నెల 7న బాధ్యతలు తీసుకొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు బుధవారం ప్రమాణం స్వీకరించారు. వీరు నేటి నుంచి ఐదేండ్లపాటు పదవుల్లో కొనసాగనున్నారు. మహబూబాబాద్ జిల్లా జెడ్పీని ఎంపీడీవో కార్యాలయంలో, ములుగు జిల్లా జెడ్పీని ములుగు ఎంపీడీవో కార్యాలయంలో, ఖమ్మం జిల్లా జెడ్పీని పాత జిల్లా పరిషత్‌లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ములుగు జిల్లా జెడ్పీ తొలి సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ఆదిలాబాద్‌లో అగ్రి కళాశాల

- అగ్రి వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు వెల్లడి
- బైపీసీ స్ట్రీమ్‌లో గ్రాడ్యుయేట్ కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణలో మూడు వ్యవసాయ కళాశాలలు ప్రారంభమయ్యాయని, వచ్చే ఏడాది ఆదిలాబాద్‌లో మరో కళాశాల ప్రారంభించనున్నట్టు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ, పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన వర్సిటీలో బైపీసీ స్ట్రీమ్‌లో గ్రాడ్యుయేషన్ కోర్సుల కౌన్సెలింగ్‌ను బుధవారం పీజేటీఏస్‌ఏయూలో ఆయన ప్రారంభించారు. ప్రతిరోజు కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన సీట్ల వివరాలను పీజేటీఏస్‌ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని రిజిస్ట్రార్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్‌లో బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సులో మొదటి సీటు పొందిన విద్యార్థిని మనీషకు వీసీ ప్రవీణ్‌రావు ధ్రువపత్రం అందజేశారు.

కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ సామల సదాశివ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆదిలాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద సామల చిత్రపటానికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పూలమాలవేసినివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆరె రాజన్న తదితరులు

పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వనపర్తి జిల్లా మదనపూర్ మండలం రామన్‌పాడ్ డ్యామ్ కింద వరినాట్లు వేస్తున్న కూలీలు.

రైతుబీమాకు రూ.934 కోట్లు

- 2019-20కి ఎల్ఐసీకి చెల్లించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం
- ఉత్తర్వులు జారీచేసిన వ్యవసాయశాఖ
- గతేడాది కంటే రూ.1,284 అధిక ప్రీమియం
- 30.95 లక్షల మంది రైతులకు పథకం వర్తింపు
- హర్షం వ్యక్తంచేస్తున్న అన్నదాతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రైతుబీమా పథకం అన్నదాతల కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నది. 2019-20 ఏడాదికి రైతు బీమాకు 934.19 కోట్ల ప్రీమియాన్ని ఎల్ఐసీకి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పథకం 2020 ఆగస్టు 13 వరకు రైతులకు వర్తించనున్నది. ఒక్కో రైతు కోసం రూ.3,555.94 చొప్పున మొత్తం రాష్ట్రంలోని 30,94,656 మంది రైతులకు భరోసా కల్పించేందుకు రూ.934.19 కోట్లను ఎల్ఐసీకి చెల్లించనుంది. గతేడాది ఆగస్టులో సీఎం కేసీఆర్ రైతు బీమా పథకాన్ని ప్రారంభించి.. తన జీవితంలో చేస్తున్న అతిగొప్ప పని రైతుబీమా పథకమని పేర్కొన్నారు. 2018 ఆగస్టు 14వ తేదీ నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఏడాదికి ఎల్ఐసీతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. 18 ఏండ్ల నుంచి 60 ఏండ్లలోపు ఉన్న 29.58 లక్షల మంది పట్టాదారులకు ఒకొక్కరికి రూ.2,271.50 చొప్పున ప్రభుత్వం 2018-19కిగాను రూ.672 కోట్ల ప్రీమియం చెల్లించింది. ప్రస్తుతం బీమా పరిధిలో ఉన్న 30.92 లక్షల మంది రైతుల కోసం ఇప్పటివరకు మొత్తం రూ.704 కోట్ల ప్రీమియం చెల్లించింది. గత ఏడాది రైతు బీమా కింద చెల్లించిన పరిహారం, రైతుల మరణాల సంఖ్య, ఇతర ఖర్చులను పరిగణనలోకి తీసుకున్న ఎల్ఐసీ.. ఈసారి ప్రీమియం రేటును పెంచుతున్నట్టు పేర్కొన్నది. డిజిటల్ సైన్ పూర్తయి 18 ఏండ్ల నుంచి 59 ఏండ్ల లోపు ఉన్న 30,94,656 మంది రైతులకు ఈ ప్రీమియం రేటును లెక్కగట్టింది. ఒక్కో రైతుకు ప్రీమియం రూ.3013. 50 కాగా, ఇందులో ఎస్జీఎస్టీ 9 శాతం రూ.271.22, సీజీఎస్టీ 9 శాతం రూ.271. 22 చొప్పున చెల్లించనున్నది. స్టాంప్ డ్యూటీ కింద రూ.30.94 కోట్లు చెల్లించనున్నారు. మొత్తంగా రూ.934.19 కోట్లు ఎల్ఐసీకి చెల్లించడం ద్వారా 2019-20 రైతుబీమా పథకం వర్తింపజేయనుంది. గతేడాదికంటే ఒక్కో అన్నదాతకు రైతుబీమా ప్రీమియం జీఎస్టీతో కలిపి రూ.1284.44 అధికం కానున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న రైతుబీమా పథకంలో ఉన్న రైతుల మరణాల రేటు ఇతరత్రా ఖర్చుల ఆధారంగా ఈ ప్రీమియాన్ని నిర్ధారించినట్టు వ్యవసాయశాఖ స్పష్టంచేసింది. రైతు బీమా పథకానికి ప్రీమియం చెల్లించాలన్న సర్కారు నిర్ణయంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

15,027 రైతు కుటుంబాలకు భరోసా

రైతుబీమా పరిధిలో ఉన్నవారిలో 15,558 మంది రైతులు గతనెల 27వ తేదీ వరకు దురదృష్టవశాత్తు చనిపోయారు. వీరిలో 15,027 మంది రైతు కుటుంబాలకు ఎల్ఐసీ రూ.5 లక్షల పరిహారం చొప్పున రూ.751.35 కోట్లు చెల్లించింది. రైతుబీమా పథకంలో 0.1 ఎకరం నుంచి 2.5 ఎకరాల పరిధిలో ఉన్న రైతులు 10,673 మంది , 2.51 ఎకరాల నుంచి 5 ఎకరాల భూమి ఉన్నవాళ్లు 2,762, ఐదెకరాలకుపైగా భూమి ఉన్న రైతులు 1,592 మంది ఉన్నారు. వీరిలో 84 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులే. వీరిలో బీసీలు 7,609 మంది (51 శాతం), ఎస్సీలు 2,704 (18శాతం), ఎస్టీలు 2,143 (14శాతం), మైనార్టీలు 127 (1శాతం), ఇతరులు 2,445 (16శాతం) మంది రైతులు ఉన్నారు.

వానకాలం సాగు 80 లక్షల ఎకరాలు

- ఐదు జిల్లాల్లో అధికం.. నల్లగొండ, సూర్యాపేటల్లో లోటు వర్షం
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన వ్యవసాయశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వానకాలం పంటల సాగు విస్తీర్ణం 80.24 లక్షల ఎకరాలుగా నమోదయింది. ఇందులో పత్తి 42.60 లక్షల ఎకరాల్లో వేసినట్టు ప్రభుత్వానికి బుధవారం అందజేసిన నివేదికలో వ్యవసాయశాఖ పేర్కొన్నది. వరినాట్లు ఇప్పుడిప్పుడే పుంజుకొంటున్నాయి. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకొన్నాయి. చెరువుల్లోకి నీరు చేరడంతో బోరుబావుల కింద పరిసాగు విస్తీర్ణాన్ని రైతులు పెంచుతున్నారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం.. ప్రస్తుత వానకాలంలో 23.83 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 10.85 లక్షల ఎకరాల్లో (46 శాతం) వరి నాట్లు వేసినట్టు నివేదికలో తెలిపారు. వారం, 10 రోజుల్లో పూర్తిస్థాయిలో వరి నాట్లు పడుతాయని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. మక్కజొన్న 8.53 లక్షల ఎకరాల్లో (69 శాతం), కందులు 6.53 లక్షల ఎకరాలు (91శాతం), పెసర్లు 1.45 ఎకరాల్లో, సోయాబీన్ 4.11 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఆహారపంటల సాగు విస్తీర్ణం ఈ వానకాలంలో 47.69 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సిఉండగా.. ఇప్పటివరకు 28.92 లక్షల ఎకరాల్లో (61శాతం) సాగుచేశారు. 76 శాతం నుంచి 100 శాతం మధ్య 14 జిల్లాల్లో, 51-75 శాతం మధ్య 13 జిల్లాల్లో, 26-50 శాతం మధ్య నాలుగు జిల్లాల్లో పంటల సాగు నమోదైంది. నాలుగు రోజుల క్రితం వరకు లోటులో నమోదైన వర్షపాతం సాధారణ స్థాయికి చేరుకొన్నది. రాష్ట్ర వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం, ఐదు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. కొమ్రంభీం ఆసిఫాబాద్, వరంగల్ అర్బన్, రాజన్న సిరిసిల్ల, ములుగు, నారాయణపేట జిల్లాల్లో అధిక వర్షపాతం కురిసింది. 26 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో లోటు వర్షపాతం ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం నాటికి 429.3 మి.మి వర్షపాతం నమోదయ్యింది.

వనపర్తి జిల్లా పెబ్బేరులో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

విత్తన, ఎరువుల సరఫరా బాధ్యత అధికారులదే

- ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారుల సమీక్షలో మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు వ్యవసాయం: ప్రాజెక్టులకు వరద భారీగా వస్తున్న సమయంలో వ్యవసాయశాఖ అప్రమత్తంగా ఉండి రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల కోసం రైతులు రోడ్డుమీదకు వస్తే అధికారులే బాధ్యత వహించాలని సూచించారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలకేంద్రంలోని జూరాల అతిథి గృహంలో బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు వానాకాలం సాగు కోసం కావల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. రైతుబంధు ప్రక్రియలో జాప్యం తగదని రానున్న తొమ్మిది, పది రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

మధ్యంమత్తులో మహారాష్ట్ర ఎస్సై వీరంగం

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గణేశ్‌పూర్ సంతలో హల్‌చల్

వాంకిడి: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం గణేశ్‌పూర్ పశువుల సంతలో బుధవారం సాయంత్రం మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజుర పోలీస్‌స్టేషన్ ఎస్సై విజయ్‌సింగ్, కానిస్టేబుల్ మహేశ్ మద్యంమత్తులో వీరంగం సృష్టించారు. మహారాష్ట్ర నుంచి ఓ లారీ పశువుల లోడ్‌తో గణేశ్‌పూర్ పశువుల సంతకు వచ్చింది. మద్యంమత్తులో ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ పశువుల లారీని గమనించి వెంబడించి వాంకిడి మండలం గణేష్‌పూర్ నిర్వహించే పశువుల సంతకు చేరుకొని లారీ డ్రైవర్ నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో డ్రైవర్‌పై చేయి చేసుకున్నాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మహారాష్ట్ర ఎస్సై, కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వంపై పోరాడుదాం

- దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు సాధించుకుందాం
- జాతీయ ఓబీసీ మహాసభలో మంత్రి ఈటల రాజేందర్
- క్రీమీలేయర్‌ను బీసీల మీద రుద్దారు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆర్మూర్‌పురం: ఓబీసీలంతా ఐక్యంగా ఉంటూ కేంద్ర ప్రభుత్వంతో పోరాడి రిజర్వేషన్లు సాధించుకుందామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. హక్కులు, రిజర్వేషన్ అమలుకావాలంటే ఓబీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఓబీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మాజీ న్యాయ మూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించిన జాతీయ ఓబీసీ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అంబేద్కర్, పూలే చెప్పినట్టుగా జాతికి జ్ఞానం వస్తేనే చైతన్యం వస్తుందని, ఆ విధంగా కలిసికట్టుగా ముందుకుసాగి 27 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలని కోరారు. ఓబీసీ రిజర్వేషన్లు కావాలని ఆనాడు మొరార్జీదేశాయ్ కమిటీవేస్తే పదేండ్లపాటు దానిని అప్పటి కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని అన్నారు. 72 ఏండ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఓబీసీలు తమకు న్యాయం జరుగడం లేదని ఆక్రోషించే పరిస్థితి ఎందుకు వచ్చిందో ఒక్కసారి నాయకులు ఆలోచించాలని సూచించారు. 27 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని చట్టాలు ఉన్నా కేవలం 6 నుంచి 11 శాతం వరకు అమలవుతున్నాయని అన్నారు. ఓబీసీ జాతీయ మహాసభలో ప్రవేశపెట్టిన డిమాండ్ల కోసం తెలంగాణ ప్రభుత్వం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా బీసీ బిడ్డల చదువుల కోసం 240 గురుకులాలను ఏర్పాటుచేసి ప్రతి విద్యార్థిపై ఏటా రూ.1.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్నదని అన్నారు.

బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ ఓబీసీ మహాసభలో అభివాదంచేస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జస్టిస్ వంగాల ఈశ్వరయ్య తదితరులు

విద్య, ఉద్యోగ, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

దేశంలో రిజర్వేషన్లు పొందుతున్న ఏ సామాజికవర్గానికి లేని క్రీమీలేయర్‌ను బీసీల నెత్తిమీద బలవంతంగా రుద్దారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. విద్య, ఉద్యోగ, ప్రమోషన్లలో కేంద్రం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేశారు. దేశ జనాభాలో 85 శాతం ఉన్న ఓబీసీల కోసం ఒక్క మంత్రిత్వశాఖ లేదని విమర్శించారు. భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు క్రీమీలేయర్ వల్ల ఉద్యోగాల్లో ఎంతో నష్టం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ, మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్, తల్లోజు ఆచారి, హీరో సుమన్, ఆర్ నారాయణమూర్తి, మహదేవరాజ్ జానకర్, బాబన్ ఢైమ్‌వాడే, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త

- వరంగల్ అర్బన్ జిల్లా ముప్పారంలో దారుణం

ధర్మసాగర్: తాగుడుకు బానిసైన వ్యక్తి మద్యం మత్తులో భార్యను హతమార్చాడు. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో చోటుచేసుకున్నది. సీఐ షాదుల్లాబాబా తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన గట్టమ్మ (35)ను ఇదే మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన రాజుకిచ్చి పదేండ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. రాజు మద్యానికి అలవాటుపడి కొంతకాలంగా భార్యతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం గట్టమ్మ తలపై మంచం కోడుతో కొట్టడడంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ఇంటికి తలుపులు వేసి పారిపోయాడు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన కుమారుడు రమేశ్ తలుపులు తీసి చూడగా తల్లి గట్టమ్మ రక్తపు మడుగులో పడి ఉన్నది. సమాచారమందుకున్న పోలీసలు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఇంకుడుగుంతలో పడి చిన్నారి మృతి

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం మండలం హర్యాతండాలో నాలుగేండ్ల చిన్నారి ఇంకుడు గుంతలోపడి మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యాతండాకు చెందిన బానోతు ఉపేందర్, శైలజ దంపతుల కుమార్తె రిషిత(04) ఇంటి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇంకుడు గుంతలో పడి మృతిచెందింది. ఆ సమయంలో తల్లితండ్రులు ఇంటిముందు పొలంలో వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు.

లైంగిక దాడి.. పదేండ్లు జైలు

కరీంనగర్ లీగల్ : లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేండ్ల జైలుశిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక మహిళా కోర్టు, ఇంచార్జి ప్రధానన్యాయమూర్తి అనుపమ చక్రవర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు హుజూరాబాద్ మండలం కాట్రపల్లికి చెందిన యువతిపై (25) అదే గ్రామానికి చెందిన మాడుగుల నాగరాజు (45)2009లో లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి హుజురాబాద్ పోలీసులకు ఫిర్యాదుచేయగా.. నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకొని చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందుర్తి మధుకర్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి బుధవారం నిందితుడైన మాడుగుల రాజు (45)కు పదేళ్ల కఠిన జైలుశిక్ష, రూ. 25వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా సొమ్మును బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పులో కోరారు.

షరతులతో అఫిలియేషన్లు

- ప్రైవేట్ కాలేజీలకు ఊరటనిచ్చేలా మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశం
- ఇంటర్ ఫీజుల పెంపుదలపై చర్చ
- డిగ్రీ ఐదోవిడుత కౌన్సెలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు షరతులతో కూడిన అఫిలియేషన్లు (అనుబంధ గుర్తింపు) ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ కాలేజీలకు ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు వంటి ఆంక్షలు సడలించి ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకొన్నట్టు తెలిసింది. బుధవారం సచివాలయంలోని తన చాంబర్లో ఉన్నతాధికారులతో దాదాపు ఐదున్నర గంటలపాటు మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజు పెంపుపై కూడా చర్చించారు. అవసరమైతే కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలనే విషయం చర్చకు వచ్చినట్టు సమాచారం. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖల కమిషనర్ నవీన్‌మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొన్నారు. డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఐదో విడుత కౌన్సెలింగ్ నిర్వహించడంపై మంత్రి సానుకూలంగా నిర్ణయం తీసుకొన్నట్టు అధికారులు చెప్తున్నారు. ఇందుకు మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర నాయకులు ఎస్వీసీ ప్రకాశ్, పరమేశ్వర్, రమణారెడ్డి పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి మంత్రి తీసుకొన్న నిర్ణయాలపై వారు హర్షం ప్రకటించారు.

బుధవారం సచివాలయంలో ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ రచించిన 'బౌద్ధం-తెలంగాణ అస్తిత్వం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కూడా ఉన్నారు.

బౌద్ధంలో తెలంగాణ అస్తిత్వ మూలాలు

- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బౌద్ధం విలసిల్లిన ప్రాంతమని, తెలంగాణ అస్తిత్వ మూలాలు బౌద్ధంలో ఉన్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రముఖ చిత్రకారుడు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ రచించిన 'బౌద్ధం-తెలంగాణ అస్తిత్వం' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రసిద్ధ బౌద్ధక్షేత్రాలు సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరి, నాగారం, అర్వపల్లి, తిరుమలగిరి, వర్ధమానకోట్లలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తెలంగాణ చరిత్రకారుడు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, డాక్యుమెంటరీ ఫిలిం డైరెక్టర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి జయశంకర్ సీడీ అందజేత

తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ కొత్తపల్లి జయశంకర్‌పై దక్కన్ టాకీస్ నిర్వాహకుడు చరణ్.. తాను రూపొందించిన 'తెలంగాణ కాలజ్ఞాని' డాక్యుమెంటరీని మంత్రి జగదీశ్‌రెడ్డికి బుధవారం అందించారు.

10న టీవీఎస్ రాష్ట్ర మహాసభలు

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) మూడో రాష్ట్రస్థాయి మహాసభలను ఈ నెల 10న తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు టీవీఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రారంభ సమావేశంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నది. టీవీఎస్ అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో 'మతతత్వ రాజకీయాలు- ప్రజాస్వామ్య శక్తుల పాత్ర' అంశంపై ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మీరాచందోక్, రెండో సమావేశంలో 'సమాఖ్య స్ఫూర్తి- ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై కేంద్ర సమాచారశాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, 'తెలంగాణ సామాజిక ఐక్యత- సవాళ్లు- పరిష్కారాలు' అంశంపై నమస్తే తెలంగాణ డిప్యూటీ ఎడిటర్ పీ వేణుగోపాలస్వామి ప్రసంగించనున్నట్టు టీవీఎస్ వెల్లడించింది. 'తెలంగాణ తెహజీబ్‌ను కాపాడుకుందాం' అన్న నినాదంతో తెలంగాణ వికాస సమితి పనిచేస్తున్నదని సమితి అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ తెలిపారు.

ఏపీలో నదులకు వరద

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోకు రుస్తున్న భారీ వర్షాలకు జలాశయాలు నిండుతున్నాయి. నదులు పొంగిపొర్లుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో, ఒడిశాలోనూ కురుస్తున్న వర్షాలకు నాగావళి, వంశధార నదులకు వరద పోటెత్తింది. నాగావళి వరద కారణంగా విజయనగరం జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టులోకి భారీగా నీరుచేరింది. ప్రస్తుతం 23,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 17,101 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నది. నాగావళి నదికి పెరిగిన వరద ఉధృతితో అధికారులు అప్రమత్తమై, నదీపరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాలోని హీరమండలంలోని గొట్టా బ్యారేజీకి సైతం భారీగా వరద వస్తున్నది. లక్ష క్యూసెక్కుల వరకు వరదనీరు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నివాస్ సూచించారు. ప్రజలు నదిని దాటవద్దని, మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లొద్దని హెచ్చరించారు.

శాతవాహన వర్సిటీ తొలి స్నాతకోత్సవం నేడు

కరీంనగర్ ఎడ్యుకేషన్: శాతవాహన యూనివర్సిటీ (ఎస్‌యూ) తొలి స్నాతకోత్సవానికి ముస్తాబయ్యింది. గురువారం అట్టహాసంగా కాన్వొకేషన్ డేను నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బొమ్మకల్ బైపాస్ వద్ద గల వీ కన్వెన్షన్‌లో ఈ వేడుకను నిర్వహిస్తున్నారు. వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ ఎల్ నరసింహన్ ఈ వేడుకకు హాజరుకానుండగా, ముఖ్య అతిథిగా నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ న్యూ ఢిల్లీ డైరెక్టర్ కేకే అగర్వాల్ పాల్గొననున్నారు.

పెద్దపల్లిలో భారీ 'ఎకో' గణేశుడు..

కలెక్టరేట్ : పెద్దపల్లిలోని ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో భారీ ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రెండేండ్లుగా మట్టివిగ్రహాన్ని పూజిస్తున్నారు. ఈ ఏడాది కోల్‌కతా నుంచి వచ్చిన 12 మంది కళాకారులు మట్టి, గడ్డిని ఉపయోగించి, 39 అడుగుల విగ్రహాన్ని రూపొందిస్తున్నారు.

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో కొత్త వ్యవస్థ

- లైటింగ్, ఏసీకి నూతన సాంకేతికత
- ఏడాదికి రూ.1.35 కోట్లు ఆదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కోచ్‌లలో లైటింగ్, శీతలీకరణకు అవసరమైన విద్యుదుత్పాదనకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం హెడ్ ఆన్ జనరేషన్ (హెచ్‌వోజీ) వ్యవస్థను బుధవారం ప్రారంభించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. గతంలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ఈ అవస

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

మా మాట!

సీఎం కేసీఆర్ నిర్ణయాలు భేష్

రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకొంటున్న నిర్ణయాలు చాలా బాగున్నాయి. ముఖ్యంగా రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూరికార్డుల ప్రక్షాళన చేపట్టి ఎంతో మేలుచేశారు. కొందరు అధికారులు లంచాలకు ఆశపడి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రెవెన్యూశాఖకే వారు మచ్చగా మారారు. సీఎం కేసీఆర్ చెప్తున్నట్టుగా రెవెన్యూశాఖ ప్రక్షాళనతోనే అధికారుల్లో మార్పు వచ్చి రైతులకు మేలు జరుగుతుంది. సాధ్యమైనంత త్వరగా ప్రక్షాళన చేపట్టాలి.

- ముంజ రామస్వామి, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా

రైతులకు మేలుచేస్తున్న 'ధర్మగంట'

ఏండ్లుగా భూసమస్యలతో సతమతమవుతున్న రైతులకు 'ధర్మగంట' చుక్కానిలా మారి, బాధితులకు ఎంతో మేలుచేస్తున్నది. రికార్డులలో మార్పులు, చేర్పుల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి తిగిరి వేసారిన బాధితులు సీఎం కేసీఆర్ తీసుకొన్న నిర్ణయాలు, 'నమస్తే తెలంగాణ' కథనాలతో సమస్యలు పరిష్కారమై ఉపశమనం పొందుతున్నారు. వ్యవసాయ పనులు మాని మరీ కార్యాలయాల చుట్టూ తిరిగినవారు ఇప్పుడు వారి పని వారు చేసుకొంటున్నారు. బాధిత రైతులు సీఎం కేసీఆర్‌కు, 'నమస్తే తెలంగాణ'కు రుణపడి ఉంటారు.

- కాసాని సుజాత, దుద్దెడ, కొండపాక మండలం, సిద్దిపేట జిల్లా

భూసమస్యలకు సత్వర పరిష్కారం

గతంలో భూరికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేయించుకొనేందుకు రైతులు ఏండ్ల తరబడి తాసిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండేవారు. రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు.. భూరికార్డుల ప్రక్షాళన చేపట్టారు. అవినీతిని అంతం చేయడానికి రెవెన్యూశాఖ ప్రక్షాళనకు నడుంబిగించారు. ఈ మార్పులతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నారు. రైతుల గురించి ఇంతమంచి ఆలోచనలు చేసే వ్యక్తి సీఎంగా ఉండటం మనందరి అదృష్టం.

- స్వాతి, కట్టవారిగూడెం, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా

సీఎం కేసీఆర్ చొరవ ప్రశంసనీయం

'ధర్మగంట'లో ప్రచురితమవుతున్న కథనాలతో భూసమస్యలు వెంటనే పరిష్కారమవుతున్నాయి. ఏండ్ల తరబడి పరిష్కారం కాని భూసమస్యలు కేవలం రోజుల వ్యవధిలోనే కొలిక్కివస్తుండటం సంతోషకరం. పాస్‌పుస్తకాలు రాని రైతుల ఇండ్ల వద్దకే అధికారులు నేరుగా వచ్చి అందజేస్తున్నారు. రెవెన్యూశాఖలో అవినీతి అంతానికి సీఎం కేసీఆర్ చొరవ ప్రశంసనీయం.

- రావుల శ్రీను, వెల్మగూడెం సర్పంచ్, పెద్దవూర మండలం, నల్లగొండ జిల్లా

లంచగొండితనం పోవాలి

ప్రభుత్వ అధికారుల్లో లంచగొండితనం పోవాలంటే సీఎం కేసీఆర్ తెస్తున్న నూతన చట్టం అమలుకావాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పనితీరుపై పర్యవేక్షణలోపంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కేసీఆర్ అనుకొన్న విధంగా రెవెన్యూశాఖలో మార్పు తీసుకొస్తే ప్రజలు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం ఉండదు. వారి కష్టాలు తొలగిపోతాయి. అవినీతి అంతానికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయం.

- హుస్సేన్‌నాయక్, సోమ్లాతండా, నూతనకల్ మండలం, సూర్యాపేట జిల్లా

తమ్ముడి తాయిలం.. అన్నకు అన్యాయం

- ఇంట్లో కిరాయి ఉన్నందుకు రుణం తీర్చుకొన్న వీఆర్వో
- వారసులను పిలువకుండా.. విచారణ చేయకుండా అడ్డగోలుగా పట్టా మార్పిడి
- న్యాయం చేయాలని వేడుకొంటున్న మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైతు రామచంద్రారెడ్డి

పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం వారసత్వంగా అన్నకు సంక్రమించాల్సిన భూమిని ఓ వీఆర్వో అక్రమంగా తమ్ముడికి రాసేశారు. ఈ సంగతి తెలియని రైతు అమాయకంగా ఆ భూమిని సాగుచేసుకొంటున్నారు. కానీ, భూరికార్డుల ప్రక్షాళ న సమయంలో తన భూమికి సంబంధించిన వన్-బీ పత్రాన్ని అధికారులు ఇవ్వకపోవడంతో ఆ అన్న అవాక్కయ్యారు. ఇదేమని అడిగితే మొత్తం భూమి మీ తమ్ముడి కొడుకు పేరిట ఎప్పుడో పట్టా అయిందని తాపీగా చెప్పారు. ఒకవేళ విరాసత్ చేస్తే తానే కాస్తులో ఉన్నందున అతనికే చేయాలి. లేకపోతే నలుగురు అన్నదమ్ములకు సమానంగా చేయాలి. ఇవేమీ చేయకుండా ఒక్కరికే మొత్తం భూమిని రాసివ్వడంలో వీఆర్వో చేతివాటం చూపారు. తనకు న్యాయంచేయాలంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన రైతు రామచంద్రారెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

బాధిత రైతు రామచంద్రారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన మాధవపెద్ది రామచంద్రారెడ్డి.. తన తండ్రి గోపాల్‌రెడ్డికి ఉన్న నలుగురు సంతానంలో రెండోవారు. మాధవపెద్ది రామచంద్రారెడ్డి సోదరులు ముగ్గురు కూడా ఉద్యోగాల రీత్యా చాలా ఏండ్ల క్రితమే ఊరొదిలి వెళ్లిపోయారు. వీరి తండ్రి గోపాల్‌రెడ్డికి గ్రామంలోని చెరువు కింద సర్వే నంబర్ 378లో 1.10 ఎకరాల భూమి ఉన్నది. రామచంద్రారెడ్డి మొదట్నుంచీ ఊళ్లోనే ఉన్నారు. తండ్రి భూమిని సాగుచేసేవారు. తండ్రి తదనంతరం తల్లిని సాదడానికి రామచంద్రారెడ్డి సోదరులు ముగ్గురూ ముందుకు రాకపోవడంతో గ్రామంలోని పెద్దలంతా కలిసి.. 'మీ అమ్మను నువ్వే సాదుకో.. అమ్మను సాదుకొన్నందుకు చెరువు కింద ఉన్న 1.10 ఎకరాల భూమిని నువ్వే తీసుకో' అని చెప్పారు. ఈ మేరకు రామచంద్రారెడ్డి ఓ పక్క తల్లిని చూసుకొంటూ.. మరో పక్క భూమిని సాగుచేసుకొంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నీటితీరువాను రద్దుచేసేంత వరకు కూడా రామచంద్రారెడ్డి క్రమం తప్పకుండా చెల్లించారు. కానీ, ఎప్పుడు ఎలా మారిందో కూడా తెలియకుండా తన తల్లి పేరిట ఉన్న భూమి తమ్ముడు వెంకట్‌రెడ్డి కొడుకు అరవింద్‌కుమార్ పేరిట నమోదైంది. ఒకవేళ తల్లి పేరిట ఉన్న భూమిని విరాసత్ చేయదలచుకొంటే.. వారసులందరికీ సమానంగా పంచాలి. లేకుంటే.. గ్రామంలోని పెద్దమనుషులంతా తీర్మానించినట్టుగా.. తల్లిని సాది.. కాస్తులో ఉన్న వ్యక్తికి చేయాలి. లేకపోతే నలుగురు వారసులను పిలిచి వారితో మాట్లాడి.. గ్రామంలో విచారించి.. అందరి సంతకాలు తీసుకొని నిర్ణయంచేయాలి. వీటిలో ఏదీ చేయకుండా ఏకపక్షంగా ఒకరి పేరిట మొత్తం భూ బదలాయింపు చేయడం అన్యాయమని బాధితుడు రామచంద్రారెడ్డి వాపోతున్నారు. తాను సాగుచేసుకొంటున్న భూమిని తన తమ్ముడి కొడుకు పేరిట ఎలా నమోదుచేశారని ప్రశ్నిస్తే.. తప్పు జరిగింది, సరిచేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకూ అ పనిచేయలేదు. తాసిల్దార్‌ను కలిస్తే.. 'మీరు పెద్ద మనిషి.. మీరు తిరుగకండి..' అని వీఆర్వోను పిలిచి కాలయాపన ఎందుకుచేశావు.. వెంటనే ఫైల్ పెట్టు అని ఆదేశించారని పేర్కొన్నారు. కానీ సదరు వీఆర్వో.. తన తమ్ముడి ఇంట్లోనే కిరాయికి ఉంటారని.. వారి వద్ద డబ్బులు తీసుకొని ఈ పనిచేసి ఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయంచేయాలని వేడుకొంటున్నారు.

మాధవపెద్ది రామచంద్రారెడ్డి నీటితీరువా కట్టిన రసీదు

వాటా వస్తుందని మరో ఇద్దరు ఫిర్యాదుచేశారు: వీఆర్వో

ఈ వ్యవహారంపై స్థానిక వీఆర్వో వెంకట్రాములును ప్రశ్నించగా.. 'ఈ భూమిలో తమకు కూడా వాటా వస్తుందని మరో ఇద్దరు ఫిర్యాదుచేశారు. దీంతో విచారణచేశాం. గ్రామంలో విచారించగా.. సర్వే నంబర్ 378లోని 1.10 ఎకరాల్లో 20 గుంటలలో మాత్రమే రామచంద్రారెడ్డి కాస్తులో ఉన్నారని తెలిసింది. మిగతా దాంట్లో వెంకట్‌రెడ్డి కాస్తులో ఉన్నారని నిర్ధారించాం. ఈ మేరకు రిపోర్టు ఉన్నతాధికారులకు 'పంపాను' అని చెప్పారు. అయితే ఈ భూమిని ఒక్కరికే ఎలా పట్టా చేశారని ప్రశ్నిస్తే.. ఇది ఎప్పుడో జరిగిందని.. తనకు తెలియదని వీఆర్వో తెలిపారు. వాస్తవంగా భూమి ఎవరిపేరిట పట్టా ఉంటే వారి వద్ద నీటి తీరువా వసూలు చేయాలి, కానీ దీనికి భిన్నంగా రామచంద్రారెడ్డి వద్ద నీటితీరువా ఎలా వసూలుచేశారని వీఆర్వోను అడిగితే జవాబివ్వలేదు. వెంకట్‌రెడ్డి ఇంట్లో కిరాయికి ఉన్నందుకే వాళ్లకు పట్టాచేశావంటున్నారు కదా? అని అడిగితే అలాంటిదేమి లేదని బదులిచ్చారు.

పట్టా ఉన్నా పట్టించుకొంటలేరు

- రైతుబంధు ఇవ్వడంలేదు
- పంచాయతీ మాజీ ఉద్యోగికి చుక్కలు చూపిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన తవిటి మాధవయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్‌లో తవిటి మాధవయ్య ఇరవై ఏండ్లకుపైగా పంచాయతీలో కావల్కర్‌గా పనిచేశారు. గ్రామంలో ఏ భూమి ఎవరి పేరిట ఉన్నది.. ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉన్నదనే విషయాల్లో పట్టున్న వ్యక్తి.. ఇప్పుడు అతని భూమినే అధికారులు వివాదంలోకి నెట్టేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 20/ఉలో 33 గుంటలు, 20/1ఇలో 24 గుంటలు, 27/ఆ/3లో ఎకరం, 27/ఆ 2లో 18 గుంటలు, 27/ఆ2లో 30 గుంటలు, 27/అ1లో 27 గుంటలు, 117/ఈలో 15 గుంటలు.. మొత్తం 4.27 ఎకరాలు తవిటి మాధవయ్య పేరిట పట్టా ఉన్నది. ఈ భూమికి అధికారులు కొత్త పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. రైతుబంధు తొలి విడుతగా ఎకరానికి రూ.4 వేల చొప్పున రూ.18,700 చెక్కు అందింది. ఆ తర్వాత రైతుబంధు అందలేదు. రైతుబంధు కోసం తన బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు నంబర్‌ను వ్యవసాయశాఖలో ఇచ్చారు. అయితే అధికారులు మాత్రం తన ఖాతా నంబర్ ఆన్‌లైన్‌లో చూపించడంలేదని చెప్పారు. ఈ విషయమై తాసిల్దార్‌ను కలువగా.. భూమి వివాదంలో ఉన్నందున రైతుబంధు ఆగినట్టు మాధవయ్యకు తెపారు. తన భూమిపై ఎలాంటి వివాదం లేదని, కావాలనే అధికారులు రైతుబంధు రాకుండా అడ్డుకొంటున్నారని బాధితుడు వాపోయారు. ఈ విషయంపై తాసిల్దార్‌ను 'ధర్మగంట' వివరణ కోరగా.. మాధవయ్య పేరిట 4.27 ఎకరాల భూమి ఉన్నదని, గతంలో ఆ భూమిపై వివాదం ఉండటంతో సర్వే చేసి అతడికి సంబంధించిన భూమికి పట్టా అందించామని చెప్పారు. రైతుబంధు వ్యవహారం వ్యవసాయశాఖ పరిధిలోనిదని పేర్కొన్నారు.

మోఖాలో ఉన్నా పాస్‌బుక్ ఇవ్వరా?

- 20 ఏండ్లుగా కాస్తులో ఉన్నా పట్టించుకొంటలేరు
- పాత పాస్‌పుస్తకం చూపినా పట్టాచేస్తలేరు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భూపాలపల్లి జిల్లా బాధితుడు

పత్రాలు చూపుతున్న వెంకటేశం

మహాముత్తారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో రెవెన్యూ అధికారుల లీలలు రోజుకొకటి బయటపడుతున్నాయి. రెవెన్యూ అధికారుల తీరుతో గిరిజన గ్రామాల్లోని బాధిత రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోతున్నది. మహాముత్తారం మండలం మినాజీపేట పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొండి వెంకటేశం పరిస్థితి మరీ దారుణం. ఆయన భార్య కొండి రమాదేవి పేరిట సర్వే నంబర్ 207/25లో 6.35 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి పాత పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు రమాదేవి పేరిట కొత్త పాస్‌పుస్తకాన్ని అందించలేదు. పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా రేపు మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారని బాధితుడు వెంకటేశం వాపోయారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్ పక్కన ఉన్న భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ తన అవసరం నిమిత్తం కొండి వెంకటేశం అన్న కుమారుడు కొండి కుమారస్వామికి సర్వే నంబర్ 207/25లో మూడెరాల భూమిని 1994లో రూ.72 వేలకు అమ్మారు. అదే సర్వే నంబర్‌లో అబ్దుల్ సత్తార్.. కొండి వెంకటేశం బావ బండి స్వామికి 2.20 ఎకరాల భూమిని రూ.53 వేలకు అమ్మారు. బండి స్వామి.. అబ్దుల్ సత్తార్ వద్ద కొన్న భూమిని 24/03/2000 తేదీన కొండి వెంకటేశంకు అమ్మగా, ఆయన తన భార్య పేరిట పట్టాచేసుకొన్నారు. అదేవిధంగా అన్నదమ్ముల వాటాలో భాగంగా అబ్దుల్ సత్తార్ వద్ద కొండి కుమారస్వామి కొన్న భూమి మూడెకరాలు కొండి వెంకటేశానికి వచ్చింది. ఇదే సర్వే నంబర్‌లో కొండి వెంకటేశం తండ్రికి 1.20 ఎకరాల భూమి ఉన్నది. మొత్తం ఏడు ఎకరాల భూమిలో కొండి వెంకటేశం భార్య కొండి రమాదేవి పేరిట 6.35 ఎకరాలకు పాత పాస్‌పుస్తకం ఉన్నది. 20 ఏండ్ల నుంచి ఈ భూమిలో కొండి వెంకటేశం కాస్తులో ఉన్నారు. పలుమార్లు స్థానిక దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణం కూడా తీసుకొన్నారు. అయితే భూరికార్డుల ప్రక్షాళనలో అబ్దుల్ సత్తార్ రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని తమకు కొత్త పాస్‌పుకం రాకుండాచేశారని బాధితుడు వాపోతున్నారు. దీంతో పలుమార్లు పెద్ద మనుషుల్లో పంచాయతీ కాగా, అన్ని పత్రాలు కొండి వెంకటేశం వద్ద ఉండటంతో పెద్దలు బాధితుడికి అనుకూలంగా తీర్పుచెప్పారు. వీఆర్వో కాసులకు కక్కుర్తిపడి పాస్‌పుస్తకం ఇవ్వకుండా తిప్పలు పెడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వో పలుమార్లు డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో చుట్టూ తిప్పించుకొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయంచేయాలని వెంకటేశం వేడుకొంటున్నారు.

ముసలవ్వకూ ముప్పుతిప్పలు

- రెండెకరాల్లో ఎకరం మాయం
- కోడలి పేరిట మరో ఎకరం
- మిగిలింది ఐదు గుంటలు
- 95 ఏండ్ల వయసులో రెవెన్యూ కష్టాలు
- ధర్మగంటను ఆశ్రయించిన రాజన్న సిరిసిల్ల జిల్లా బాధితురాలు

ఆమె వయసు 95 ఏండ్లు. ఆమెకున్నది 2.05 ఎకరాలు. కొత్త పాస్‌పుస్తకం వచ్చింది. రెండు విడుతల రైతుబంధు కూడా అందింది. జీవిత చరమాంకంలో ఉన్న ఆ వృద్ధురాలు తనకున్న భూమిని మనుమలు, మనుమరాళ్లకు రాసివ్వాలని అనుకొన్నారు. రెండెకరాల్లోంచి 1.20 ఎకరాలను ముగ్గురికి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. కానీ వీరికి రెవెన్యూ అధికారులు ఫౌతీ చేయలేదు. పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయలేదు. మిగిలిన భూమిలో మరో 20 గుంటల భూమిని ఇంకో మనుమడికి విరాసత్ చేయాలనుకొన్నారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం సదరు మనుమడి తల్లి పేరిట ఏకంగా ఎకరం భూమిని రాసేశారు. మిగతా ఎకరం భూమిని రికార్డుల్లోంచి పూర్తిగా తొలగించివేశారు. ఇదేమిటని అడిగితే పట్టించుకొన్న అధికారులు లేరు. దీంతో దిక్కుతోచని ఆ వృద్ధురాలు న్యాయం చేయాలంటూ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆ వృద్ధురాలి గోడు ఆమె మాటల్లోనే..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ :

'నాపేరు చిగురు లస్మవ్వ. భర్త పేరు చిగురు చిననర్సయ్య. మాది రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామం. నా భర్త 1973లోనే మరణించాడు. నాకు అదే ముస్తాబాద్ మండలంలోని బందన్‌కల్ గ్రామంలో సర్వే నంబర్లు 754 సీ/బీ లో 29 గుంటలు, 755 ఏ/ఏ లో 37 గుంటలు, 756 డీ లో 5 గుంటలు, 797 లో 14 గుంటలతో కలిపి మొత్తం 2.05 ఎకరాల భూమి ఉన్నది. సదరు భూమి నాకు వారసత్వంగా సంక్రమించింది. భూరికార్డుల ప్రక్షాళన వరకు ఆ భూమికి సంబంధించిన పాత పుస్తకాల్లోనూ, రికార్డుల్లోనూ నేనే ఉన్నాను. అనంతరం నాకు ఆ భూమిపై రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకమూ మంజూరుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు పంట పెట్టుబడి సహాయాన్ని రెండు విడుతలు అందుకున్నాను. సత్యనారాయణ, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రాజు.. నా కొడుకులు. వారికి పిల్లలున్నారు. నాకున్న 2.05 ఎకరాల భూమిలోనుంచి రెండెకరాలను నా కొడుకుల పిల్లలకు సమానంగా పంచివ్వాలనుకున్నాను. అదేవిధంగా పెద్ద కొడుకు బిడ్డ పద్మకుమారికి, రెండో కొడుకు కుమారుడు రవి, మూడో కొడుకు కుమారుడు నరేశ్‌లకు.. 20 గుంటల చొప్పున 2017 లోనే రిజిస్ట్రేషన్ కూడా చేశాను. కొద్ది రోజుల తర్వాత నాలుగో కొడుకు కుమారుడు సతీశ్‌కూ రిజిస్ట్రేషన్ చేయడానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాం. మా మనుమడు తనకొచ్చే 20 గుంటల భూమిని తన పేరిట కాకుండా వాళ్ల అమ్మ లక్ష్మి పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని అడిగాడు. మిగతా అందరికి చేసినట్లే నీకు కూడా చేస్తానని నేను చెప్పాను. కోడలి పేరిట రిజిస్ట్రేషన్ చేయననడంతో ఆనాడు ఆ ప్రక్రియ ఆగిపోయింది. అప్పటి వరకు నాకున్న 2.05 ఎకరాల నుంచి 1.20 ఎకరాలను నా పేరు నుంచి రికార్డుల్లో తొలగించారు. అది పోను 25 గుంటలు నా పేరిటే ఉండాలి. కానీ ప్రస్తుతం నాపేరిట కేవలం 5 గుంటలు మాత్రమే ఉన్నది. నా పేరిట ఉన్న 1.20 ఎకరాలను నా పేరు నుంచి తొలగించారే కానీ.. ఆ భూమిని నేను రిజిస్టర్ చేసిన నా ఇద్దరు మనుమలు, మనుమరాలి పేర్లను రికార్డుల్లోకి ఎక్కించలేదు. వారికి కొత్త పాస్‌పుస్తకాలు మంజూరుచేయలేదు. మరోవైపు నా కోడలు లక్ష్మి పేరిట ఎకరం భూమిని రాసేశారు. రికార్డుల్లోకి ఎక్కించి.. పాస్‌పుస్తకం కూడా ఇచ్చేశారు. నా కోడలు పేరిట పట్టా చేయించుకొన్న ఎకరం భూమిలో ఇరవై గుంటలను వాస్తవంగా నేను నా మనుమడికి ఇద్దామనుకొన్నదే. కానీ నేను రిజిస్ట్రేషన్ చేయలేదు. పోనీ ఆ ఇరవై గుంటలు రాసుకున్నారంటే.. ఏకంగా మరో ఇరవై గుంటలను కలుపుకొని ఎకరం భూమిని వారి పేరిట అక్రమంగా పట్టా చేయించుకొన్నారు. మిగతా ఎకరం భూమి ఏమైందో తెలియదు. ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కడ వెతికినా కనిపించడంలేదు. ఈ భూమి ఎలా మాయమైందో ఇప్పటికీ అర్థం కాలేదు. అధికారులను అడిగితే.. ఎవరూ జవాబు చెప్పరు. నాకు తెలియకుండానే నా భూమిని అడ్డగోలుగా బదలాయించారని.. రికార్డులను సవరించాలని.. న్యాయం చేయాలని వేడుకొన్నా పట్టించుకొనే నాథుడు లేడు. రెవెన్యూ అధికారుల చర్యల వల్ల నా ఇద్దరు మనుమలు, మనవరాలు అన్యాయమైపోతున్నారు. నాకిప్పుడు 95 ఏండ్లు.. ఈ వయసులో కూడా సమస్యను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఏ ఒక్క అధికారి కూడా కనీసం కనికరం చూపడంలేదు. రేపు.. మాపు అంటూ తిప్పలుపెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నా భూమిని నా మనుమరాలు, మనుమళ్లకు ఇప్పించాలని వేడుకొంటున్నా.'

పాస్‌పుస్తకాలు చూపుతున్న చిగురు లస్మవ్వ

తాసిల్దార్ ఆదేశాల మేరకే పెండింగ్‌లో పెట్టాం

లస్మవ్వకు 2.05 ఎకరాల భూమి ఉన్నది వాస్తవమే. తన భూమిని ఆమె మనుమళ్లు, మనుమరాలికి రిజిస్ట్రేషన్ చేసిందీ వాస్తవమే. లక్ష్మి పేరిట ఎకరం ఏవిధంగా పట్టా అయిందో నాకు తెలియదు. నేను ఇటీవలే వీఆర్వోగా వచ్చాను. గతంలో తప్పు జరిగుండొచ్చు. లస్మవ్వ ఫిర్యాదుచేసిన తర్వాత ఆమె మనుమళ్లు రవి, నరేశ్, పద్మకుమారిల పేర్లను ఆన్‌లైన్ నమోదు చేశాను. కానీ సతీశ్ ఫిర్యాదు చేశారని, నమోదుచేయడాన్ని ఆపాలని తాసిల్దార్ ఆదేశిస్తే నిలిపివేశాను. అందుకే ఈ సమస్యను పెండింగ్‌లో ఉంచాం. ఆగస్టు 15 తర్వాత తాసిల్దార్ వారిని పిలిచి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు.

- నర్సింహారెడ్డి, వీఆర్వో, బంధన్‌కల్, ముస్తాబాద్ మండలం

ఏదైనా పొరపాటు జరిగితే ఆర్డీవోకు ఫిర్యాదు చెయ్యొచ్చు

ఈ విషయంలో ఏదైనా పొరపాటు జరిగి ఉంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకోవచ్చు. ఆ భూమిని వారసులందరూ సమానంగా పంచుకోవాలి. లేకపోతే వారేమైన ఒప్పందం చేసుకుంటే దాని ప్రకారం వెళ్లాలి. కుటుంబంలో సమస్య ఉన్నదని ఆపాలని సూచించాను. మరోసారి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.

- యాకన్న, తాసిల్దార్, ముస్తాబాద్

రైతు సమస్యలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారం కోసం 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. ఇందులో ప్రచురితమవుతున్న కథనాలతో రెవెన్యూ అధికారులు స్పందించి.. బాధితులను కార్యాలయానికి పిలిపించుకొని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు. ఏండ్ల కొద్దీ పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు సత్వరమే పరిష్కారం అవుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ రెవెన్యూశాఖలో ప్రక్షాళన చేపట్టడం అభినందనీయం.

- గడుసు శంకర్‌రెడ్డి, మునుకుంట్ల, కట్టంగూర్ మండలం, నల్లగొండ జిల్లా

పీకేఎల్‌లో నేడు

తెలుగు టైటాన్స్ X బెంగళూరు బుల్స్ -7.30గం. | స్టార్ స్పోర్ట్స్‌లో

శ్రీతన్‌కు కాంస్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జమ్ములో జరిగిన జాతీయ అండర్-25 యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ చెస్ క్రీడాకారుడు శ్రీతన్ సాయ్‌పురి కాంస్య పతకంతో మెరిశాడు. మొత్తం ఏడు రౌండ్ల పోరులో ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఫిడే ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 1975 పాయింట్లతో కొనసాగుతున్న 15 ఏండ్ల మాస్టర్ శ్రీతన్ తన కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న ఆటగాళ్లపై విజయాలు సాధించి ఆకట్టుకున్నాడు.

బుధవారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని ఎన్ఎస్ఎల్ సెంట్రల్ మాల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ అకాడమీని ప్రారంభించి సరదాగా ఆడుతున్న రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, సాట్స్ ఎండీ దినకర్ బాబు, రాష్ట్ర టీటీ అసోసియేషన్ కార్యదర్శి ప్రకాశ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూర్పు కుదిరేనా

రాహుల్ — కోహ్లీ

- విండీస్‌తో నేడు తొలి వన్డే
- మార్పులతో టీమ్‌ఇండియా బరిలోకి
- సైనీకి అరంగేట్రం చాన్స్
- మిడిల్‌పైనే అందరి దృష్టంతా

మిడిల్‌ఆర్డర్‌కు సరైన ఆటగాడు దొరుకుతాడా... నాలుగో స్థానంలో రాహుల్ నిలదొక్కుకుంటాడా... ధోనీ లేకుండా ప్రధాన కీపర్‌గా వన్డేల్లో పంత్ ఏ మేరకు రాణించల గలడు... యువ బౌలర్ల సత్తా ఎంత... ఇలా ఎన్నో ప్రశ్నలకు నేటి నుంచి విండీస్‌తో జరిగే వన్డే సిరీస్ సమాధాన మివ్వనున్నది. కరీబియన్ గడ్డపై మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో మిడిల్‌ఆర్డర్‌లో కొత్త ఆటగాడిని ప్రయోగించేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. రాహుల్ నాలుగో స్థానంలో రానుండగా మిడిల్‌లో మనీశ్ లేదా అయ్యర్‌లో ఒకరికి చోటు ఖాయంగా కనిపిస్తున్నది. యువ పేసర్ సైనీ అరంగేట్రం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విండీస్ జట్టులోకి విధ్వంసకర బ్యాట్స్‌మన్ గేల్ రానుండగా... టీ20లో క్లీన్‌స్వీప్‌నకు ప్రతీకారం తీర్చుకోవాలని పట్టుదలగా ఉంది.

గయానా : వెస్టిండీస్‌ను టీ20 సిరీస్‌లో క్లీన్ స్వీప్ చేసిన టీమ్‌ఇండియా వన్డే సమరానికి సన్నద్ధమైంది. ప్రపంచకప్ సెమీస్‌లో ఓటమి తర్వాత పరాయిగడ్డపై 50 ఓవర్ల ఫార్మాట్‌లో సత్తా చాటి ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలనే పట్టుదలతో ఉంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం ఇక్కడి ప్రావిడెన్స్ మైదానంలో విండీస్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. జట్టును వేధిస్తున్న మిడిల్‌ఆర్డర్ సమస్యకు పరిష్కారం కోసం కొత్త ఆటగాళ్లను ప్రయోగించేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. ధోనీ గైర్హాజరీలో ప్రధాన కీపర్‌గా రిషభ్ పంత్ ఏ మేరకు రాణిస్తాడన్నది స్పష్టం కానుంది. యువపేసర్లు సైనీ, ఖలీల్ ప్రతిభకు ఈ సిరీస్ పరీక్ష కానుంది. మరోవైపు టీ20 లాగే వన్డే సిరీస్‌నూ కైవసం చేసుకొని... పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు రోహిత్‌ను కెప్టెన్ చేయాలన్న డిమాండ్ వినిపించకుండా చేయాలని సారథి కోహ్లీ కూడా కృత నిశ్చయంతో ఉన్నాడు. మరోవైపు టీ20 సిరీస్ పరాభవానికి వన్డేల్లో చెలరేగి బదులు తీర్చుకోవాలని విండీస్ ప్రణాళికలు రచిస్తున్నది. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ జట్టులోకి రానుండడం కరీబియన్ జట్టుకు కొండంత బలం కానుంది. అలాగే గేల్ సహా హిట్మైర్, పూరన్, హోప్ లాంటి ఆటగాళ్లతో ఆ జట్టు బలంగా కనిపిస్తున్నది. సొంతగడ్డపై వారిని అడ్డుకోవడం భారత బౌలర్లకు సవాలే. అయితే వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌లో ఉన్న టీమ్ ఇండియాకు..తొమ్మిదో ర్యాంక్ విండీస్ ఏ మేరకు పోటీనిస్తుందనేది ఆసక్తికరం. అలాగనీ సొంతగడ్డపై కరీబియన్లను తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. తమదైన రోజున పరుగుల వరద పారించడంలో వారికి వారే సాటి.

ధవన్ కుదురుకునేనా..!

ప్రపంచకప్‌లో గాయపడి టోర్నీ మధ్యలోనే వైదొలిగిన ధవన్ మళ్లీ 50ఓవర్ల ఫార్మాట్‌లోకి అడుగుపెట్టనున్నాడు. టీ20 సిరీస్ మూడు మ్యాచ్‌ల్లోనూ(1,23,3) తీవ్రంగా నిరాశ పరిచిన శిఖర్.. ఫామ్‌లోకి రావడం జట్టుకు ఎంతో అవసరం. మరో ఓపెనర్ రోహిత్ శర్మ... ప్రపంచకప్‌లో కనబరిచిన భీకర ఫామ్‌ను కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు. కోహ్లీ వన్‌డౌన్‌లో రావడం తథ్యం కాగా... కేఎల్ రాహుల్ మళ్లీ నాలుగో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. విశ్వటోర్నీలో ఆ స్థానంలో కాస్త కుదురుకున్నట్టు కనిపించిన రాహుల్..ధవన్ గాయం కారణంగా మళ్లీ ఓపెనర్‌గానే వచ్చాడు. ఇప్పుడు నాలుగో స్థానంలో నిలదొక్కుకుంటే మాత్రం అతడికి జట్టులో స్థానం పదిలమవుతుంది. టీమ్‌ఇండియాకు ఓ సమస్య తీరుతుంది.

కేదార్‌కు అగ్నిపరీక్ష

మిడిల్‌ఆర్డర్‌లో మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్‌ల్లో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశం ఉంది. టీ20లో మనీశ్ తీవ్రంగా నిరాశపరచడంతో అయ్యర్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక వికెట్ కీపింగ్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌ను పరిస్థితులకు తగ్గట్టు 5 లేదా 6స్థానాల్లో బ్యాటింగ్‌కు పంపవచ్చు. ప్రపంచ కప్‌లో విఫలమైన కేదార్ జాదవ్‌కు సెలక్టర్లు ఈ సిరీస్‌లో మరో అవకాశాన్ని ఇచ్చారు. అయితే ఈ మ్యాచ్‌లో అతడు తుదిజట్టులో ఉండే అవకాశాలు తక్కువ. ఈ సిరీస్‌లో అవకాశమొస్తే కేదార్... బ్యాటింగ్ సహా బౌలింగ్‌లోనూ రాణించాల్సి ఉంటుంది. ఇప్పటికే జట్టులో అతడికి పోటీ పెరిగిపోయింది. సరైన ప్రదర్శన చేయలేకపోతే జాదవ్ వన్డే కెరీరే ప్రమాదంలో పడే అవకాశముంది. పేస్ బౌలింగ్‌లో బలంగా ఉన్న విండీస్‌ను దీటుగా ఎదుర్కోవాలంటే భారత బ్యాటింగ్ దళం సమిష్టిగా రాణించాల్సిందే.

సైనీ అరంగేట్రం.!

బుమ్రా గైర్హాజరీలో బెంచ్‌ను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయాలని టీమ్‌ఇండియా యాజమాన్యం నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు విశ్రాంతినిస్తే పేస్ దళాన్ని షమీ ముందుకు నడిపించనున్నాడు. యువ పేసర్ నవ్‌దీప్ సైనీ ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం ఎక్కువగా ఉంది. టీ20 సిరీస్‌ల్లో అదరగొట్టిన అతడు.. వేగంతో పాటు బౌన్స్‌తో విండీస్ బ్యాట్స్‌మెన్‌కు ఏ మేరకు సవాల్ విసురుతాడో చూడాలి. బౌలింగ్‌లో వైవిధ్యం కారణంగా లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్ కూడా జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ తుది జట్టులో భువనేశ్వర్ ఉంటే సైనీ, ఖలీల్‌లో ఒకరికే చాన్స్ దక్కనుంది. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్ లేదా చాహల్ ఎవరో ఒక్కరు ఆడనున్నారు. బుమ్రా గైర్హాజరీలో చివరి ఓవర్లలో విండీస్ హిట్టర్లను భారత బౌలర్లు ఏ విధంగా కట్టడి చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

జట్ల అంచనా

భారత్: కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, ధవన్, రాహుల్, మనీశ్ పాండే/శ్రేయస్ అయ్యర్/జాదవ్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), జడేజా, భువనేశ్వర్, షమీ, ఖలీల్/ సైనీ, కుల్దీప్ యాదవ్/ చాహల్.

వెస్టిండీస్: హోల్డర్(కెప్టెన్), గేల్, లెవిస్/ క్యాంప్‌బెల్, షాయి హోప్, హిట్‌మెయిర్, పూరన్, రోస్టన్ చేస్, కీమో పాల్, కీమర్ రోచ్, ఒషానే థామస్, కాట్రెల్.

పిచ్, వాతావరణం

ఉదయం చిరుజల్లులు పడే అవకాశముంది. తొలుత బౌలింగ్ చేసే జట్టుకు మంచి చాన్స్. మ్యాచ్ జరిగే కొద్దీ పిచ్ స్లోగా మారుతుంది..అదే సమయంలో లక్ష్యఛేదన కూడా కష్టంగా ఉంటుంది.

రాత్రి 7గం. నుంచి సోనీ టెన్ -1,3 లో

గేల్ వచ్చేశాడు..

కెనడా గ్లోబల్ టీ20 కారణంగా భారత్‌తో పొట్టి ఫార్మాట్ సిరీస్‌కు దూరమైన విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్ వెస్టిండీస్ జట్టులోకి రానున్నాడు. తనకు ఇదే చివరి వన్డే సిరీస్ అని గేల్ గతంలో ప్రకటించడంతో ఎలా ఆడతాడోననే ఉత్కంఠ పెరిగింది. అలాగే వన్డేల్లో విండీస్ తరపున అత్యధిక పరుగుల యోధుడిగా నిలవాలనే అతడి ఆశ కూడా నెరవేరనుంది. ఆ ఘనతకు గేల్ 13 పరుగుల దూరంలో ఉన్నాడు. మరోవైపు సారథి హోల్డర్ కరీబియన్ జట్టును నడిపించనున్నాడు. టీ20 సిరీస్‌లో అద్భుతంగా ఆడిన పొలార్డ్ లేకపోవడం ఆ జట్టుకు లోటే. అయితే గేల్ సహా పూరన్, హిట్‌మైర్, హోప్ రూపంలో ప్రతిభావంతులైన హిట్టర్లతో విండీస్ బ్యాటింగ్ బలంగానే కనిపిస్తున్నది. కాట్రెల్, థామస్‌తో పాటు రోచ్ కూడా రావడంతో బౌలింగ్‌లోనూ భీకరంగా ఉంది.

13 వన్డేల్లో లారా అత్యధిక పరుగుల(10,405) రికార్డును అందుకోవడానికి గేల్‌కు కావాల్సిన పరుగులు

అన్సారీ — అలీ ఖాన్

అన్సారీకి స్వర్ణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆరవ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు బుధవారం పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల క్లే పీజియన్ ట్రాప్ షూటింగ్ ఈవెంటులో కేఎమ్ఏ అన్సారీ 42 పాయింట్లతో పసిడి పతకంతో మెరువగా, సాబిర్ అలీఖాన్(41)కు రజతం, అమితబ(38)కు కాంస్య పతకం దక్కింది. పతక విజేతలకు రాష్ట్ర షూటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ అభినందనలు తెలిపారు.

ఫోర్బ్స్ జాబితాలో సింధు

న్యూయార్క్ : ఎక్కువ సంపాదన ఆర్జిస్తున్న క్రీడాకారిణుల జాబితా ఫోర్బ్స్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారత ప్లేయర్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు నిలిచింది. 5.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.39 కోట్ల12 లక్షలు) వార్షికాదాయంతో ప్రపంచ వ్యాప్తంగా 13వ స్థానంలో ఉంది. అత్యధిక వార్షికాదాయం కలిగి ఉన్న 15 మంది ప్రపంచ క్రీడాకారిణుల జాబితాను ఫోర్బ్స్ బుధవారం వెల్లడించగా... 29.2 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.207కోట్లు)తో అమెరికన్ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో టెన్నిస్ ప్లేయర్ నవోమీ ఒసాకా 24.3 మిలియన్ డాలర్ల(దాదాపు 172కోట్లు)తో ఉంది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచిన సింధు... ఆ ఘనత సాధించిన ఏకైక భారత మహిళా షట్లర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అలాగే 2018లోనూ వరల్డ్ టూర్ టైటిల్ సాధించి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం భారత స్టార్ ప్లేయర్‌గా వెలుగొందుతున్న ఈ తెలుగమ్మాయి... ఈ సీజన్‌లో మాత్రం ఒక్క టైటిల్ గెలవలేదు. ఈ నెలలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాలని ప్రస్తుతం తీవ్రంగా సాధన చేస్తున్నది.

విశ్వటోర్నీ వీడియోలకు 350 కోట్ల వీక్షణలు

ICC CRICKET WORLD CUP ENGLAND & WALES 2019

దుబాయ్ : వన్డే ప్రపంచకప్ అంటే క్రికెట్ అభిమానుల్లో ఎంత క్రేజ్ ఉంటుందో తెలిసిందే. క్రికెట్ ఆడే దేశాలతో పాటు మిగిలిన దేశాల ప్రజలు విశ్వటోర్నీని ఆసక్తిగా చూస్తారు. ఇంటర్నెట్ వినియోగం భారత్ సహా చాలా దేశాల్లో గణనీయంగా పెరిగిన నేపథ్యంలో యూట్యూబ్, ఫేస్‌బుక్, హాట్‌స్టార్, ట్విట్టర్ సహా మరిన్ని మాధ్యమాల ద్వారా ఇంగ్లండ్ వేదికగా ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ వీడియోలను క్రికెట్ ప్రేమికులు అధికంగా చూసేశారు. దీంతో ప్రపంచంలో ఎక్కువ మంది చూసిన విశ్వ క్రీడా ఈవెంట్లలో ఒకటిగా వరల్డ్‌కప్ టోర్నీ నిలిచింది. అధికారిక యూట్యూబ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో అప్‌లోడ్ చేసిన ప్రపంచకప్ వీడియోలకు 350 కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయని ఐసీసీ బుధవారం ప్రకటించింది. యూట్యూబ్ చానెల్‌లో 230 కోట్ల వీక్షణలు ఉండగా, ఫేస్‌బుక్‌లో ఆ సంఖ్య 120 కోట్లుగా ఉంది. ఇక హాట్‌స్టార్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లోనూ ఐసీసీ వీడియోలను అధికంగా వీక్షించారు. ఐసీసీ మొత్తం ప్రపంచకప్‌నకు సంబంధించిన 22 వేల డిజిటల్ కంటెంట్‌ను యూట్యూబ్ సహా మిగిలిన మాధ్యమాల్లో పోస్ట్ చేయగా.. 450 కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయి. స్మిత్‌ను గేలి చేస్తున్న భారత అభిమానులను టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ సముదాయించిన వీడియోను ఐసీసీ పోస్ట్ చేయగా... ట్విట్టర్‌లో ఎక్కువ మంది చూసిన వీడియోగా రికార్డు సృష్టించింది. అలాగే ఓ మ్యాచ్‌కు ఎక్కువ ట్వీట్లు వచ్చిన రికార్డు భారత్-పాక్ సమరానికే దక్కింది. ఆ తర్వాతి స్థానంలో ఫైనల్ నిలిచింది. ప్రపంచకప్ వల్ల అన్ని మాధ్యమాల్లో ఐసీసీకి కొత్తగా దాదాపు కోటిన్నర మంది ఫాలోవర్లు వచ్చి చేరారు.

దేశ క్రికెట్‌ను దేవుడే కాపాడాలి

న్యూఢిల్లీ: పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం చిలికి చిలికి గాలివానలా మారుతున్నది. భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ ఎథిక్స్ అధికారి జస్టిస్ డీకే జైన్ నోటీసులు జారీ చేయడంపై మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశ క్రికెట్‌ను ఇక దేవుడే కాపాడాలంటూ దాదా బుధవారం తనదైన రీతిలో ట్వీట్ చేశాడు. 'భారత క్రికెట్‌లో సరికొత్త ఫ్యాషన్. పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం నిరంతరం వార్తల్లో నిలుస్తున్నది. దేశ క్రికెట్‌ను ఇక దేవుడే కాపాడాలి' అని గంగూలీ ట్వీట్ వదిలాడు. సీనియర్ క్రికెటర్ హర్భజన్‌సింగ్..గంగూలీకి మద్దతుగా నిలుస్తూ ట్విట్టర్‌లో స్పందించాడు. 'అసలు ఇది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ వార్తల్లో నానుతూనే ఉన్నది. భారత క్రికెట్‌లో ద్రవిడ్‌ను మించిన మంచి వ్యక్తి మరొకరు దొరకరు. దిగ్గజాలను అవమానించేందుకు ఇలా నోటీసులు పంపిస్తున్నారు. క్రికెట్‌కు ద్రవిడ్ లాంటి వారి సేవలు ఎంతో అవసరం. దాదా అన్నట్లు క్రికెట్‌ను దేవుడే కాపాడాలి' అని భజ్జీ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) డైరెక్టర్‌గా కొనసాగుతున్న ద్రవిడ్..చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి చెందిన ఇండియా సిమెంట్స్ కంపెనీకి ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. జోడు పదవుల్లో కొనసాగుతూ ద్రవిడ్ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడుతున్నాడంటూ మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు సంజయ్ గుప్తా ఫిర్యాదు చేశాడు. దీంతో బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ డీకే జైన్..రెండు వారాల్లోగా స్పందించాలంటూ ద్రవిడ్‌కు నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

పాట్నా ఓటముల హ్యాట్రిక్

హర్యానా చేతిలో 26-35తో పరాజయం

పాట్నా : ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) ఏడో సీజన్‌లో పాట్నా పైరేట్స్ వరుస ఓటముల పరంపర కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ చేతిలో పాట్నా 26-35 తేడాతో ఓడిపోయింది. సొంతగడ్డపై వరుసగా మూడో పరాజయాన్ని మూటగట్టుకుంది. 14 రైడ్ పాయింట్లతో పాట్నా స్టార్ ప్లేయర్ ప్రదీప్ నర్వాల్ అదరగొట్టినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ ఆటగాళ్లు సమిష్టి పోరాటం చేశారు. ఆ జట్టులో వికాస్ కండోలా(10 రైడ్‌పాయింట్లు), రవి కుమార్(4 ట్యాకిల్ పాయింట్లు) రాణించారు. తొలి పాయింట్ ప్రదీప్ సాధించినా... ఆ తర్వాత పుంజుకున్న హర్యానా ఏ దశలోనూ ఆధిక్యాన్ని చేజార్చుకోలేదు. కండోలా రైడింగ్‌లో రెచ్చిపోతే ట్యాక్లింగ్‌లోనూ స్టీలర్స్ ఆటగాళ్లు రాణించడంతో 8వ నిమిషంలోనే పాట్నా ఆలౌటైపోయింది. అప్పటికి 10-2తో హర్యానా తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి 17-9తో సులువుగానే విజయం సాధిస్తుందనుకున్న స్టీలర్స్‌కు పాట్నా ఆ తర్వాత గట్టిపోటీని ఇచ్చింది. స్టార్ రైడర్ ప్రదీప్ నర్వాల్ విజృంభిండంతో ఓ దశలో 11-23తో వెనుకబడిన పైరేట్స్.. ఏకంగా 26-33కు చేరి ఉత్కంఠ రేపారు. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని నిలుపుకున్న హర్యానా స్టీలర్స్ జట్టు ఎట్టకేలకు 35-26తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. అంతకు ముందు తమిళ్ తలైవాస్, యూపీ యోధా మధ్య పోరు 28-28తో టైగా ముగిసింది.

ప్రదీప్ నర్వాల్ @ 900

పాట్నా పైరేట్స్ స్టార్ రైడర్ ప్రదీప్ నర్వాల్ చరిత్ర సృష్టించాడు. ప్రొ కబడ్డీ లీగ్ చరిత్రలో 900 రైడ్ పాయింట్లు సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ప్రదీప్ ఇప్పటి వరకు 39 సూపర్ రైడ్లు, 45 సూపర్ టెన్‌లు సాధించాడు.

నిఖత్ జరీన్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్‌కు చుక్కెదురైంది. అక్టోబర్ 3 నుంచి 13 వరకు రష్యా వేదికగా జరిగే ప్రతిష్ఠాత్మక మహిళల వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నిఖత్‌కు చోటు దక్కలేదు. ఇటీవలి ప్రదర్శనను పరిగణనలోకి తీసుకున్న సెలెక్టర్లు 51కిలోల కేటగిరీలో నిఖత్‌కు బదులు బాక్సింగ్ క్వీన్ మేరికోంను ఎంపిక చేశారు. ఇండియా ఓపెన్‌తో పాటు ఇటీవలి ప్రెసిడెంట్స్ కప్(ఇండోనేషియా)లో పసిడి పతకాలతో ఆకట్టుకున్న మేరికోంను వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌నకు తీసుకున్నారు. అయితే ట్రయల్స్ నిర్వహించకుండా మేరికోంను ఎంపిక చేయడంపై నిఖత్...భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) సెలెక్షన్ కమిటీ చైర్మన్ రాజేశ్ భండారీకి లేఖ రాసింది. 'ఎలాంటి ట్రయల్స్ నిర్వహించకుండా ఎంపిక చేయడం ఆశ్చర్యంతో పాటు తీవ్ర నిరాశ కల్గించింది. షెడ్యూల్ ప్రకారం వాన్‌లాల్ దువాటితో ట్రయల్స్ బౌట్ ఉండాల్సింది. కానీ హఠాత్తుగా బౌట్‌ను రద్దు చేస్తూ ఇటీవలి ప్రదర్శన, అనుభవాన్ని కారణంగా చూపుతూ మేరికోంను ఎంపిక చేశారు. ఇది ఎంత వరకు కరెక్ట్. 2016లో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన నన్ను .2019 టోర్నీకి ఎంపిక చేయకపోవడానికి కారణమేంటి. మీ ఆధ్వర్యంలో ట్రయల్స్ నిష్పక్షపాతంగా జరగాలి. నిబంధనలు అనేవి అందరికీ సమానం.. అందుకు ఎవరూ అతీతులు కారు. వెంటనే మీరు కలుగజేసుకుని దేశంలో బాక్సర్ల నమ్మకాన్ని నిలబెట్టాలి' అని జరీన్ పేర్కొంది.

శ్రీలంక కోచ్‌పై సస్పెన్షన్

కొలంబో : శ్రీలంక జట్టు ప్రధాన కోచ్ చండిక హతురసింఘను ఆ దేశ క్రికెట్ బోర్డు ఆకస్మికంగా బుధవారం సస్పెండ్ చేసింది. కాగా, స్వదేశంలో న్యూజిలాండ్‌తో ఈనెలలో ప్రారంభమయ్యే సిరీస్ కోసం తాత్కాలిక కోచ్‌గా మాజీ ఫాస్ట్ బౌలర్ రుమేష్ రత్నాయకేని నియమిస్తున్నామని బోర్డు చైర్మన్ షమ్మీ సిల్వ ప్రకటించారు. 'న్యూజిలాండ్ సిరీస్‌లో కోచ్ చండిక పాలు పంచుకోవడం లేదు. ఆయనను ఎందుకు సస్పెండ్ చేసింది చెప్పలేం' అని శ్రీలంక క్రీడా మంత్రి హరిన్ ఫెర్నాండో చెప్పారు.

పంత్‌కు మంచి భవిష్యత్ ఉంది: కోహ్లీ

పావిడెన్స్(గయానా): యువ వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌కు మంచి భవిష్యత్తు ఉందని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. వెస్టిండీస్‌తో తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన పంత్..ఆఖరి టీ20లో అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంత్‌పై ఒత్తిడి పెంచేకంటే అవకాశాలు ఇస్తూపోతే జట్టుకు అతను మరిన్ని విజయాలందించే క్రికెటర్‌గా ఎదుగుతాడని కెప్టెన్ చెప్పుకొచ్చాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లీ మీడియాతో మాట్లాడుతూ 'పంత్‌ను భవిష్యత్తు ఆశాకిరణంగా భావిస్తున్నాం. అతనిలో అద్భుత ప్రతిభ దాగుంది. విఫలమైనా పంత్‌కు అవకాశాలు ఇస్తే మ్యాచ్‌ను ముగించే అత్యుత్తమ ఫినిషర్‌గా ఎదుగుతాడు. అతను ఇప్పుడిప్పుడే క్రికెట్‌లో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒత్తిడిని ఎదుర్కొవడం భిన్నంగా ఉంటుంది. పంత్ నిలకడగా రాణిస్తే..భారత్‌కు మరో అత్యుత్తమ క్రికెటర్ దొరికినట్లే' అని కోహ్లీ అన్నాడు.

బుధవారం భువనేశ్వర్‌లో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ఫణి తుఫాన్ ఆర్థిక సహాయం కింద రూ.31 లక్షల చెక్కును అందజేస్తున్న భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ) చీఫ్ నరిందర్ బాత్రా, హాకీ ఇండియా(హెచ్ఐ) అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్

సెన్సెక్స్	నిఫ్టీ
36,690	10,855
↘ 286	↘ 93

ముడి చమురు (బ్రెంట్) ↘ 56.25 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	37,920
22 క్యారెట్లు	37,750
వెండి (కిలో)	43,670

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.70	73.20
యూరో	75.70	82.20
బహ్రెయిన్ దినార్	177.00	191.00
కువైట్ దినార్	223.00	235.00
సౌదీ రియాల్	17.60	19.40
యూఏఈ దిర్హామ్	18.20	19.90

ఈ ఏడాది తనిష్క్ 54 స్టోర్లు

హైదరాబాద్, ఆగస్టు 7: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశవ్యాప్తంగా మరో 54 స్టోర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు టాటా గ్రూపునకు చెందిన ఆభరణాల విక్రయ సంస్థ తనిష్క్ ప్రకటించింది. దీంతో కంపెనీ రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్య 300 నుంచి 350కిపైగా చేరుకోనున్నాయని టైటాన్ కంపెనీ ఎండీ భాస్కర్ భట్ తెలిపారు. హైదరాబాద్‌లో తనిష్క్ ఏర్పాటు చేసిన 300 రిటైల్ అవుట్‌లెట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు.

వృద్ధి కోసం మరోసారి

రెపో, రివర్స్ రెపోలపై 0.35% కోత ■ గృహ, వాహన రుణాలు చౌకయ్యే అవకాశం

- వరుసగా నాలుగోసారి కీలక వడ్డీరేట్లను దించిన ఆర్బీఐ
- ఈ ఏడాది 110 బేసిస్ పాయింట్లు తగ్గుదల
- 15 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్

ముంబై, ఆగస్టు 7:

కీలక వడ్డీరేట్లను మరోసారి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తగ్గించింది. వరుస కోతలతో ఊపు మీదున్న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈసారి దూకుడును పెంచి 35 బేసిస్ పాయింట్లు (0.35 శాతం) దించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష ఫలితాన్ని బుధవారం ఆర్బీఐ ప్రకటించింది. ఈ సందర్భంగా అంచనాలకు మించి రెపో, రివర్స్ రెపో రేట్లను తగ్గించడం విశేషం. ఈసారి కూడా 25 బేసిస్ పాయింట్లే (0.25 శాతం) తగ్గించవచ్చన్న అంచనాలు వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, రేటింగ్ ఏజెన్సీల నుంచి వచ్చాయి. అయితే 35 బేసిస్ పాయింట్లను తగ్గించి దాస్ అందరినీ ఆకట్టుకున్నారు. గడిచిన 13 ఏండ్లలో ఇలా 35 బేసిస్ పాయింట్లు తగ్గించడం ఇదే ప్రథమం. మరోవైపు ఆర్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో గృహ, వాహన రుణాలు చౌక కానున్నాయి. ఈఎంఐల భారం తగ్గే అవకాశాలున్నాయి. ఆటో రంగ అమ్మకాలు నెలనెలా పడిపోతున్న నేపథ్యంలో, నిర్మాణ రంగం కొనుగోళ్లు లేక అల్లాడిపోతున్న తరుణంలో ఈ వడ్డీరేట్ల కోతను దేశ ఆర్థిక వ్యవస్థకు అందిన ఆక్సిజన్‌గానే యావత్ పరిశ్రమ భావిస్తున్నది. ఇక నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని 4 శాతం వద్దే యథాతథంగా ఉంచిన ఆర్బీఐ.. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు లేదా బ్యాంక్ రేటును 5.65 శాతంగా పెట్టింది. గతేడాది ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి మందగిస్తున్న వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న దాస్.. అందుకు అనుగుణంగానే రెపో, రివర్స్ రెపోలను తగ్గిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా నాలుగు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలు జరుగగా, రెపో, రివర్స్ రెపో రేట్లు 110 బేసిస్ పాయింట్లు దిగాయి. ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ సమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గిన కీలక వడ్డీరేట్లు.. తాజాగా మరో 35 బేసిస్ పాయింట్లు తగ్గాయి. దీంతో తొమ్మిదేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ రెపో రేటు (బ్యాంకులకు ఇచ్చే రుణాలపై ఆర్బీఐ వసూలు చేసే వడ్డీరేటు) 5.40 శాతానికి దిగొచ్చింది. 2010 ఏప్రిల్ తర్వాత ఈ స్థాయికి రావడం ఇదే తొలిసారి. అలాగే రివర్స్ రెపో రేటూ (వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై ఆర్బీఐ చెల్లించే వడ్డీరేటు) 5.15 శాతానికి పరిమితమైంది. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) 4:2 ఓటుతో 0.35 శాతానికి జై కొట్టింది. నలుగురు సభ్యులు 35 బేసిస్ పాయింట్లకు, ఇద్దరు 25 బేసిస్ పాయింట్లకు ఓటేశారు. జీడీపీ ఆందోళనకరంగా ఉందని అంగీకరించిన దాస్.. దానికి మందేసి నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నట్లు ద్రవ్యసమీక్ష అనంతరం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. కాగా, గతంలో ఇలా వరుసగా నాలుగుసార్లు వడ్డీరేట్లు తగ్గిన సందర్భం 2012 ఏప్రిల్ నుంచి 2013 మే మధ్య జరిగింది. నాడు 125 బేసిస్ పాయింట్లు తగ్గగా, ఏప్రిల్ 17న గరిష్ఠంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టారు. ఆ తర్వాత జనవరి 29, మార్చి 19, మే 3న జరిగిన సమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున కట్ చేశారు. దీంతో 8.50 శాతం నుంచి 7.25 శాతానికి రెపో రేటు దిగివచ్చింది. ఆ సమయంలో ఎంపీసీ లేకుండగా, ఆర్బీఐనే వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకునేది. కాగా, అన్ని పున రావృత బిల్లు చెల్లింపులను భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బీబీపీఎస్) కిందకు తెస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. అలాగే మోసాలను అరికట్టేందుకు సెంట్రల్ పేమెంట్స్ ఫ్రాడ్ ఇన్ఫర్మేషన్ రిజిస్ట్రీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి ద్రవ్యసమీక్ష ఈ ఏడాది అక్టోబర్ 4న జరుగనున్నది.

ఎస్బీఐ వడ్డీరేటు తగ్గింపు SBI

రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన కొద్ది గంటల్లోనే బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) వడ్డీరేట్లను 15 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తగ్గించిన రేట్లు ఈ నెల 10 నుంచి అమలులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.40 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గనున్నది. వీటితో పాటు గృహ రుణాలను రెపోకు అనుసంధానం చేయడంతో ఇవి కూడా మరింత తగ్గనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇలా బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడం ఇది నాలుగోసారి. ఏప్రిల్ 10 నుంచి ఇప్పటి వరకు గృహ రుణాలపై వడ్డీరేటు 35 బేసిస్ పాయింట్లు కోత విధించినట్లు అయింది.

ఎన్‌బీఎఫ్‌సీలను ఆదుకుంటాం

ఆర్థిక ఇబ్బందులో ఉన్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లను ఆదుకుంటామని, అవి కుప్పకూలకుండా చూస్తామని ఈ సందర్భంగా ఆర్బీఐ భరోసా కల్పించింది. ప్రస్తుతం చాలా ఎన్‌బీఎఫ్‌సీలు, కొన్ని హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రుణ భారం భరించలేక, మొండిగా మారిన బకాయిలు వసూలవ్వక ఇబ్బందులు పడుతున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలుసహా 50 ఎన్‌బీఎఫ్‌సీలను గుర్తించిన ఆర్బీఐ వాటికి ఆర్థిక దన్ను లభించేలా చర్యలు చేపడుతున్నది. అదే విషయాన్ని ద్రవ్యసమీక్ష సందర్భంగా దాస్ తెలియజేశారు. నిజంగా ఆర్థిక సమస్యల్లో ఉన్న సంస్థలకు బ్యాంకుల నుంచి కొత్త రుణాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు.

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో డిప్యూటీ గవర్నర్లు

35 బేసిస్ పాయింట్ల కోత సరైనదే

35 బేసిస్ పాయింట్ల కోత సరైనదేనని దాస్ ఈ సందర్భంగా తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి గమనిస్తే గత మూడు ద్రవ్యసమీక్షల్లో పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) చొప్పున వడ్డీరేట్లను తగ్గించామని గుర్తుచేసిన ఆయన ఇవి సరిపోలేదని, ఈసారి అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గిద్దామనుకుంటే అది చాలా ఎక్కువగా కనిపించిందని చెప్పారు. ఈ క్రమంలోనే 35 బేసిస్ పాయింట్లకు మొగ్గినట్లు వివరించారు. నిజానికి 2006 నుంచి వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు లేదా 50 బేసిస్ పాయింట్ల చొప్పునే ఆర్బీఐ సవరిస్తూ వస్తున్నది. అయితే ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ విపత్కర పరిణామాలు, దేశీయ ప్రతికూల గణాంకాల దృష్ట్యా పావు శాతం తగ్గింపు సరిపోదనే 0.35 శాతానికి ఓటేశామని పేర్కొన్నారు. అలాగే ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా, నేటి పరిస్థితుల ఆధారంగా ఇది ఎంపీసీ తీసుకున్న స్వతంత్ర నిర్ణయమని స్పష్టం చేశారు.

బ్యాంకులు తగ్గించింది 29 బేసిస్ పాయింట్లే

రుణాలపై వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో బ్యాంకుల తీరుపట్ల దాస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా తాము కీలక వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే.. బ్యాంకర్లు మాత్రం 29 బేసిస్ పాయింట్లే తగ్గించారన్నారు. చౌక రుణాలు కొత్త పెట్టుబడులకు దోహదం చేస్తాయని, అన్ని రంగాలకు నగదు లభ్యత పెరిగి వృద్ధిరేటు పుంజుకుంటుందని చెప్పారు. అయితే బ్యాంకులు మాత్రం తాము అందిస్తున్న ప్రయోజనాలను ఖాతాదారులకు చేర్చడం లేదని పెదవి విరిచారు.

నెఫ్ట్ సేవలు నిరంతరం

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి ఆర్బీఐ గవర్నర్ దాస్ మరో ముందడుగు వేశారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) సేవలను నిరంతరం చేస్తామన్నారు. 24 గంటలూ నెఫ్ట్ సేవలు పనిచేస్తాయని, రాత్రి-పగలు అని తేడా లేకుండా ఎప్పుడైనా నెఫ్ట్ లావాదేవీలు జరుపుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్యాంక్ ఖాతాదారులకు అన్ని పని దినాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకే నెఫ్ట్ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. రిటైల్ పేమెంట్ సిస్టమ్‌గా ఆర్బీఐ ఈ నెఫ్ట్ సేవలను నిర్వహిస్తుండగా, రూ.2 లక్షల వరకు నగదు బదిలీలకు దీన్ని వినియోగిస్తున్నారు. గత ద్రవ్యసమీక్షలో నెఫ్ట్‌తోపాటు ఆర్టీజీఎస్ ద్వారా జరిగే లావాదేవీలపై ఆర్బీఐ చార్జీలను ఎత్తివేసినది తెలిసిందే.

ఈసారి వృద్ధిరేటు 6.9 శాతమే

దేశ ఆర్థిక వ్యవస్థకు అన్ని వైపులా ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల మధ్య ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) జీడీపీ అంచనాల్ని ఆర్బీఐ కుదించింది. ఇంతకు ముందు వేసిన 7 శాతం అంచనాను 6.9 శాతానికి తగ్గించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ సామర్థ్యం తగ్గిందని, నగరాల్లో ప్యాసింజర్ కార్లు, గ్రామాల్లో టూవీలర్లు, ట్రాక్టర్ల కొనుగోళ్లు పడిపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నదని గవర్నర్ దాస్ అన్నారు. జూలైలో ఆటో అమ్మకాలు 20 ఏండ్ల కనిష్ఠాన్ని తాకిన విషయం తెలిసిందే. జూన్‌లో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 57 నెలల కనిష్ఠానికి దిగజారిన సంగతీ విదితమే. ఈ క్రమంలో దాస్ జీడీపీ అంచనాల్ని తగ్గించగా, ఎల్‌అండ్‌టీ, బజాజ్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి దిగ్గజ సంస్థల అధిపతులు వృద్ధిరేటుపై వ్యక్తం చేసిన ఆందోళనల్ని ఇది ప్రతిబింబించింది. అయినప్పటికీ వృద్ధిరేటు తిరిగి పుంజుకోగలదన్న ఆశాభావాన్ని కనబరుస్తూ చివరి త్రైమాసికం (వచ్చే ఏడాది జనవరి-మార్చి)లో జీడీపీ 7.5 శాతంగా నమోదు కాగలదన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. 2025 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు ముందుకెళ్తుండగా, ఇందుకు వార్షిక వృద్ధిరేటు 8-9 శాతంగా నమోదు కావాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ వృద్ధిరేటు అంచనాల్ని తగ్గించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇప్పటికే దాదాపు ఐదేండ్ల కనిష్ఠానికి జీడీపీ క్షీణించింది.

ఎవరేమన్నారు..

'ఈసారి వడ్డీరేట్ల కోత మార్కెట్లకు ఊహించని ప్రోత్సాహకం. నిరంతర నెఫ్ట్ సేవలు నగదు రహిత లావాదేవీలను పెంచుతాయి'

-రజ్నీశ్ కుమార్, ఎస్బీఐ చైర్మన్

'వడ్డీరేట్ల కోతల్లో మళ్లీ కొత్త శకానికి ఆర్బీఐ నాందీ పలికింది. ఇది ఊహించని తగ్గింపే'

-శుభద రావు, యెస్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త

'బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాలి. అప్పుడే ఆర్బీఐ ఆశయం నెరవేరుతుంది. వడ్డీరేట్ల కోతల ప్రయోజనాలు ఖాతాదారులకు అందుతాయి'

-సందీప్ సోమని, ఫిక్కీ అధ్యక్షుడు

'కీలక వడ్డీరేట్ల తగ్గింపు మార్కెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. వినియోగదారుల కొనుగోళ్ల శక్తిని పెంచుతుంది'

-రాజీవ్ తల్వార్, పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు

'ఎగుమతిదారులకు సులభంగా రుణాలు అందేలా ఆర్బీఐ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగాన్ని ఆదుకోవాలి'

-రవీ సెహెగల్, ఈఈపీసీ ఇండియా చైర్మన్

'ఆర్బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తేనే ఆర్బీఐ వడ్డీరేట్ల కోత ప్రయోజనాలు కస్టమర్లకు అందుతాయి'

-సతీష్ మగర్, క్రెడాయ్ అధ్యక్షుడు

అదుపులోనే ద్రవ్యోల్బణం

వచ్చే ఏడాది వరకు ద్రవ్యోల్బణం అంచనా వేసిన స్థాయిలోనే ఉంటుందన్న ఆశాభావాన్ని రిజర్వు బ్యాంక్ వ్యక్తం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో ద్రవ్యోల్బణం 3.5-3.7 శాతం మధ్యలో ఉండనున్నదని పేర్కొంది. అలాగే రెండో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.1 శాతం స్థాయిలో నమోదు కావచ్చన్నది. వచ్చే ఏడాది తొలి త్రైమాసికానికిగాను ద్రవ్యోల్బణం 3.6 శాతంగా ఉండనున్నదని పేర్కొంది. జూన్‌లో తన పరపతి సమీక్షను ప్రకటించినప్పుడు రిటైల్ ద్రవ్యోల్బణం 3.4-3.7 శాతం మధ్యలో ఉండనున్నదని అంచనా వేసిన విషయం తెలిసిందే.

రాష్ట్రంలో కటేరా ప్లాంట్

- రూ.700 కోట్లతో ఏర్పాటు
- 8 వేల మందికి ఉపాధి

రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, కటేరా ప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు 7: రాష్ట్రంలో మరో అంతర్జాతీయ సంస్థ అడుగుపెట్టబోతున్నది. సిలికాన్ వ్యాలీకి చెందిన డిజైనింగ్, టెక్నాలజీ సేవల సంస్థయైన కటేరా..హైదరాబాద్‌లో తన ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నది. భాగ్యనగరానికి అత్యంత సమీపంలో రూ.700 కోట్ల పెట్టుబడితోఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ వచ్చే ఏడాది మార్చి నాటికి సిద్ధం కానున్నది. బిల్డింగ్ కంపొనెంట్, ఇతర విడిభాగాల తయారీ యూనిట్‌కు కంపెనీ ఆసియా, మధ్య తూర్పు ప్రెసిడెంట్ ఆశ్ భరద్వాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ బిల్డింగ్ కంపొనెంట్‌లో రోబోటిక్ అసెంబ్లింగ్ లైన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే బెంగళూరులో ఏర్పాటు చేసిన ప్లాంట్‌తోపాటు హైదరాబాద్ యూనిట్ ద్వారా దక్షిణాదికి చెందిన వినియోగదారులకు కంపెనీ ఉత్పత్తులను సరఫరా చేయడానికి వీలు పడనున్నదన్నారు. రెసిడెన్షియల్, ఆఫీస్ బిల్డింగులు, హోటళ్లు, మాల్స్, హాస్పిటల్స్, స్కూళ్లు, ఇండస్ట్రీయల్ పార్క్‌లను అంతర్జాతీయ టెక్నాలజీ ద్వారా నిర్మాణాలు చేపట్టడానికి ఈ యూనిట్ ఎంతో దోహదం చేయనున్నదన్నారు. ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా ఏడు వేల మందికి ఉపాధి లభించనున్నదన్నారు. ఇప్పటికే భారత్‌లో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రూ.3 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు.

రికార్డు స్థాయికి పసిడి

- ఒకేరోజు రూ.1,113 పెరిగిన తులం
- రూ.37,920కి చేరిన బంగారం ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 7: దేశీయ మార్కెట్లో బంగారం ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయంగా ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో పసిడి ధర రికార్డు స్థాయి పలికింది. దేశరాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర బుధవారం ఒకేరోజు రూ.1,113 పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.37,920కి చేరుకున్నది. అమెరికా, చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధమేఘాలతో పెట్టుబడిదారుల్లో ఆందోళన మరింత తీవ్రతరమైంది. దీంతో తమ పెట్టుబడులు సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ఒక్కసారిగా ధరలు పుంజుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతోపాటు వెండి మరింత వెలుగులు జిమ్మింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి ధర రూ.650 అధికమై రూ.43,670కి చేరుకున్నది. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధర రూ.36,650కి చేరుకోగా, వెండి రూ. 42,900గా నమోదైంది. ఇంటర్నేషనల్ స్పాట్ గోల్డ్ మార్కెట్లో బులియన్ ధరలు రికార్డు స్థాయి 1,490 డాలర్లకు చేరుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఒక్కసారిగా ధరలు భగ్గుమన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ డైరెక్టర్ తపన్ పటేల్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను అతి విలువైన లోహాలవైపు మళ్లించడం కూడా ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు. చైనా కరెన్సీ మాయజాలం చేసిందని అమెరికా ఆరోపణల నేపథ్యంలో చైనా..అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న వ్యవసాయ ఉత్పత్తులపై నిషేధం విధించడం కూడా ఆందోళనను పెంచింది. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,487.20 డాలర్లు పలుకగా, వెండి 16.81 డాలర్ల వద్ద ముగిసింది. ఈ ఏడాది చివరినాటికి బంగారం ధర రూ.40 వేల మార్క్‌కి చేరుకునే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు వెల్లడించారు.

హెచ్‌సీఎల్ టెక్ లాభంలో క్షీణత

- క్యూ1లో 8 శాతం తగ్గిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అతిపెద్ద ఐటీ సంస్థల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ రూ.2,230 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.2,431 కోట్లతో లాభంతో పోలిస్తే 8.2 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.3 శాతం పెరిగి రూ.16,427 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అంతకుముందు ఇది రూ.13,878 కోట్లుగా ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయంలో వృద్ధి 14-16 శాతం మధ్యలో ఉండనున్నదని అంచనావేస్తున్నది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించినట్లు, ఆదాయంలో 4.2 శాతం పెరుగగా, కరెన్సీ రూపంలో 17 శాతం ఎదుగుదల కనిపించిందని హెచ్‌సీఎల్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈవో విజయకుమార్ తెలిపారు. డాలర్ రూపంలో కంపెనీ నికర లాభం 10.1 శాతం తగ్గి 319.7 మిలియన్ డాలర్లకు పడిపోగా, ఆదాయం మాత్రం 15 శాతం అధికమై 2.36 బిలియన్ డాలర్లుగా ఉన్నది. మరోవైపు, ప్రతి షేరుకు రూ.2 డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది. గత త్రైమాసికంలో నికరంగా 16,332 మంది సిబ్బంది చేరగా, వీరిలో నికరంగా 5,935 చేరినట్లు అయింది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,43.900కి చేరుకున్నారు.

మహీంద్రా లాభాలకు అమ్మకాల సెగ

- తొలి త్రైమాసిక లాభంలో 52 శాతం క్షీణత

ముంబై, ఆగస్టు 7: కమర్షియల్ వాహన తయారీలో అగ్రగామి సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ఆర్థిక ఫలితాలకు అమ్మకాల సెగ గట్టిగానే తగిలింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 52.56 శాతం క్షీణించి రూ.894.11 కోట్లకు పరిమితమైంది. 2018-19 ఏడాది ఇదే సమయానికిగాను సంస్థ రూ.1,884.66 కోట్ల లాభాన్ని గడించింది. సమీకాలంలో కంపెనీ ఆదాయం రూ.26,260. 64 కోట్ల నుంచి రూ. 26,289. 64 కోట్లకు మాత్రమే పెరిగింది. మొత్తంగా 1,23,690 యూనిట్ల వాహనాలను విక్రయించింది. గతేడాది విక్రయించిన 1,30,484లతో పోలిస్తే 5 శాతం తగ్గింది. అలాగే ట్రాక్టర్ల అమ్మకాలు 15 శాతం పతనం చెంది 82,013లకు పడిపోగా, ఎగుమతులు కూడా 12,730ల నుంచి 10,923లకు పడిపోయాయి. ఆర్థిక రంగంలో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా వాహన విక్రయాలు పడిపోయాయని, ఇది భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉన్నదని అవుట్‌లుక్‌లో కంపెనీ పేర్కొంది.

అరబిందో లాభం రూ.636 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 7: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ అరబిందో ఫార్మా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను సంస్థ రూ.635.68 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.455.59 కోట్లతో పోలిస్తే 39.52 శాతం అధికం. అమెరికా, యూరప్ దేశాల్లో కంపెనీకి చెందిన ఔషధాలకు డిమాండ్ ఉండటం లాభాల్లో భారీ వృద్ధికి కలిసొచ్చింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.5,444.60 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ ఎన్ గోవిందరాజన్ మాట్లాడుతూ..ఈ ఏడాది తొలి త్రైమాసికం లాభాలతో ప్రారంభించినట్లు, నాణ్యత మందులు అందించడంలో వెనక్కి తగ్గేది లేదని, రెగ్యులేటరీ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు చెప్పారు. గత త్రైమాసికంలోనే యుగియా తయారీ ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందని, వీటితోపాటు అమెరికా మార్కెట్లోకి ఐదు ఆంకాలజీ ఔషధాలను విడుదల చేసినట్లు తెలిపారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో అమెరికాలో ఫార్ములేషన్ విక్రయించడం ద్వారా రూ.2,688.40 కోట్లు సమకూరగా, యూరప్ నుంచి రూ.1,391 కోట్లు లభించాయి.

హైదరాబాద్‌లో 'నోబ్రోకర్.కామ్'

హైదరాబాద్, ఆగస్టు 7: బ్రోకర్ అవసరం లేకుండా ఇళ్లు, కార్యాలయాలను అద్దెకు తీసుకోవచ్చును. ప్రపంచంలో అతిపెద్ద రియల్ ఎస్టేట్ పోర్టల్ 'నోబ్రోకర్.కామ్' హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్ సౌరభ్ గార్గ్ మాట్లాడుతూ..భాగ్యనగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీకి సంబంధించి అద్దె, కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి సేవలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇక్కడి మార్కెట్లోకి ప్రవేశించినట్లు, ఇప్పటికే 18 వేల కస్టమర్లు రిజిస్టార్ అయ్యారని చెప్పారు. వినియోగదారులకు ఉచితంగా సేవలు అందించడం జరుగుతున్నదని, తొమ్మిది ప్రాజెక్టుల తర్వాల స్వల్పంగా చార్జీ విధించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ముంబై, బెంగళూరు, పుణె, చెన్నై, గుర్‌గ్రామ్‌లలో ఇలాంటి సేవలు అందిస్తున్న సంస్థ..వచ్చే కొన్ని నెలల్లో ఢిల్లీ మార్కెట్లోకి ప్రవేశించబోతున్నది.

చుట్టుముట్టిన వృద్ధి భయాలు

286 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్

ముంబై, ఆగస్టు 7: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధి అంచనాను తగ్గిస్తూ రిజర్వు బ్యాంక్ ప్రకటన స్టాక్ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టించింది. వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంచేయడం మదుపరుల్లో ఆందోళనను రేకెత్తించింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఆర్బీఐ సమీక్ష ప్రకటించగానే నష్టాల్లోకి జారుకున్నది. ఒక

బ్యాంకులో ప్రసవం!

తల్లీబిడ్డ క్షేమం.. మేడ్చల్ జిల్లా డబిల్‌పూర్‌లో ఘటన

మేడ్చల్ రూరల్: ఓ నిండు గర్భిణి బ్యాంక్ ఆవరణలో ప్రసవించిన సంఘటన మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో బుధవారం జరిగింది. నొప్పులతో బాధపడుతున్న ఆమెకు స్థానికులు, బ్యాంకుకు వచ్చిన మహిళలు సహాయపడ్డారు. శ్రీరంగవరం గ్రామానికి చెందిన కుమ్మరి కవిత నిండు గర్భిణి, డబ్బులు డ్రాచేయడానికి మామ కుమ్మరి లక్ష్మయ్యతో కలిసి డబిల్‌పూర్ ఎస్బీఐ శాఖకు వచ్చింది. క్యూలో నిలిచిన ఆమెకు ఒక్కసారిగా పురిటినొప్పులు ఎక్కువ కావడంతో భరించలేకపోయింది. ఆమె పరిస్థితిని గుర్తించిన బ్యాంకుకు వచ్చిన మహిళలు, సిబ్బంది సహాయపడ్డారు. కవిత నాలుగో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేయగా సిబ్బంది ప్రథమ చికిత్సచేసి శ్రీరంగవరం పీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

మేడ్చల్ మండల డబిల్‌పూర్ ఎస్బీఐ శాఖలో మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి కుమ్మరి కవిత, పుట్టిన బిడ్డ

క్రికెట్ బెట్టింగ్ వేధింపులకు డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

వెంగళరావునగర్: క్రికెట్ బెట్టింగ్ ఉచ్చులో చిక్కిన ఓ డిగ్రీ విద్యార్థి నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లికి చెందిన వీ విష్ణుమూర్తి.. భార్య వినోద, కుమార్తె, కుమారుడు రవికుమార్ (21)తో కలిసి పాతికేండ్ల కిందట నగరానికి వచ్చి బోరబండ సమీప హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-1లో ఉంటున్నారు. రవికుమార్ కూకట్‌పల్లిలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో బీస్సీ ఫైనలీయర్ చదువుతున్నాడు. విద్యార్థులే లక్ష్యంగా ఇదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నాడు. రవికుమార్ ఇతని వలలో చిక్కి రూ.40 వేలవరకు బెట్టింగ్ డబ్బు బాకీ పడ్డాడు. ఒత్తిడి తేవడంతో తండ్రికి అబద్ధం చెప్పి డబ్బు అడిగాడు. విష్ణు స్వగ్రామంలో పొలం అమ్మి రూ. 40వేలను కుమారుడికి ఇచ్చాడు. అయినా మరో 40 వేలు బాకీ ఉన్నావని రాజశేఖర్ బెదిరించాడు. వేధింపులను తట్టుకోలేక ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని రవికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి.

రవికుమార్

భద్రత విధుల్లోకి బుజ్జి జాగిలాలు

- సీఐఎస్ఎఫ్‌కు మూడు జర్మన్ షెఫర్డ్‌లు
- బహుమతిగా అందజేసిన ఐజీ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రత విధుల్లోకి మరో మూడు బుజ్జి జాగిలాలు చేరనున్నాయి. తన జర్మన్ షెఫర్డ్ జాగిలాలకు పుట్టిన మూడు పిల్లలను విమానాశ్రయంలో భద్రత విధులు నిర్వర్తించే సీఐఎస్ఎఫ్ కెనైన్ స్క్వాడ్‌కు ఐజీ సీవీ ఆనంద్ బహుమతిగా అందించారు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో విమానాశ్రయం చీఫ్ ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఆఫీసర్ సచిన్‌బాద్వా, జీఎంఆర్ సెక్యూరిటీ చీఫ్ భరత్‌కందార్‌కు మూడు కుక్కపిల్లలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఏఎస్‌జి డీఐజీ పీ సెల్వన్, వెస్ట్‌జోన్ డీఐజీ రవింద్రకుమార్, కమాండెంట్ సుధీర్ కుమార్, ఇతర భద్రతాధికారులు పాల్గొన్నారు. వీటిని మొయినాబాద్‌లోని తెలంగాణ డాగ్ స్క్వాడ్ ట్రైనింగ్ స్కూల్‌లో తొమ్మిది నెలల శిక్షణకు పంపనున్నారు. విమానాశ్రయంలో అనుమానాస్పద వస్తువుల వాసనను పసిగట్టి బాంబులు, డ్రగ్స్ వంటి నిషేధిత వస్తువుల ఆచూకీ కనిపెట్టడంలో డాగ్ స్క్వాడ్ కీలక పాత్ర పోషిస్తుంది.

చెన్నై నుంచి నెహ్రూ జూకు తరలించిన నీటిగుర్రం, సింహం తోక కలిగిన కోతి

జూపార్కుకు కొత్త జంతువులు

చార్మినార్: జంతుమార్పిడిలో భాగంగా చెన్నై వండలూరు జూ నుంచి కొత్త జంతువులను హైదరాబాద్ జూ పార్క్‌కు తీసుకొచ్చామని నెహ్రూ జూలాజికల్ పార్క్ డైరెక్టర్ క్షితిజా చెప్పారు. గతవారం నెహ్రూ జూ నుంచి జత ఖడ్గమృగాలను వండలూరు జూకు తరలించామని తెలిపారు. అక్కడినుంచి కేంద్ర జూ అథారిటీ ఆదేశాల మేరకు రెండు నీటిగుర్రాలు, రెండు నీల్‌గిరి లాంగర్లు, జత తోడేల్లు, సింహంతోక కలిగిన ఆడకోతిని నగర జూకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామున జూకు చేరుకున్న ఈ జంతువులు కొన్నిరోజులపాటు ప్రత్యేక వైద్యబృందం పర్యవేక్షణలో ఉంటాయని, అనంతరం ప్రజల సందర్శనార్థం ఎన్‌క్లోజర్లలోకి తరలిస్తామని తెలిపారు. ప్రస్తుతం వాటి ఆరోగ్యం మెరుగ్గా ఉన్నదని అన్నారు.

నో టెన్షన్.. సెల్ఫీతో పెన్షన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'పదవీ విరమణ పొందాక పింఛన్ కోసం ఏ ఒక్క ఉద్యోగి ఇబ్బంది పడొద్దు. ఉద్యోగం నుంచి వదిలిపోయే రోజే పింఛన్ మంజూరు చేసి.. రావాల్సిన పైసలన్నీ ఇవ్వాలి' అని ఉద్యోగులతో సమావేశమైన సందర్భంలో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలను.. ఆచరణలో పెట్టారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రత్యేక యాప్‌ను రూపొందించి సరికొత్త విధానానికి నాంది పలికారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారికి మొబైల్ ఫోన్‌లోనే సెల్ఫీతో పెన్షన్ అందించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. టీ యాప్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని పెన్షన్ నంబర్‌తోపాటు సెల్ఫీ దిగి అప్లోడ్ చేస్తే చాలు.. అధికారులు మూడువిడుతల్లో ధ్రువీకరించుకుని పెన్షన్ మంజూరు చేయనున్నారు. దీంతో ప్రతిసారి లైవ్ సర్టిఫికెట్‌ను కార్యాలయానికి వెళ్లి సమర్పించే పద్ధతికి బ్రేక్ పడింది. అనారోగ్యంతో ఉండే పెన్షన్‌దారులు లైవ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు పడుతున్న కష్టాలకు చెక్‌పెట్టారు. యాప్‌లోకి వెళ్లి పెన్షన్ రిజిస్ట్రేషన్ అని ఆప్షన్‌లోకి వెళ్లి బ్యాంక్, పెన్షన్ నంబర్లు నమోదు చేయాలి. ఆ తర్వాత ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత పెన్షన్‌దారుడి పేరు, తండ్రి పేరును నమోదు చేయాలి. అనంతరం పెన్షన్ నెంబర్‌ను ఎంటర్ చేసి, సెల్ఫీ దిగి దరఖాస్తు చేసుకోవాలి. ఇవన్నీ సరిపోయిన తర్వాత ఈ యాప్ ద్వారానే పూర్తిగా సమాచారాన్ని పరిశీలించి సంబంధితశాఖ నుంచి అనుమతివ్వాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు టీ యాప్ ద్వారా పెన్షన్ అనుమతి చేసిన తర్వాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు అప్రూవ్ మెసేజ్ వస్తుంది. ఒకవేళ వేరే వాళ్ల ఫొటోను అప్‌లోడ్ చేస్తే ఎట్టి పరిస్థితిల్లోనూ అప్రూవ్ కాదు. పాత ఫొటోను సెల్ఫీ తీసి, అప్‌లోడ్ చేస్తే కూడా అప్రూవ్ కాదు. లైవ్ ఫొటోను మాత్రమే సెల్ఫీ తీసి నమోదు చేయాలి. ఇలా టీ యాప్ ద్వారా అప్రూవ్ చేసిన తర్వాత సదరు దరఖాస్తుదారుడు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది.

యాప్ ద్వారా పింఛన్‌పై ఉద్యోగుల హర్షం

ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్న టీ యాప్ ద్వారా చాలా మేలు జరుగుతుందని ఉద్యోగులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పెన్షన్‌దారుడు ఎక్కడ ఉన్నా ఈ యాప్ ద్వారా పెన్షన్ పొందే అవకాశం ఉంటుందని సంతోషపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా పింఛన్‌కు అవకాశం కల్పించడం పెన్షనర్లకు వరమని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి చెప్పారు. ఉద్యోగ విరమణ పొందినవారు సొంత బతుకుల మధ్య కూడా కార్యాలయాలకు వెళ్లి లైవ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండేదని, కానీ, ఇప్పుడు అలాంటి అవసరమే లేదని చెప్పారు. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అంతా సంబంధిత అధికారులే చూసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ పొందినవారికి సగౌరవంగా వీడ్కోలు పలుకుతున్నామని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ తెలిపారు. ఉద్యోగ విరమణ పొందినవారికి సగౌరవంగా వీడ్కోలు పలుకుతున్నామని, ఆన్‌లైన్‌లో నమో దు చేసుకుంటే పెన్షన్ ఇవ్వడం దేశంలోనే తొలిసారని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు తెలగమళ్ల పర్వతాలు అన్నారు. పంచాయతీ కార్యదర్శుల వంటి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు అంతా మంచే జరుగుతున్నదని జేఏసీ నేత పరిటాల సుబ్బారావు అన్నారు. సెల్ఫీతో పింఛన్‌పై హర్షం వ్యక్తంచేశారు.

సెల్ఫీతో పెన్షన్ మంచిది

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విభాగాల పనులను టీ యాప్ ద్వారా అందిస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు సంబంధిత కార్యాలయాలకు వెళ్లి పెన్షన్ కోసం కష్టాలు పడేవారు. ఇప్పుడు టీ యాప్ పెన్షన్‌తో ఇబ్బందులన్నీ తప్పాయి. లైవ్ సర్టిఫికెట్‌నూ అందులోనే సమర్పించవచ్చు. వేల మందికి ఇబ్బందులు తొలిగిపోయాయి. రిటైర్డ్ ఉద్యోగులకు గౌరవం కూడా దక్కుతుంది.

-కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు

గౌరవప్రదమైన హోదా

స్వరాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు తొలిగిపోతున్నాయి. రాష్ట్రంలో ఉద్యోగులకు గౌరవప్రదమైన హోదా ఉన్నది. టీ యాప్ ద్వారా పెన్షనర్లకు చాలా వెసులుబాటు దక్కింది. హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో పనిచేసి సొంత గ్రామాల్లో ఉంటున్నవారు లైవ్ సర్టిఫికెట్‌ను టీ యాప్ పెన్షన్‌లో నమోదు చేసుకుంటున్నారు.

- మమత, టీజీవో అధ్యక్షురాలు

పాలిచ్చే ఆవును కాదని దున్నను ఎన్నుకున్నరు!

- 23 సీట్లే ఇచ్చేంత తప్పు నేనేమీ చేయలేదు
- గుంటూరులో బాబు ఫైర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, దున్నను ఎన్నుకున్నారని ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి 23 సీట్లే గెలిపించేంత తప్పు తానేమీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పార్టీ ఎందుకు ఓడిపోయిందో ఇప్పటికీ ఎవ్వరికీ అర్థం కావడం లేదన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదన్నారు. తాము మొదలుపెట్టిన ప్రపంచ స్థాయి రాజధాని నేడు వెలవెలబోతున్నదని అన్నారు. తమపై కోపంతో అమరావతిని చంపేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నేడు రాష్ట్రంలో వైద్యసేవలు బంద్

- అత్యవసర సేవలకు మినహాయింపు
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

ఖైరతాబాద్: కేంద్రం ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లును ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో వివిధ వైద్య సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలను నిలిపివేస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటల వరకు వైద్యసేవలను నిలిపివేస్తున్నామన్నారు. జూనియర్ వైద్యులు సైతం తమ సేవలను నిలిపివేస్తారని, అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఐఎంఏ గౌరవ కార్యదర్శి డాక్టర్ సంజీవ్‌సింగ్ యాదవ్, తెలంగాణ నర్సింగ్ హోమ్స్ అండ్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, ఐఎంఏ నగర అధ్యక్షుడు సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మెడికోపై చేయిచేసుకున్న డీసీపీ

- వైద్యసేవల బంద్‌కు ఏపీ జూనియర్ వైద్యుల పిలుపు
- విచారణకు ఆదేశించిన డీజీపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఎదుట జూనియర్ వైద్యులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు వరకు జూనియర్ డాక్టర్లు బుధవారం చేపట్టిన ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించింది. మహానాడు రోడ్డులో వైద్యులను చెదరగొట్టేందుకు పోలీసులు యత్నించారు. ఈ క్రమంలో డీసీపీ హర్షవర్ధన్.. ఓ జూనియర్ వైద్యుడి కాలర్ పట్టుకొని కొట్టారు. మరికొందరిని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. పోలీసుల తీరుతో నిరసన ఉద్రిక్తంగా మారిందని జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. దీనిపై విచారణ జరిపించాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. డీజీపీ గౌతమ్ సవాంగ్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. దాడికి నిరసనగా ఏపీలో గురువారం అన్ని వైద్య సేవల బంద్‌కు పిలుపునిచ్చారు.

నాలుగు జిల్లాల్లో అల్బెండజోల్ నిలిపివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పంపిణీ చేయనున్న అల్బెండజోల్ మాత్రల్లో నాణ్యతాలోపం కారణంగా ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో మందుల పంపిణీ నిలిపివేయాలని వైద్యశాఖ సూచించింది.

ప్రజానాట్యమండలి నూతన కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ద్వితీయ మహాసభలు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పల్లె నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే ఉప్పలయ్య, ఉపాధ్యక్షులుగా కే లక్ష్మీనారాయణ, వై రాజేశ్వర్‌రావు, అరెల్లి రవి, కార్యదర్శులుగా బీ జగన్, ఎండీ నిస్సార్, కోశాధికారిగా పీ నళిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 42 మంది కళాకారులతో కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శు లు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, ప్రజాపక్షం దినపత్రిక సంపాదకుడు, తెలంగాణ ప్రజానాట్యమండలి ఇంచార్జి కే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏపీలో మావోయిస్టులపై నిషేధం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మావోయిస్టు పార్టీపై మరో ఏడాదిపాటు నిషేధాన్ని పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రజా భద్రతా చట్టం 1992 ప్రకారం ఆగస్టు 17, 2019 నుంచి మరో ఏడాది పాటు మావోయిస్టు పార్టీపై నిషేధం విధించింది. ఆ పార్టీ అనుబంధ సంస్థలైన రైతు కూలీ సంఘం, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, విప్లవాత్మక సమాఖ్య, సింగరేణి కార్మిక సమాఖ్య, ఆలిండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్, రాడికల్ యూత్ లీగ్, రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ తదితర సంస్థలపై నిషేధం ప్రకటించింది.

శివాజీ అమెరికాయానానికి హైకోర్టు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నటుడు శివాజీ అమెరికాయానానికి హైకోర్టు అనుమతి మంజూరుచేసింది. గతంలో హైకోర్టు అనుమతి మేరకే అమెరికా బయల్దేరగా దుబాయిలో ఇమ్మిగ్రేషన్ అధికారులు నిలిపివేశారని శివాజీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. లుక్‌అవుట్ నోటీసు తొలిగించకపోవడం కారణంగానే ఇలా జరిగిందని కోర్టుకు తెలిపారు. లుక్‌అవుట్ నోటీసు తొలిగించడానికి మూడురోజుల సమయం పడుతుందని పోలీసుల తరపు న్యాయవాది చెప్పడంతో మూడువారాలపాటు అమెరికా వెళ్లేందుకు శివాజీకి అనుమతినిస్తూ హైకోర్టు ఆదేశించింది.

సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల అభివృద్ధి

వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతున్నదని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం చెప్పారు. ఆయన బుధవారం నాంపల్లిలోని యూసుఫైన్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో పలు దర్గాలను ఇప్పటికే అభివృద్ధిచేశామని, రాబోయే రోజుల్లో యూసుఫైన్ దర్గాను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. పేద ముస్లింలను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ వివిధ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు.

యూసుఫైన్ దర్గాలో ప్రార్థన చేస్తున్న సలీం



రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం కోసం బుధవారం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

వీర సైనికుల కుటుంబాలకు అండ

ఎక్స్‌సర్వీస్‌మెన్ ర్యాలీలో లెఫ్టినెంట్ జనరల్ ఎస్టీ ఉపాసని

హైదరాబాద్/ కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: వీర సైనికులు, మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమంలో వారికి అండగా ఉంటామని దక్షిణ భారత ఏరియా జనరల్ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ జనరల్ ఎస్టీ ఉపాసని పేర్కొన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని మిలిటరీ హెడ్‌క్వార్టర్స్‌లో ఇండియన్ ఆర్మీ ఎక్స్ సర్వీస్‌మెన్ (ఈఎస్ఎం) ర్యాలీని నిర్వహించారు. ఇందులో వెయ్యిమంది వరకు రిటైర్డ్ మిలిటరీ అధికారులు, వీరసైనికుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. దేశ రక్షణకు ఎన్నో త్యాగాలు చేసిన వీర సైనికుల సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని ఎస్టీ ఉపాసని తెలిపారు. మాజీ సైనికులు, యుద్ధంలో అమరులైనవారు నేటి యువత సైన్యంలో చేరేందుకు స్ఫూర్తిగా నిలుస్తారని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా జనరల్ కమాండింగ్ ఆఫీసర్, మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు వైద్య బృందాలతో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకులను చెందిన స్టాళ్లను ఏర్పాటుచేశారు.

మాజీ సైనికుద్యోగుల ర్యాలీలో భాగంగా స్టాళ్లను పరిశీలిస్తున్న ఉపాసని, శ్రీనివాస్‌రావు

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అధికారులు

దుండిగల్, నమస్తే తెలంగాణ: సివిల్ కాంట్రాక్ట్ పనుల బకాయి బిల్లులను చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు మున్సిపల్ ఉద్యోగులను ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ కథనం ప్రకారం.. మెహదీపట్నం పరిధి గుడిమల్కాపూర్‌కు చెందిన రాజారాం గండి మైసమ్మ-దుండిగల్ మండలంలోని వివిధ పంచాయతీల్లో సివిల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. ఏడాది కిందట గ్రామ పంచాయతీలుగా ఉన్న బహదూర్‌పల్లి, డీ పోచంపల్లి గ్రామాల్లో వివిధ పనులు చేశారు. బిల్లులు రూ,10లక్షలు రావాల్సి ఉన్నది. గతంలో బహదూర్‌పల్లి, డీ పోచంపల్లి గ్రామ పంచాయతీల కార్యదర్శిగా పనిచేసిన గోవిందరావు ప్రస్తుత దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా, దుండిగల్‌లో బిల్‌కలెక్టర్‌గా పనిచేసిన కృష్ణారెడ్డి జూనియర్ అసిస్టెంట్‌గా, మహేందర్‌రెడ్డి, కిరణ్ బిల్‌కలెక్టర్లుగా పనిచేస్తున్నారు. రాజారాం రూ.10లక్షల బిల్లుల కోసం వారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇందుకు వారు రూ.50వేల లంచం డిమాండ్ చేశారు. రాజారాం అంగీకరించగా రూ.7.50 లక్షలు మంజూరుచేశారు. మిగిలిన 2.5 లక్షల కోసం వెళ్లే మళ్లీ లంచం అడిగారు. దీంతో రాజారాం ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం మున్సిపాలిటీలో మేనేజర్ గోవిందరావుకు రూ.7వేలు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డికి 13 వేలనగదు,17వేల చెక్కు అందజేయగా, మహేందర్‌రెడ్డికి ఇచ్చేందుకు రూ.11వేలను మరో బిల్‌కలెక్టర్ కిరణ్‌కు అప్పగించాడు. లంచం తీసుకుంటున్న గోవిందరావు, కృష్ణారెడ్డి, కిరణ్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో నిందితుడు మహేందర్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పట్టుబడిన నగదుతో మేనేజర్ గోవిందరావు, కృష్ణారెడ్డి, కిరణ్

జీహెచ్ఎంసీకి సరికొత్త మాస్టర్‌ప్లాన్

- ఓఆర్ఆర్ బయటి ప్రాంతాల కోసమే 2031 ప్లాన్
- వారసత్వ ప్రాంతాల జాబితా తొలిగింపు తర్వాత కొత్త ప్లాన్ సిద్ధం చేస్తున్నాం
- ఎర్రమంజిల్‌పై హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం.. తీర్పు రిజర్వు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు మార్పులు చేర్పుల తర్వాత నూతన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధంచేస్తున్నామని, ప్రస్తుతం అది రూపకల్పన దశలో ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. 2031 మాస్టర్‌ప్లాన్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) బయటి ప్రాంతాల కోసం ఉద్దేశించినదని, అందులో జీహెచ్ఎంసీ పరిధి లేదని పేర్కొన్నది. ఎర్రమంజిల్ భవనం కూల్చివేత, నూతన అసెంబ్లీ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన చీఫ్‌జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ షమీమ్‌అక్తర్ నేతృత్వంలోని ధర్మాసనం.. అన్ని వ్యాజ్యాల్లో వాదనలు ముగిసినట్టు ప్రకటించింది. నెలరోజుల సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును హైకోర్టు రిజర్వ్‌లో పెట్టింది. ధర్మాసనం గతంలో చేసిన ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ రూపొందించిన 2010, 2031 మాస్టర్‌ప్లాన్లను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ హైకోర్టుకు సమర్పించారు. ఎర్రమంజిల్‌లో నూతన అసెంబ్లీ నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకొనేందుకు ఎజెండా, నోట్ ఫైల్స్‌ను సీల్డ్‌కవర్‌లో అందజేశారు. ఇవి గోప్యత పాటించాల్సిన పత్రాలైనందున సీల్డ్‌కవర్‌లో అందజేస్తున్నట్టు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. హెరిటేజ్ ప్రాంతాల జాబితా ఉన్న హుడా జోనింగ్ రెగ్యులేషన్స్ యాక్ట్‌లోని రెగ్యులేషన్ 13 తొలిగింపుతో ఎర్రమంజిల్ భవనం వారసత్వ హోదా కోల్పోయిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సంబంధించి ఒకటికి మించి మాస్టర్‌ప్లాన్లు ఉన్నాయని, నగరం విస్తరిస్తున్నకొద్దీ కొత్తగా చేరుతున్న ప్రాంతాలకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిని వదిలేసి ఓఆర్ఆర్ బయటి ప్రాంతాల కోసం 2031 మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేశారని తెలిపారు. ఈ క్రమంలోనే 2015లో జీవోనంబర్ 183 ద్వారా హెరిటేజ్ సైట్ల జాబితా ఉన్న రెగ్యులేషన్ 13 ను ప్రభుత్వం తొలిగించిందన్నారు.

వైద్య కళాశాలల్లో ప్రవేశాలపై హైకోర్టు స్టే

ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల్లో భర్తీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కన్వీనర్

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 8 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ఆర్గానిక్ క్వీన్.. యూట్యూబ్ స్టార్!

ఇంటి వెనకాల ఉన్న ఎకరం స్థలంలో చిన్నపాటి తోట వేసింది. ఆ ఆనందాన్ని వీడియో తీసి యూట్యూబ్‌లో పెట్టింది. అనుకోకుండా వచ్చిన స్పందనతో ఇంకా వీడియోలు పెట్టింది. అలా ఆమె కొన్ని రోజులకు యూట్యూబ్ స్టార్ అయింది.

కొచ్చిన్‌లో నివాసం ఉంటున్న అన్నీ యూజిన్‌కు గార్డెనింగ్ అంటే ఇష్టం. ఆమె ఇంటి వెనకాల ఓ ఎకరం స్థలం ఉంది. అందులో గార్డెనింగ్ చేయాలనుకుంది. 2012లో గార్డెనింగ్ ప్రారంభించింది. ఆ సందర్భంలో ఓ వీడియో తీసి యూట్యూబ్‌లో పెట్టింది. దానికి మొదట 3వేల వ్యూస్ వచ్చాయి. కామెంట్స్ కూడా రావడంతో తర్వాత మరో వీడియో కూడా పెట్టింది. దీనికి ఇంకా వ్యూస్, కామెంట్స్ పెరిగాయి. అప్పుడే అనుకుంది యూట్యూబ్ చానెల్ ప్రారంభించాలని. 'కృషి లోకం' పేరుతో చానెల్ స్టార్ట్ చేసింది. ఆర్గానిక్ సాగు విధానాన్ని, ఎరువుల తయారీని, హోంగార్డెనింగ్ చిట్కాలను అన్నింటినీ వీడియోలు తీస్తూ యూట్యూబ్‌లో పెట్టడం స్టార్ట్ చేసింది. తోటలో పండించే టమాట, కాకర, ఉల్లి, మక్కజొన్న, జామ, దానిమ్మ పంటల గురించి వివరణలు, విధానాలు అన్నీ వీడియోలో చిత్రీకరించేది. ఎలాంటి సలహాలు ఉన్నా కామెంట్స్‌లో తెలియజేస్తే వాటిని క్లియర్ చేసేది. ఇట్లా నాలుగేండ్ల కాలంలోనే అనేక వీడియోలు తీసి యూట్యూబ్ స్టార్ అయింది. ఇప్పుడు ఆమె నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెల్‌కు 3లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఒక్కోవీడియోకు వేల హిట్లు ఉండడం విశేషం. ఈ వీడియోల ద్వారా ఆమె నెలకు లక్ష రూపాయలు పొందుతున్నట్టు చెప్తున్నది. ఆమెకు తోటపని అంటే ఇష్టం అని కానీ దాన్ని కమర్షియల్‌గా ఎప్పుడూ ఆలోచించలేదని అంటున్నది.

అమ్మకు.. కమ్మని పాయసాలు!

'నమస్తేస్తు మహామాయే శ్రీ పీఠే సుర పూజితే..
శంఖచక్ర గదా హస్తే మహాలక్ష్మీ నమోస్తుతే..' అంటూ..
ఆ వరలక్ష్మీ అమ్మవారిని ప్రార్థిస్తాం..
షడ్రసోపేత వంటకాలతో అమ్మకి నైవేద్యం సమర్పిస్తాం..
అందులో పాయసం అమ్మకు ప్రీతిగా పెడతాం..
ఈ వరలక్ష్మీ వ్రతానికి.. రకరకాల పాయసాలను చేసి పెట్టి..
ఆ అమ్మ అనుగ్రహాన్ని పొందండి..

సేమియా పాయసం

కావాల్సినవి :

పాలు : అర లీటరు
సేమియా : ఒక కప్పు
సాబుదానా : 2 టేబుల్‌స్పూన్స్
చక్కెర : అర కప్పు
యాలకుల పొడి : ఒక టీస్పూన్
జీడిపప్పు : 10
కిస్మిస్ : 10
నెయ్యి : ఒక టేబుల్‌స్పూన్

తయారీ :

స్టెప్ 1 : కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్‌లను వేయించి పక్కన పెట్టుకోవాలి.
స్టెప్ 2 : అదే కడాయిలో సేమియాని కూడా కాస్త వేయించి చల్లారనివ్వాలి. ఈలోపు పది నిమిషాలు సాబుదానాలో నీళ్లు పోసి నానబెట్టాలి.
స్టెప్ 3 : ఒక గిన్నెలో పాలు పోసి బాగా మరిగించాలి. మరుగుతున్న పాలల్లో చక్కెర వేసి కలుపాలి. దీంట్లోనే సాబుదానా, సేమియా వేసి కలుపాలి.
స్టెప్ 4 : బాగా చిక్కగా అయ్యాక యాలకుల పొడి వేసి కలుపాలి. దించేముందు వేయించిన జీడిపప్పు, కిస్మిస్‌లను వేసి కలుపాలి. తియ్యని సేమియా పాయసం మీ నోరూరిస్తుంది.

క్యారెట్ పాయసం

కావాల్సినవి :

పాలు : 2 1/2 కప్పులు
క్యారెట్ తురుము : ఒక కప్పు
చక్కెర : 4 టేబుల్‌స్పూన్స్
యాలకుల పొడి : అర టీస్పూన్
కుంకుమపువ్వు : చిటికెడు
జీడిపప్పులు : 7
కిస్మిస్ : 10
నెయ్యి : 2 టేబుల్‌స్పూన్స్

తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్‌లను వేయించి పక్కన పెట్టాలి. కుంకుమ పువ్వును ఒక గిన్నెలో వేసి పాలు పోసి ఉంచుకోవాలి.
స్టెప్ 2 : ఇదే గిన్నెలో క్యారెట్ తురుము వేసి సన్నని మంట మీద పది నిమిషాల పాటు వేయించాలి. ఇందులో పాలు పోసి సన్నని మంట మీద ఉడికించాలి.
స్టెప్ 3 : పదిహేను నిమిషాల పాటు కలిపిన తర్వాత చక్కెర వేయాలి. అలాగే పది నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత యాలకుల పొడి వేసి కలుపాలి.
స్టెప్ 4 : ఇప్పుడు కుంకుమ పువ్వును తీసేసి ఆ పాలను ఈ క్యారెట్ పాయసంలో పోసి కలుపాలి. చివరగా జీడిపప్పు, కిస్మిస్ లతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

శనగపప్పు పాయసం



కావాల్సినవి :

శనగపప్పు : అర కప్పు
సాబుదానా : 3/4 కప్పు
బెల్లం తురుము : ఒక కప్పు
పాలు : 2 కప్పులు
యాలకుల పొడి : అర టీస్పూన్
జీడిపప్పు : 10
కిస్మిస్ : 10
నెయ్యి : అర టేబుల్‌స్పూన్

తయారీ :

స్టెప్ 1 : శనగపప్పు అరగంట పాటు నానబెట్టాలి. ఆ తర్వాత కుక్కర్‌లో వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉంచి తీయాలి. సాబుదానాలో కొన్ని నీళ్లు పోసి కాసేపు ఉంచాలి.
స్టెప్ 2 : బెల్లంలో ఒక కప్పు నీళ్లు పోసి పది నిమిషాల పాటు నానబెట్టాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్‌లను వేసి వేయించి పక్కన పెట్టాలి. పాలు వేడి చేసి పక్కన పెట్టాలి.
స్టెప్ 3 : ఇప్పుడు ఒక గిన్నెలో బెల్లం నీళ్లు పోసి సన్నని మంట మీద పదినిమిషాలు మరగనివ్వాలి. ఇందులో ఉడికించిన శనగపప్పును వేసి కలుపాలి. ఐదు నిమిషాలు బాగా కలుపాలి.
స్టెప్ 4 : దీంట్లో పాలు పోసి మరో ఐదు నిమిషాలు సన్నని మంట మీద ఉంచి కలుపుతుండాలి. ఆ తర్వాత యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్మిస్‌లను వేసి కలిపి దించేయాలి. దీన్ని చల్లగా తింటే మరింత టేస్టీగా ఉంటుంది.

గోధుమ రవ్వ పాయసం

కావాల్సినవి :

గోధుమ రవ్వ : అర కప్పు
పాలు : అర కప్పు
బెల్లం : 1 3/4 కప్పులు
జీడిపప్పులు : 8
కిస్మిస్ : 10
యాలకుల పొడి : అర టీస్పూన్

తయారీ :

స్టెప్ 1 : గిన్నెలో పాలు పోసి వేడి చేయాలి. దీంట్లో బెల్లం తురుము, యాలకుల పొడి వేసి కలుపుకోవాలి. మరిగిన తర్వాత దించేయాలి.
స్టెప్ 2 : కడాయిలో నెయ్యి వేసి జీడిపప్పులు, కిస్మిస్‌లను వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇందులోనే మరి కొద్దిగా నెయ్యి వేసి గోధుమ రవ్వను సన్నని మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి.
స్టెప్ 3 : ఒక గిన్నెలో నీళ్లు పోసి మరిగించాలి. దీంట్లో వేయించిన రవ్వను వేసి ఉండలు కట్టకుండా కలిపి మూత పెట్టేయాలి. సన్నని మంట మీద 15 నుంచి 20 నిమిషాల పాటు ఉడుకనివ్వాలి.
స్టెప్ 4 : ఇందులో పాలు, బెల్లం మిశ్రమాన్ని పోసి మూత పెట్టకుండా కలుపాలి. ఇలా పావుగంట పాటు ఉడుకనివ్వాలి. దీంట్లో జీడిపప్పు, కిస్మిస్‌లతో గార్నిష్ చేసి దించేయాలి. టేస్టీ గోధుమరవ్వ పాయసం రెడీ!

అటుకుల పాయసం

కావాల్సినవి :

అటుకులు : అర కప్పు
కొబ్బరి పాలు : 2 1/2 కప్పులు
బెల్లం : అర కప్పు
యాలకుల పొడి : అర టీస్పూన్
జీడిపప్పులు : 15
నెయ్యి : ఒక టేబుల్‌స్పూన్
గసగసాలు : అర టేబుల్‌స్పూన్
కొబ్బరితురుము : 1 1/2 టేబుల్‌స్పూన్స్
పాలు : 5 టేబుల్‌స్పూన్స్

తయారీ :

స్టెప్ 1 : నీళ్లను వేడి చేసి అందులో బెల్లం వేసి పెట్టుకోవాలి. పాలల్లో కాసేపు గసగసాలు, కొబ్బరి తురుము, 5 జీడిపప్పులను నానబెట్టి వాటిని పేస్ట్ చేసి పెట్టుకోవాలి. అటుకులను వేయించి పక్కన పెట్టాలి.
స్టెప్ 2 : కడాయిలో నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్‌లను వేయించి పెట్టుకోవాలి. అదే కడాయిలో గసగసాల పేస్ట్‌లో కొన్ని నీళ్లు పోసి వేయించాలి. ఒక ఐదు నిమిషాల పాటు సన్నని మంట మీద అలాగే ఉంచాలి.
స్టెప్ 3 : ఇందులో బెల్లం నీళ్లను పోసి మరో ఐదు నిమిషాలు ఉంచాలి. దీంట్లో అటుకులను వేసి కలుపాలి. రెండు నిమిషాల తర్వాత కొబ్బరి పాలు పోసి పది నిమిషాల పాటు ఉడుకనివ్వాలి.
స్టెప్ 4 : దీంట్లో యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్‌లను వేసి కలిపి దించేయాలి. దీన్ని వేడిగా కంటే చల్లగా తింటే మరింత టేస్టీగా ఉంటుంది.

ముఖం మెరువాలంటే..

వర్షాకాలం కొంతమంది ముఖంపై జిడ్డు పేరుకుపోతుంది. ఓ పక్క చల్లని వాతావరణమున్నా.. కొందరికి శరీరంలోని వేడి కారణంగా మొటిమలు వస్తుంటాయి. వీటన్నింటి నుంచి పరిష్కారం పొందాలంటే.. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు.

- రెండు చెంచాల బీట్ రూట్ రసం, చెంచా పాలు కలిపి ముఖానికి పట్టించాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే ముఖానికి మంచి రంగు వస్తుంది. ఇలా రోజు విడిచి రోజు నెల రోజుల పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- చెంచా చొప్పున బీట్‌రూట్ రసం, నిమ్మరసం కలిపి ముఖానికి రాయాలి. పావుగంట తర్వాత చల్లని నీళ్లతో కడిగేయాలి. రాత్రి పడుకునే ముందు ఇలా చేస్తే చర్మం తెల్లగా మారుతుంది. ఇలా రోజు విడిచి రోజు చేయవచ్చు.
- గుప్పెడు తులసి ఆకుల్ని తీసుకుని మెత్తగా పేస్ట్ మాదిరిగా చేసుకోవాలి. అందులో ఎగ్‌వైట్‌ను మిక్స్ చేసి ముఖానికి, మెడకు ప్యాక్ వేసుకోవాలి. ఇది డ్రై అయిన తర్వాత తడి బట్టతో తుడిచేసుకోవాలి. ఇది ఫేషియల్ టోనర్‌గా ఉపయోగపడుతుంది. వారానికి ఒకసారి ప్రయత్నించవచ్చు.
- గుప్పెడు తులసి ఆకులు తీసుకుని, మిక్సీలో వేసి, రెండు టీ స్పూన్ల పెరుగు చేర్చి, మెత్తగా పేస్ట్ చేసి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.
- కలబంద గుజ్జులో కొంచెం తేనె, పాలమీగడ, గులాబీ నీళ్లు కలిపి వాటన్నింటినీ మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి ఆరనివ్వాలి. కాసేపయ్యాక గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల పిగ్మెంటేషన్ మచ్చలు, కాలిన గాయాలు మొటిమల తాలూకూ మచ్చలు తొలగిపోతాయి.

సొంత ఊరిని దత్తత తీసుకున్నది!

ఇంటిని అయితే శుభ్రంగా ఉంచుకుంటారు. అదే రోడ్ల మీదకి వస్తే పరిస్థితి మారిపోతుంది. మనం శుభ్రం చేయం కదా.. మనకెందుకులే అనుకుంటారు. ఆమె అలా నాకెందుకులే అనుకోకుండా సొంత ఊరుని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నది.

ప్రకాశం జిల్లాలోని ఒంగోలుకు చెందిన తేజస్వి పోడపతికు పుట్టిన ఊరంటే ఎంతో గౌరవం. ఊరు గురించి ఎవరేదైనా అంటే తట్టుకునేది కాదు. కాకపోతే తన నగరం పాడైపోతున్న విషయాన్ని గమనించింది. అందుకు కారణం గోడలకు పిచ్చి పోస్టర్లే అని గ్రహించింది. దీనికి ప్రభుత్వాన్ని తప్పు పట్టకుండా ఏదో ఒకటి చేయాలనుకున్నది. విషయం ఇంట్లో చెప్పగానే పోస్టర్లు చించుకుంటుంటే ప్రజలు తేజస్విని పిచ్చిది అనుకుంటారేమో అని తల్లి భయపడింది. తండ్రి మాత్రం ప్రోత్సహించాడు. టీం ఏర్పాటుకు తండ్రి సహకారం కోరింది. 2015లో అబ్దుల్ కలాం జయంతి నాడు 'భూమి ఫౌండేషన్'ని స్థాపించింది. 10 మంది వలంటీర్లతో మొదలైన ఈ ప్రయాణం 3500 మంది వలంటీర్లకు చేరింది. ప్రతివారం ఒక ప్రదేశాన్ని ఎంచుకుంటుంది. ఇలా ఒంగోలులో 125 ప్రదేశాలు ఇప్పటి వరకు శుభ్రపరిచారు. చదువు పూర్తయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తేజస్వి జీతంలో 70 శాతం ఫౌండేషన్‌కు ఖర్చు పెడుతున్నది. ప్రతీ శుక్రవారం హైదరాబాద్ నుంచి ఒంగోలు వచ్చి వెళుతుంది. రెండేండ్ల నుంచి భూమి ఫౌండేషన్ ఒంగోలు, హైదరాబాద్ పరిసరాలను కూడా క్లీన్ చేస్తున్నది. హైదరాబాద్‌లో 80కి పైగా ప్రదేశాలను శుభ్రపరిచినట్టు చెబుతున్నది తేజస్వి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కొంత సామగ్రిని ఇవ్వమని అడుగా లనుకుంటున్న తేజస్వి మున్ముందు ఇంకెన్ని పనులను చేపడుతుందో చూడాలి.

పరిసరాలు శుభ్రమేనా?

వర్షాకాలం వ్యాధుల కాలం. ఈ కాలంలో మనం నిర్లక్ష్యం వహించే చిన్న నిర్లక్ష్యం వల్లే వ్యాధులు సోకుతాయి. వ్యాధులు ప్రబలకుండా ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు. వర్షాకాలం వ్యాధులకు దూరంగా ఉండొచ్చు.

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. ఎక్కడైనా నీరు నిలిచి ఉంటే అందులో గంబూసియా చేపలను వదలాలి. ఈ చేపలు దోమల గుడ్లను తినేస్తాయి. దోమలు వృద్ధి చెందకుండా చూస్తాయి.
- ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉన్నట్లయితే కొంచెం కిరోసిన్ చల్లాలి. ఇప్పుడు కూలర్ అవసరం ఉండదు కాబట్టి అందులో నీరు లేకుండా చేసి శుభ్రంగా తుడిచి పెట్టుకోవాలి. ఇంటి సమీపంలో టైర్లు, కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలి. ఇంటి మేడపైన, మెట్ల కింద పనికి రాని టిన్‌లు తొలగించాలి.
- వాటర్ ట్యాంకును, సంప్‌ను శుభ్రపర్చుకొంటే క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి. డ్రైనేజీలో నీరు సాఫీగా వెళ్లేలా చూసుకోవాలి. పైపులు లీకేజీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- వాటర్ ట్యాంకుపైన మూత తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలకు సన్నటి తెరలు బిగించుకోవాలి. ఇంటి నేల ఎప్పుడూ పొడిగా ఉంటేట్లు చూసుకుంటే దోమలు, ఈగలు రావడానికి ఆస్కారం ఉండదు.
- సజ్జలపైనా, అటక మీద పాత సామాన్లను అప్పుడప్పుడు శుభ్రపర్చి పెట్టండి. వాటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. వీలైతే గోడలను అప్పుడప్పుడు కడగాలి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం మంచిది. చెత్తబుట్టలో పేరుకుపోయిన వాటి వల్ల కూడా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది.

వంటింటి చిట్కాలు

- టేబుల్ సాల్ట్ పొడిగా ఉండాలంటే ఉప్పు డబ్బాలో కొన్ని బియ్యపు గింజలు వేయాలి.
- కోడిగుడ్లు తాజావి అయితే ఉడకబెట్టిన తర్వాత పై పెంకు సరిగా రాదు. బియ్యం కడిగిన నీటిలో గుడ్లు వేసి ఉడికిస్తే పై పెంకు చక్కగా వస్తుంది.
- అన్నం మిగిలిపోతే పలురకాల వంటలు చేస్తుంటారు. ఇక అన్నం మిగిలితే ఎండబెట్టండి. రవ్వ విసరండి. ఇడ్లీల పిండిలోకి ఉప్పుడు రవ్వ రెడీ అయ్యినట్లే.

నమస్తే తెలంగాణ
విశేష
[కరీంనగర్]
గురువారం 8 ఆగస్టు 2019

ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడామైదానం

ఒకప్పుడు వేలాదిమంది ఆ మైదానంలో ఆటల పోటీలు తిలకించేవాళ్లు. పురాతనమైన ఈ గ్రౌండ్‌కు ఘనమైన చరిత్ర ఉన్నది.

ఇటలీలోని రోమ్‌నగరంలో కొలోసియం అనే యాంఫి థియేటర్ ఉండేది. ఇప్పుడు అది శిథిలావస్థకు చేరుకున్నది. వృత్తాకారంలో ఉండి, పైకప్పు లేని క్రీడారంగ ప్రదేశాన్ని 'కొలోసియం'అంటారు. మొదట్లో దీన్ని ఫ్లావియన్ యాంఫి థియేటర్ అని పిలిచేవాళ్లు. ఈ కట్టడం మొత్తం 510 అడుగుల వెడల్పు, 620 అడుగుల పొడవు, దాదాపు 15 అంతస్తుల భవనమంత ఎత్తు ఉండేది. ఆ మైదానం మధ్యలో సాహసికులు పోటీపడేవారు. వేలాది మంది ప్రేక్షకులు ఆ మెట్ల మీద కూర్చుని చూసేవారు. రాజులు, ఇతర ప్రముఖులు తిలకించేవారట. ఈ కొలోసియాన్ని రోమ్ చక్రవర్తి వెస్పాసియన్ నిర్మించాడు. ఆయనకు క్రీడలంటే ఎంతో ఇష్టం.క్రీస్తుశకం 72 సంవత్సరంలో మొదలు పెట్టి ఎనిమిదేండ్లలో పూర్తి చేశారు. విపత్తుల కారణంగా మూడింట రెండోవంతు కొలోసియం దెబ్బతిన్నది. ఇప్పటి వరకు ప్రపంచంలో ఇంత పెద్ద క్రీడామైదానం మరొకటి లేకపోవడం విశేషం.

72 ఏండ్ల తర్వాత తెరుచుకున్న ఆలయం

మూతపడిన ఆలయానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆ దేశంలోని హిందువుల పోరాట ఫలితంగా 72 ఏండ్ల తర్వాత తెరుచుకున్నది.

దేశ విభజనతో మూతపడిన పాకిస్తాన్‌లోని వెయ్యేండ్ల నాటి చారిత్రక హిందూ దేవాలయంలో మళ్లీ పూజలు ఆరంభమయ్యాయి. లాహోర్‌కు 100 కిలోమీటర్ల దూరంలోని సియాల్‌కేట్‌లో ఉన్న 'శావాలా తేజ్‌సింహ్ శివాలయం' దేశ విభజన తర్వాత 72 ఏండ్లకు తెరుచుకున్నది. దేశ విభజన సమయంలో ధూప దీప నైవేద్యాలకు దూరమయింది. చారిత్రక వైభవం ఉన్న ఈ ఆలయాన్ని పాక్ ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టింది. అప్పటి దాడుల్లో కొంత దెబ్బతింది. ఆలయంలోని విగ్రహాలు, గోపురాలకు మెరుగులు దిద్దారు. శివాలయాన్ని పునరుద్ధరించాలని కొందరు హిందువులు పాక్ సర్కారును కోరారు. దీంతో అక్కడి ప్రభుత్వాధికారులు మూతపడిన ఆలయాన్ని తెరిపించేందుకు సిద్ధమయ్యారు. పాకిస్తాన్‌లో 90 లక్షలమంది హిందువులున్నట్లు అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ అనగానే అద్దాలమేడలే కాదు, అందమైన ఉద్యానవనాలు, ఆహ్లాదాన్ని పంచే ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఉరుకుల పరుకుల నగర జీవితాలకు ప్రశాంతత, ఆనందంతోపాటు ఆరోగ్యాన్నిస్తూ పరవశింపచేస్తున్నాయి అర్బన్ పార్కులు. ప్రకృతి సౌందర్యాన్ని అందిస్తూ పులకరింప చేస్తున్నాయి. అడవులను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'జంగల్ బచావో-జంగల్ బడావో' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేయడంతోపాటు జనాలకు మానసికోల్లాసం అందించేందుకు మరిన్ని పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది.

సరికొత్త ఉద్యానవనాలు

రాష్ట్ర జనాభాలో మూడోవంతుపైగా హైదరాబాద్‌లో నివసిస్తుండడంతో ప్రధానంగా నగర శివార్లలోనే అత్యధికంగా 50కి పైగా అర్బన్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. విశ్వనగరంగా ఖ్యాతి పొందుతున్న హైదరాబాద్‌ను మరింత ఉన్నత జీవన ప్రమాణాలున్న నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అర్బన్ పార్కులను ఆహ్లాదకరంగా, అందంగా తీర్చిదిద్దుతుండడంతో ఇప్పటికే ప్రారంభించిన పలు అర్బన్ పార్కుల్లో వారాంతాలు, సెలవు రోజుల్లో ప్రజలు ప్రశాంతంగా గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిలో వాకింగ్ ట్రాక్‌లు, కానోపీ వాక్‌లు, పాత్‌వేలు, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు.

ఆరోగ్య సంజీవని వనం

'ఆరోగ్య సంజీవని వనం' పేరుతో అర్బన్ పార్కును ర్పాటు చేశారు. ఎల్బీనగర్, బీఎన్‌రెడ్డినగర్, తుర్కయంజాల్, నాదర్‌గుల్, మన్నెగూడ పరిసర ప్రాంత ప్రజలకు నిత్యం ఉపయోగపడేలా గుర్రంగూడ రిజర్వు ఫారెస్ట్‌లో అర్బన్ పార్కును అటవీ శాఖ అభివృద్ధి పరిచింది. ఈ పార్కులో వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతోపాటు కుటుంబంతో గడిపేందుకు పిక్నిక్ స్పాట్, అక్కడేవనభోజనాలు చేసేందుకు వీలుగా ప్రత్యేక వసతులు అందిస్తున్నారు. పిల్లలకు సాహస క్రీడలు, రాశివనం, నక్షత్రవనం ఉన్నాయి. తక్కువ ప్రాంతంలో ఎక్కువ పచ్చదనం పెంచే మియావాకి పద్ధతిలో మొక్కలను ఇక్కడ ప్రయోగాత్మకంగా పెంచుతున్నారు.

కండ్లకోయ ఆక్సీజన్ పార్కు

రిజర్వ్ ఫారెస్టులో 75 ఎకరాల్లో ఏర్పాటు చేసిన 'ఆక్సీజన్ పార్కు' సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. యాంత్రిక జీవనానికి దూరంగా.. విషవాయువుల జాడలేని స్వచ్ఛమైన గాలిని అందించేలా దీనిని నిర్మించారు. ఇక్కడ పలురకాల పూలు, పండ్ల చెట్లతోపాటు ఔషధ గుణాలు కలిగిన అరుదైన మొక్కలున్నాయి. చిన్నపాటి కుంటలు, వివిధ రకాల పక్షుల కిలకిల రావాలు ఇక్కడ సందడి చేస్తుంటాయి. మర్రిచెట్టు కింద రచ్చబండ సెట్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిన్నారుల క్రీడామైదానం, వాచ్‌టవర్ వంటివి ఎంతో ఆకర్షిస్తున్నాయి.

పంచతంత్ర పార్కు

శేరిలింగంపల్లిలోని గోపనపల్లి జర్నలిస్ట్ కాలనీలో చిన్నారుల కోసం 'పంచతంత్ర థీమ్‌తో ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేశారు. రూ. 50 లక్షలు ఖర్చుతో దీనిని వినూత్నంగా తీర్చిదిద్దారు. ఇందులో పంచతంత్ర నీతి కథలు, చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ పెయింటింగ్స్, ఇతర క్రీడా పరికరాలు అందుబాటులో ఉంచారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. మొసలి, కోతి, ఏనుగు వంటి పిల్లల కథలు చెప్పేందుకు ఆరు అంశాల్లో బొమ్మలున్నాయి. బొమ్మల్లో ఉండే ఆడియో విధానం ద్వారా మీట నొక్కగానే సంబంధిత అంశానికి చెందిన కథను బొమ్మ వినిపిస్తుంది.

కుక్కల పార్కు

కొండాపూర్‌లో కుక్కల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేశారు. 1.35 ఎకరాల స్థలంలో డాగ్ పార్కును అభివృద్ధి చేశారు. రూ. కోటి వ్యయంతో కుక్కలు, మనుషులు నడిచేవిధంగా వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. ఈ పార్కులో పెంపుడు కుక్కలను ఆడించేందుకు వీలుగా సౌకర్యాలున్నాయి. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ డాగ్ పార్కు అందుబాటులో ఉంటుంది. శునకాల కోసం ఈత కొలను, వ్యాయామ, ఆహారశాల, ముస్తాబు కేంద్రం వంటి సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి.

ఆరోగ్యవనం

నాగారం రిజర్వ్ ఫారెస్ట్‌లో 75 ఎకరాల్లో దీనిని నిర్మించనున్నారు. స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదాన్ని పంచేందుకు ఇది సిద్ధమవుతున్నది. మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో ఉన్న అటవీ భూమిలో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో నాలుగు కిలోమీటర్ల వరకు ఔషధ మొక్కలు,వాకింగ్ ట్రాక్, వాటర్ ఫాల్స్, యోగా మందిరంతోపాటు కొండపై గాజీబో నిర్మాణాలను చేపట్టారు. మరికొన్ని రోజుల్లో ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి రానున్నది.

సరికొత్త థీమ్ పార్కులు

గ్రేటర్ పరిధిలో రూ.120 కోట్లతో 47 పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. నగరవాసులకు మెరుగైన జీవనాన్ని అందించేందుకు ఎకరానికిపైగా విస్తీర్ణమున్న ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే అందుకోసం 47 స్థలాలను గుర్తించారు. స్వచ్ఛ హైదరాబాద్ ప్రాముఖ్యం తెలిపే పార్కులను జోన్‌కు రెండు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయడం, చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, ఇంకుడుగుంతల నిర్మాణం, వ్యర్థాల తరలింపు కేంద్రాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించడం, డంపింగ్‌యార్డు ఆధునికీకరణ పనులను ఇతర స్వచ్ఛ కార్యక్రమాలను ప్రతిబింబించే దృశ్యాలు, రూపకాలతో సరికొత్త థీమ్ పార్కులను ప్రవేశపెట్టనున్నారు.

...✍ పసుపులేటి వెంకటేశ్వరరావు

ట్వీట్

మంచు విష్ణు
@iVishnuManchu

నవదీప్ ఇలా ఉన్నాడేంటి? నాకైతే అస్సలు నచ్చలేదు. ఇంకోటి ఇది పూర్తిగా ఫొటోషాప్ చేసినట్లు కనిపిస్తున్నది. కాబట్టి నా అభిప్రాయానికి అర్థం ఉంది!

విష్ణును ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
5,86,759

కామన్‌మ్యాన్ వాయిస్

జమ్ము&కశ్మీర్ ఎవరి సొత్తూ కాదు. ఇన్ని రోజులుగా మీరు కార్చిన మొసలి కన్నీరు చాలు. ప్రశ్నించే గళాలు వచ్చాయి. మీ స్వార్థాలు పక్కనపెట్టి భవిష్యత్‌లో ప్రజల భద్రత & సంక్షేమం కోసం అందరికోసం కలిసి రండి!
– Veeraswamy Arege

బీజేపీలో తెలంగాణ గురించి నిజాయితీగా మాట్లాడిన ఒకరిద్దరిలో సుష్మా స్వరాజ్‌గారు ఒకరు. ఆమె అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు!
– Sudheer Kumar Thandra

కష్టాల్లో ఉన్నవారి పట్ల చిన్నమ్మ విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు స్పందించిన తీరు చాలా గొప్పది. తెలంగాణవాదం ఎత్తుకున్నందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత అయినా కూడా ఆమె కుట్రలు ఎదుర్కొన్నది. అయినా వెనక్కు రాలేదు!
– Nawin Samala

వైరల్ వీడియో

టీ-20 లీగ్స్ వచ్చిన తర్వాత ఊరూరా లీగ్స్ ఊపందుకున్నాయి. ఈ గల్లీ లీగ్స్ ఎలా ఉంటాయి? ఆటగాళ్లను ఎలా వేలం వేసి కొంటారు? ఎవరెవరికి ఎంత రేటు? నేటి యూత్‌కు కరెక్ట్‌గా యాప్ట్ అవుతున్న ఈ వీడియో యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్నది. దీంట్లో మీరూ ఉన్నారా? చెక్ చేసుకోండి!

The Auction Day Episode -1 | Gully Premier League | Shanmukh Jaswanth | Vamsi Srinivas
Total views : 177,846+
Published on Aug 6, 2019

సుడోకు

డైలీ సుడోకు 115 సమాధానం

7	9	4	2	3	1	8	6	5
6	1	3	4	8	5	9	2	7
2	5	8	6	9	7	3	1	4
4	3	1	8	5	6	2	7	9
8	6	7	9	4	2	5	3	1
9	2	5	1	7	3	6	4	8
1	7	2	5	6	8	4	9	3
5	4	6	3	1	9	7	8	2
3	8	9	7	2	4	1	5	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -116

8			2					
		9		4	8			
5						8		1
			5				7	2
9		2				6		5
7	6				2			
4		7						3
			1	7		9		
					9			6

వింత ఆచారం !

75 కిలోల ఎండు మిరపకాయలను దంచి ఆ కారాన్ని నీటిలో కలిపి అభిషేకం చేస్తారు. దేవాలయంలోని దేవుడికి కాదు అర్చకుడికి! ఈ వింత ఆచారం ఓ చోట ఉన్నది. ఎక్కడో తెలుసా?

తమిళనాడు ధర్మపురి జిల్లా నల్లమ్‌పల్లిలోఆడి అమావాస్య సందర్భంగా కరుప్పు స్వామి ఆలయంలో ఈ వింత ఆచారం ఆనవాయితీగా వస్తున్నది. ప్రతి ఏటా ఆడి (ఆషాడ)అమావాస్యను పురస్కరించుకుని కరుప్పు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ అర్చకుడికి కారం నీటితో అభిషేకం చేస్తారు. అర్చకునికి అభిషేకం నిర్వహించే ఘట్టాన్ని అందరూ ఎంతో ఆసక్తిగా తిలకిస్తుంటారు. అభిషేకం అనంతరం అర్చకుడు చెప్పే ఉపదేశాన్ని శ్రద్ధగా వింటారు. ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఈ అభిషేకం కోసం 75 కిలోల ఎండుమిరపకాయలను దంచి కారం పొడిని తయారు చేస్తారు. ఆ పొడిని భక్తులు అందరూ చూస్తుండగా బిందెల కొద్దీ కారపు నీళ్లను ఆలయ అర్చకునికి అభిషేకం చేస్తారు. కరుప్పు ఆలయంలో ఆడి అమావాస్య సందర్భంగా జరిగే ముఖ్యమైన ఘట్టమిది.

22 ఏండ్లు ఒంటరిగానే !

అందరితో సరదాగా కబుర్లు చెబుతూ గడపడం కొంతమందికి అలవాటు. మరికొందరు మాత్రం ఒంటిరిగా జీవించడాన్నే ఇష్టపడుతుంటారు. ఓ వ్యక్తి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 ఏండ్లుగా ఒంటరిగా నివసిస్తున్నాడు. ఎందుకంటే?

కాలిఫోర్నియాలోని సెర్రోగోర్డో నిర్మానుష్య పట్టణ ప్రాంతం. రాబర్ట్ లూయిస్ డెస్మరైస్ అనే వ్యక్తి వెండి నిక్షేపాల కోసం రెండు దశాబ్దాలుగా శోధిస్తూనే ఉన్నాడు. చిన్నప్పుడు స్కూల్లో చదువుకునేటప్పుడు కూడా నిధుల కోసం మారుమూల ప్రాంతాల్లో గాలించేవాడు. కొన్నాళ్ల తర్వాత వెండి నిక్షేపాల జాడను తెలుసుకునేందుకు సెర్రోగోర్డోలోనే జీవించడం మొదలుపెట్టాడు. సెర్రోగోర్డో (స్పానిష్‌లో లావైన కొండ అని అర్థం) ఒకప్పుడు కాలిఫోర్నియాలోనే ప్రధానమైన వెండి గనిగా ఉండేది. లాస్ ఏంజిల్స్ నిర్మించడానికి కూడా ఈ వెండి గని సహాయపడిందట. ఇంకా ఇక్కడ వెండి పుష్కలంగా ఉందని ఆయన నమ్ముతున్నాడు. అందుకే 800 అడుగుల రాళ్లను సైతం పలగొట్టే పనిలో పడ్డాడు. 'ఆ గనులను కనిపెట్టగలననే నమ్మకంతోనే ఉన్నా. అందుకే ఇంకా ఇక్కడే ఉన్నా'' అని డెస్మరైస్ చెబుతున్నాడు.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

ఎన్ఎల్‌సీలో 875 ఖాళీలు

తమిళనాడులోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ వివిధ ట్రేడ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం అప్రెంటిస్‌షిప్‌ల సంఖ్య:** 875

విభాగాలవారీగా ఖాళీలు: ఫిట్టర్-120, టర్నర్-50, మెకానిక్ (మోటార్ వెహికిల్)-130, ఎలక్ట్రీషియన్-130, వైర్‌మ్యాన్-120, మెకానిక్ డీజిల్-15, మెకానిక్ ట్రాక్టర్-15, కార్పెంటర్-5, ప్లంబర్-10, స్టెనోగ్రాఫర్-20, వెల్డర్-100, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ (పాసా)-40, అకౌంటెంట్-40, డాటా ఎంట్రీ ఆపరేటర్-40, అసిస్టెంట్ (హెచ్ఆర్)-40

- **అర్హతలు:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత. అకౌంటెంట్/డాటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్‌లకు బీకాం, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీబీఏలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 అక్టోబర్ 1 నాటికి 14 ఏండ్లు నిండి ఉండాలి.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 10,019/-
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు+ఇంటర్వ్యూ
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో ఆగస్టు 12 నుంచి
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.nlcindia.com

డీఆర్‌డీవోలో 290 సైంటిస్టులు

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో పర్సనల్ డిపార్ట్‌మెంట్లైన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ (ఆర్ఏసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 290

పోస్టులు-ఖాళీల వివరాలు:

- సైంటిస్ట్ బీ (డీఆర్‌డీవో)-270 ఖాళీలు (జనరల్-99, ఈడబ్ల్యూఎస్-23, ఓబీసీ-80, ఎస్సీ-44, ఎస్టీ-24)
- సైంటిస్ట్ బీ (డీఎస్‌టీ)-6 ఖాళీలు (జనరల్-4, ఓబీసీ-2)
- సైంటిస్ట్/ఇంజినీర్ బీ (ఏడీఏ బెంగళూరు)-10 ఖాళీలు (జనరల్-4, ఈడబ్ల్యూఎస్-1, ఓబీసీ-2, ఎస్సీ-2, ఎస్టీ-1)
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ GAETEC (హైదరాబాద్)-4 ఖాళీలు (జనరల్-1, ఈడబ్ల్యూఎస్-1, ఓబీసీ-2)
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎలక్ట్రికల్, ఏరోనాటికల్, మ్యాథమెటిక్స్, మెటలర్జీ, మెటీరియల్స్ సైన్స్, సివిల్ ఇంజినీరింగ్, జియాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫుడ్ సైన్స్, టెక్స్‌టైల్, ప్రొడక్షన్ /ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీలో బీఈ/బీటెక్ లేదా మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచీ/విభాగంలో వినియోగంలో ఉన్న గేట్ (2017/2018/2019) స్కోరు కలిగి ఉండాలి.
- **వయస్సు:** ఆగస్టు 30 నాటికి డీఆర్‌డీవో/GAETEC లకు 28 ఏండ్లు, ఏడీఏలకు 30 ఏండ్లు, డీఎస్‌టీలకు 35 ఏండ్లకు మించరాదు.
- **పేస్కేల్:** సైంటిస్ట్ రూ. 56,100/- (7వ వేతన పేస్కేల్ అనుసరించి), హెచ్ఆర్ఏ+ ఇతర అలవెన్సులతో జీతం నెలకు రూ. 80,000/- చెల్లిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/- ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌డీ, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.
- **ఎంపిక:** గేట్ స్కోర్‌కు 80 శాతం, ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి ఫైనల్ సెలక్షన్ చేస్తారు.
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు గేట్ స్కోర్, డిస్క్రిప్టివ్ ఎగ్జామ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా మిగతా విభాగాలకు గేట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం:** ఆగస్టు 10 నుంచి
- **చివరితేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** https://rac.gov.in

ఎయిర్‌ఇండియాలో

ఎయిర్ ఇండియా లిమిటెడ్‌కి చెందిన సెంట్రల్ ట్రెయినింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (హైదరాబాద్) కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 26 (జనరల్-13, ఈడబ్ల్యూఎస్-2, ఓబీసీ-7, ఎస్సీ-3, ఎస్టీ-1)
- **పోస్టు పేరు:** ట్రెయినీ సిమ్యులేటర్ ఫ్లయిట్ మెయింటెనెన్స్ ఇంజినీర్
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, టెలికమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.airindia.in

బీవోఎంలో ఆఫీసర్లు

జాతీయ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టులు:** 46
- **విభాగాలవారీగా..** లా ఆఫీసర్-25, సెక్యూరిటీ ఆఫీసర్-12, ఫైర్ ఆఫీసర్-1, మేనేజర్ కాస్టింగ్-1, ఎకనమిస్ట్-1, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఐఎస్) ఆడిటర్స్-5 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (లా), సంబంధిత బ్రాంచీలో డిగ్రీ, ఐసీడబ్ల్యూఏ/ఎంఏ ఎకానమి, ఎంపీఏ, ఎంసీఎస్, ఎమ్మెస్సీ (ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్), బీఈ (ఫైర్) ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ (ఎకనామిక్స్) ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు
- **వయస్సు:** 25-35 ఏండ్ల మధ్య ఉండాలి.

బैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra

- **పేస్కేల్:** రూ. 31,705-45,950/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 19
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

ఎన్ఎఫ్‌సీఎల్‌లో అసిస్టెంట్లు

జైతాపూర్ న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ఎన్ఎఫ్‌సీఎల్ ప్రకటన విడుదల చేసింది.

Government of India
Department of Atomic Energy
NUCLEAR FUEL COMPLEX

- **మొత్తం ఖాళీలు:** 18 (క్లరికల్ అసిస్టెంట్-6, ఆఫీస్ అసిస్టెంట్-12)
- **అర్హత:** క్లరికల్ అసిస్టెంట్‌కు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, ఆఫీస్ అసిస్టెంట్‌కు పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 ఆగస్టు 12 నాటికి 18 ఏండ్లు నిండి ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 8 ఆగస్టు 2019
raithubadi@ntnews.com

కత్తెర పురుగు ఉధృతికి
అడ్డుకట్ట ఇలా

కత్తెర పురుగు దక్షిణ అమెరికా దేశాల్లో మొదలైంది. ఇది అక్కడి మక్కజొన్న పంటలకు పెను ప్రమాదకరంగా మారింది. అక్కడి నుంచి పశ్చిమ దేశాల మీదుగా ఇది ఇండియాకు వచ్చింది. రెండేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో మక్కజొన్న పంటను ఆశించి పెను ప్రమాదంగా మారింది. ఈ నేపథ్యంలో మక్కజొన్న లో సమగ్ర సస్యరక్షణ, ఆధునిక పద్ధతులు, సామూహిక చర్యల ద్వారానే దీన్ని ఉధృతికి అడ్డుకట్టవేయగలం.

మక్కజొన్నపై కత్తెరపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నది. దీనిపై అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని కేంద్రం ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖను ఆదేశించింది. దీంతో జిల్లాల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యలను వ్యవసాయశాఖ మొదలుపెట్టింది. ఈ పురుగు ఉధృతిని నియంత్రించేందుకు ఎటువంటి యాజమాన్య పద్ధతులను పాటించాలన్న దానిపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు సూచనలు చేసింది.

కత్తెర పురుగు పంటను ఆశిస్తే ఆ పంటనంతా నాశనం చేస్తుంది. దీన్ని ఫాల్ ఆర్మీ వార్మ్ అని పిలుస్తారు. 90 రోజుల జీవితకాలంలో రెండు దశల్లో గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి వచ్చే పిల్లల లార్వాలు. ఇవే కత్తెర పురుగులు. ఇవి గుంపులుగా తిరుగుతూ ఆకులను తినేస్తాయి. రెండో దశలో ఈ పురుగులు మొక్కకాండం మొవ్వులో చేరి కాండాన్ని తింటాయి. మొవ్వును పూర్తిగా తినడంతో పూత పోయి కంకి తయారవ్వదు. కంకి తయారయ్యే సమయంలోనూ ఈ పురుగులు కంకులలో దూరి లేత గింజలను తినేస్తాయి. ఈ పురుగు మొదట మక్కజొన్న పంటపైనే దాడి చేస్తుంది. అది అందుబాటులో లేకుండా వరి, గోధు, జొన్న, సజ్జ, చిరుధాన్యాలు, పత్తి, చెరకు, కూరగాయల వంటి 86 రకాల పంటలపై ప్రభావం చూపుతున్నది.

సేంద్రియ పద్ధతులే మేలు..

కత్తెర పురుగును క్రిమిసంహారక మందులతో అరికట్టడం అంత తేలికకాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మక్కజొన్న సుడులలో మట్టి, బొగ్గు పొడి, రాతిపొడి, బూడిద వేయడం, కొన్నింటిలో వేపగింజల కషాయం, అగ్ని అస్త్రం, ఉప్పు, పచ్చిమిర్చి ద్రావణం, సుడులలో పిచికారీ చేయడం వంటి పద్ధతులతో అరికట్టే అవకాశాలు ఉన్నాయి.

అంతరపంటలతో అడ్డుకట్ట..

పొలమంతా మక్కజొన్న పంటను మాత్రమే సాగు చేసే ప్రాంతాల్లో కత్తెర పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది. మక్కజొన్నలో అంతర పంటగా, చుట్టూ కంచెగా నాపియర్ గడ్డి వేస్తే కత్తెరపురుగు ఉధృతి తగ్గుతుంది. మక్కజొన్నతో పాటు పప్పుధాన్యాలు , నూనెగింజలు, చిరుధాన్యాలు అంతర పంటలుగా కలిపి సాగుచేస్తే ఇది వ్యాప్తి చెందదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జూలై చివరి వారంలో, ఆగస్టు మొదటి వారంలో మక్కజొన్నను కత్తెర పురుగు ఆశిస్తుంది. మక్కజొన్న చేలలో రైతులకు అనుకూలంగా ఉండే మిత్ర పురుగులైన సాలెపురుగులు, గండు చీమలు, అక్షింతల పురుగులు, తూనీగలు, కందిరీగలు, ఆసాసిన్ బగ్స్, పెంటలూమిడ్ బగ్స్, ఇయర్ విగ్స్, ట్రైకోగ్రమ వంటి ఉండేవి. ఇప్పుడు క్రిమిసంహారక మందుల వల్ల అవి చనిపోతున్నాయి. నేడు మార్కెట్‌లో లభ్యమయ్యే పర్యావరణ అనుకూలమైన 'ఫిరమోన్ టెక్నాలజీతో లింగాకర్షక ట్రాప్‌ల ద్వారా దీన్ని కొంతవరకు అరికట్టవచ్చు. ఈ పురుగు నివారణకు ఎకో ఫ్రెండ్లీ ప్రయోగాలు ఫలిస్తున్నాయని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పురుషోత్తం దేవాంగ్ తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు తొలి నెలలోగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు

- మక్కజొన్న మొలిచినప్పటి నుంచి కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు పంటపై నిఘా ఉంచి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి.
- ప్రతి 25 రోజులకు బుట్టలలోని ఎరలను మార్చుకోవాలి. ప్రతి బుట్టకు రోజుకు ఒక తల్లి పురుగును గమనించినా లేదా లేత ఆకులపైన గుడ్ల సముదాయాలను లేదా తెల్లటి పొరను గమనించినా 1500 పీపీఎం సాంద్రత కలిగిన అజాడిరక్టిన్‌ను 5 మి.మి. చొప్పున లీటరు నీటిని కలిపి విధంగా పిచికారీ చేయాలి.
- కత్తెర పురుగు 2 లేదా 3వ లద్దెపురుగు దశలో ఉన్నప్పుడు 5-10 శాతం పురుగు ఆశించిన మొక్కలను గుర్తించినప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 200 లీటర్ల నీటిని 80 గ్రాముల చొప్పున కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలి.
- సేంద్రియ పద్ధతిలో సాగుచేసే రైతులు పొలంలో గుడ్ల సముదాయాన్ని గమనించిన వెంటనే టెలినోమస్ దీమస్ లేదా ట్రైకోగ్రామా ప్రెటియోజమ్ అనే గుడ్డు పరాన్న జీవులను ఎకరానికి 50వేల చొప్పున వారం వ్యవధితో 2 నుంచి 3 సార్లు విడుదల చేయాలి. వీటితోపాటు తొలిదశ లద్దె పురుగుల నివారణకు మెటారైజియమ్ లేదా నోమూరియా అనే శిలీంధ్ర మిశ్రమాలను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి ఆకుసుడిలో పడే విధంగా పిచికారీ చేయాలి.
- ప్రస్తుతం వాడుతున్న లింగాకర్షక బుట్టలతో పోలిస్తే త్రీడీ నానో టెక్నాలజీతో కూడిన ల్యూర్‌లు బాగా సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రైతులకు సబ్సిడీపై వీటిని అందిస్తున్నది.

–మజ్జిగపు శ్రీనివాస్ రెడ్డి
8096677036

పోషకాలను అందిస్తూ, ఏడాది అంతా దిగుబడినిస్తూ భూమికి నత్రజనిని అందించే పంట చిక్కుడు. ఈ పంట ఉష్ణ, శీతల, ఉప-ఉష్ణ ప్రాంతాలలో కూడా వస్తుంది. హెక్టారుకు 5-10 టన్నుల పచ్చి ఆకులను ఇస్తుంది. దీన్ని మేతగా వాడుకోవచ్చు. భూసారాన్ని పెంచుతుంది. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. పశువుల మేతగా, నిల్వ ఉంచే సైలేజిగా కూడా దీన్ని వాడుకోవచ్చు.

ఏడాదంతా చిక్కుడు సాగు

కూరకు వాడే చిక్కుడులో ప్రతి 100 గ్రాములకు 6.7 గ్రాముల కార్బొహైడ్రేట్, 3-8 గ్రాముల ప్రోటీన్, 1.8 గ్రాముల ఫైబర్, 210 మి.గ్రా కాల్షియం, 68 గ్రాముల ఫాస్ఫరస్, 1.7 గ్రాముల ఇనుము ఉంటుంది. రాష్ట్రంలో రైతులు వాణిజ్యంగా సాగు చేసేందుకు, మిద్దె తోటలలో, పెరట్లలో ఆరోగ్యంగా పెరిగి తక్కువ ఖర్చుతో ఏడాది అంతా దిగుబడిని ఇస్తుంది.

చిక్కుడు అతి చలిని, అతి ఎండను తట్టుకోలేదు. చిక్కుడులో ప్రధానంగా రెండు రకాలు. పందిరి చిక్కుడు, పొద చిక్కుడు. పందిరి చిక్కుడు కొంచెం ఖర్చుతో కూడుకున్నది. కాపు కోసం కూడా 4-5 నెలలు వేచి ఉండాలి. ఒక కాలంలోనే సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. పొద చిక్కుడులో మంచి రకాలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి పందిరి చిక్కుడు సాగు కనిపించడం లేదు. పొద చిక్కుడు మూడునెలల వ్యవధిలోనే పంట చేతికి వస్తుంది. సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. అయితే ఈ సాగులో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చు. పొద చిక్కుడు మూడు కాలాల్లో సాగు చేసకోవచ్చు. వానకాలంలో పండించే పంటలో మంచి నాణ్యత గల కాయను పొందవచ్చు. దిగుబడులు కూడా బాగా ఉంటాయి.

వాతావరణం: చిక్కుడు ఉష్ణమండల పంట. అధిక చలిని, అధిక వేడిని ఏమాత్రం తట్టుకోలేదు. తొలిదశలో ప్రత్యేకించి మొలకెత్తే సమయంలో పంటకు 20-25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కావాలి. గాలిలో అధిక తేమతో తెగుళ్లు, ఇతర రోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

నేల: ఉదజని సూచిక -7.7.5 మధ్య ఉండి, మధ్యస్థ తేలికపాటి నుంచి నేలల్లో ఈ పంట బాగా పెరుగుతుంది. నీటి నిల్వ ఉండే భూములు, నల్లరేగడి భూములు ఈ పంటకు అతిగా అనుకూలం కాదు. అధికంగా గాలిలో తేమ ఉండే నేలల్లో ఈ పంట వేయవద్దు.

నేల తయారీ: నేలలో నీరు ఇంకే విధంగా తయారు చేసుకోవాలి. ముందుగా ఎండాకాలంలో లోతు దుక్కి చేసి, తర్వాత నాలుగైదుసార్లు దుక్కిదున్నాలి. విత్తడానికి 15 రోజుల ముందు హెక్టారుకు 2.5 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు వేయడం మంచిది. పప్పుధాన్యపు పంట కాబట్టి భూమిలో నత్రజనిని స్థాపించి భూసారాన్ని కాపాడుతుంది.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి 1 గ్రా కార్బడింజం కలిపి విత్తనశుద్ధి చేయాలి లేదా కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి లేదా 3 గ్రాముల కాప్టాన్ లేదా థైరమ్‌తో విత్తనద్ధి చేయాలి. తర్వాత రసం పీల్చే పురుగుల మందుతో శుద్ధి చేసుకోవాలి. సిఫార్సు చేసిన రైజోబియం జీవన ఎరువును కిలో విత్తనాలకు 40 గ్రాముల చొప్పున పట్టించాలి. 200 గ్రాముల రైజోబియం కల్చర్‌ను 250 గ్రాముల బెల్లం ద్రావకంలో కలిపి లీటరు నీటిలో ఉంచి ద్రావణం తయారు చేసుకోవాలి. ఆ రైజోబియం మిశ్రమ ద్రావణాన్ని విత్తనాలపై పొరగా ఏకరీతిగా పట్టించాలి. తర్వాత నీడలో అరగంట పాటు ఎండబెట్టాలి. 24 గంటల లోపు ఎండిన విత్తనాలను నేలలో విత్తాలి.

విత్తన మోతాదు: ఎకరాకు తీగ రకాలకు 0.8-1.2 కిలోలు, పొద రకాలకు 12-16 కిలోల విత్తనం కావాలి.

విత్తే సమయం: తీగ(పందిరి) రకాలను ఆగస్టు రెండవ వారం వరకు, పొద రకాలను వర్షాకాలంలో (ఆగస్టు రెండవ వారం వరకు) యాసంగి (సెప్టెంబర్-అక్టోబర్) ఎండాకాలం (జనవరి-ఫిబ్రవరి) కాలాల్లో విత్తుకోవచ్చు.

విత్తటం: పందిళ్లపై పెంచే పంటకు 2-2.5 మీటర్ల దూరంలో కాలువ లు చేసిన 1.5-2.0 మీటర్ల దూరం లో పాదులు చేసి ఒక్కొ పాదులో 3-4 విత్తనాలు పెట్టాలి. 30X30X30 గుంటల్లో విత్తుకోవాలి.పాదరకాలలో విత్తనాలను బోధలు , చాళ్ల పద్ధతుల్లో విత్తుకోవాలి. వరుసల మధ్య రెండు అడుగులు, మొక్కల మధ్య ఒకటిన్నర అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తిన వెంటనే నీళ్లు పెట్టాలి. 5-7 రోజుల తర్వాత బలమైన రెండు మొక్కలు ఉంచి మిగతావి తీసివేయాలి. నాగలితో లేదా సీడ్‌డ్రిల్‌తో విత్తనం వేసుకోవాలి.

ఎరువులు: ఎకరాకు 4-5 టన్నుల పశువుల ఎరువు, 24 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటుగా మొదటి దఫా 15 కిలోల నత్రజని వేసి కలియదున్నాలి. రెండవ దఫాగా 15 కిలోల నత్రజనిని, 15 కిలోల పొటాష్ విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీళ్లు కట్టాలి. దీనితో చిక్కుడులో పూత కాపునకు వస్తుంది.

నీటి యాజమాన్యం: పాదుల్లో 2-3 సెం.మీ లోతుగా నేల పొడిబారినప్పుడు నీళ్లు కట్టాలి. పాదుల్లో నీళ్లు నిలువకుండా చూడాలి. వర్షాలు లేనప్పుడు 10-15 రోజుల వ్యవధిలో నీటిని కట్టుకోవాలి.

అంతకృషి: పూత, కాత సమయంలో అంతరకృషి చేయకూడదు. ఒకవేళ చేస్తే పూత రాలిపోతుంది. పాదుల్లో మట్టిని గుల్లగా చేయాలి. తీగ సాగే దశలో పురికొసతో కట్టి తీగలను పందిరిపైకి పాకించాలి. ఒక వేళ పూతదశలో వర్షాలు ఎక్కువగా పడితే పూత రాలుతుంటే ఒక శాతం యూరియా, ద్రావణం లేదా ప్లానోఫిక్స్ ఒక మి.లీ 4.5 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్యం: చిక్కుడు సాగులో గడ్డిజాతికి చెందిన మొక్కలు కలుపుగా ఎక్కువ సమస్య వస్తుంది. కాబట్టి కలపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.25 లీ లేదా అలాక్లోర్ 1.0 లీ (తేలిక నేలలు) 1.25 లీ (బరువు నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిని 48 గంటలలోపు పిచికారీ చేయాలి.

సస్యరక్షణ

పెంకు పురుగు: మొదటి దశ మొక్కల్లో ఆకులను కొరికి, తిని పంటకు తీరని నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు కార్బరిల్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పేను బంక, తామర పురుగులు: ఈ పురుగులు ఆకులను, పూత దశలో పూలపై ఆశించి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల మొక్కలు పండుబారి పసుపు రంగులోకి మారి రాలిపోతాయి.

నివారణ: ఈ పురుగు నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా ఫిప్రొనిల్ మందును 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో చెట్టుకు పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు: పూత దశలో, కాయ దశల్లో ఈ పురుగు కాయల్లోని మంచి పదార్థాలను తినేసి కాయ నాణ్యత తగ్గేలా చేస్తుంది. కాయంత డొల్లగా మారిపోతుంది.

నివారణ: ఈ పురుగు నివారణకు మలాథియాన్ 2 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత దశ నుంచి మొదలుపెట్టి 10 రోజుల వ్యవధిలో మళ్లీ పిచికారీ చేయాలి. 5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ వేపనూనే లీటరు నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తయారుచేసుకుని క్రమపద్ధతిలో పురుగుల నివారణకు వాడుకోవాలి.

దిగుబడి, కోత కోయడం

విత్తిన 120-130 రోజులకు మొదటి కోత వస్తుంది. కాయలు లేతగా ఉన్నప్పుడే కాయలను కోసుకోవాలి. లేకపోతే కాయలు ముదురుగా మారిపోతాయి. ముదిరిన కాయ వల్ల ఎక్కువ లాభాలు ఆశించలేం. తీగ రకాలైతే ఎకరాకు 3-5 టన్నుల, పొద రకాలైతే 1.5-2.5 టన్నుల దిగుబడిని ఇస్తాయి. పొద చిక్కులు 55-60 రోజుల్లో కోతకు వస్తుంది.రకాన్ని బట్టి 90-100 రోజుల పంట కాలం ఉంటుంది.

పందిరి చిక్కుడు రకాలు

రకం	దిగుబడి (టన్నులు/ఎకరానికి)	పంట కాలం (రోజుల్లో)	లక్షణాలు
ఆర్.ఎన్.డి-1	15-18	210-240	అధిక దిగుబడినిచ్చే పందిరి రకం. కాయలు రవాణాకు అనకూలం. కాయలు కోసిన నాలుగైదు రోజుల వరకు ముడుతలు పడకుండా తాజాగా ఉంటాయి. కాయలు వండేటప్పుడు మంచి వాసన కలిగి ఉంటాయి.
పూసా ఎర్లీ ప్రొలిపిక్	14	200-215	కాయలు సన్నగా కొడవలి ఆకారంలో ఉంటాయి. 9.3 సెం.మీ పొడవు, 1.5 సెం.మీ వెడల్పుతో ఉంటాయి.
దీపాలివల్	6-8	200-210	కాయలు చాలా పొడవుగా ఆకుపచ్చ రంగులో గింజలున్న దగ్గర ఉబ్బెత్తుగా ఉంటుంది.
పూసా సెమ్ -2	22	200	ఈ రకం పేనుబంక, తేనెమంచు పురుగులను, కాయ తొలిచే పురుగులను చలిని కూడా తట్టుకొంటుంది.

పొద చిక్కుడు రకాలు

రకం	దిగుబడి (టన్నులు/ఎకరానికి)	పంట కాలం (రోజుల్లో)	లక్షణాలు
అర్క జయ్	4.8	90-100	కాయలు లేత ఆకుపచ్చ రంగులో కొద్దిగావంపు తిరిగి ఉంటాయి.
అర్క విజయ్	4.8	95-100	కాయలు పొట్టిగా, ముదురాకుపచ్చ రంగులో వాసన కలిగి ఉంటాయి.
కొంకణ్ భూషణ్	5	100	కాయలు చాలా లేతగా ఉంటాయి.

డాక్టర్
కె. రవీందర్‌రెడ్డి
రిజిస్ట్రార్,
రాష్ట్ర ఉద్యాన
విశ్వవిద్యాలయం

ఆహారం..ఆరోగ్యం..ఆనందం

**నగరం ఏదైనా తీసుకుంటుంది.. పల్లె ఎంతైనా ఇస్తుంది.
నగరానిది అవసరం.. పల్లెది మమకారం..
నగరం ఒళ్లు హూనం చేస్తుంది.. పల్లె తన ఒడిలో సేద తీరుస్తుంది.
నగరం యంత్రం..పల్లెది ప్రేమ మంత్రం..
సమృద్ధి ఉన్న చోటే పదిమందితో పంచుకోవడం
ప్రతి ఒక్కరినీ గుండెలో దాచుకోవడం సాధ్యపడుతుంది.
మౌలిక అవసరమైన ఆహారం ఉత్పత్తి చేయని చోట
మట్టితో సంబంధం లేని శ్రమ జరిగే చోట
ఆహారం, ఆరోగ్యం, ఆనందం ఏదీ మన చేతిలో ఉండదు.
ఈ సత్యాన్ని గ్రహించిన లతా కృష్ణమూర్తి దంపతులు
తమ ఇంటిపై పల్లె పెరటిని నిర్మించుకున్నారు
విరామం తీసుకోవాల్సిన వయసులో
నిర్విరామంగా శ్రమిస్తున్నారు.
తమ జీవితాన్ని కొత్తగా పునర్నిర్వచించుకుంటున్నారు.**

ఇంటి పంట

లత అమ్మమ్మది ఒంగోలులోని శానంపూడి. రైతు కుటుంబం. నాన్న వాళ్లది నెల్లూరు జిల్లా కావలి. వాళ్లకు వ్యవసాయం లేదు. అమ్మమ్మ స్ఫూర్తితో మా అమ్మ పెరటి తోట చేసేది. మా అమ్మ ఇలా విత్తనం వేస్తే మొలక అలా వచ్చేది. ఆమె చేయి అలాంటిదని తమ బాల్యాన్ని తలపునకు తెచ్చుకుని ఆనందంగా చెప్పారు లత. మా అమ్మను చూసి మేం పిల్లలం కూడా చెట్లకు నీళ్లు పోయడం, తనకు తోట పనుల్లో సహాయం చేయడం చేసేవాళ్లం. మాకు పాడి గేదెలు ఉండేవి. వాటి ఎరువును మొక్కలకు వేసేవాళ్లం. అలా మా అమ్మమ్మ, అమ్మ ద్వారా మొక్కల పట్ల ప్రేమ మా మనస్సుల్లోకి నాటుకుపోయింది.

నాకు పెళ్లయి హైదరాబాద్ వచ్చాక మొక్కలు పెంచే అవకాశం దొరకలేదు. 1995-96లో మౌలాలిలో అపార్ట్‌మెంట్ తీసుకున్నపుడు కింద మునగ, ఆకుకూరలు, పూల చెట్లు పెంచాను. మునగ కొన్ని వందల కాయలు కాసింది. అపార్ట్‌మెంట్‌లో ఎవరూ మునగకాయలు కొనాల్సిన అవసరం లేకుండాపోయింది. 2003లో కుషాయిగూడలోని మా ఆడపడుచు ఇంటికి వచ్చాక కింద సొర, దొండ, వంకాయ, తోటకూర, గోంగూర, పూలు, పండ్ల చెట్లు పెట్టాం. వాళ్లు మేం కలిసే ఉండటం వల్ల ఎలాంటి ఇబ్బందిరాలేదు. నాలుగేళ్ల క్రితం కొన్ని మొక్కలతో మిద్దెతోట ప్రారంభించాను. దానికీ ఓ కారణముంది. మా అబ్బాయి జర్మనీ నుంచి ఇంటికి వస్తుండడంతో, తనకు ఇంటికూరలు తినిపించాలనే ఉద్దేశంతో 2016 ఫిబ్రవరిలో ఇంటిమీద గ్రోబ్యాగ్స్‌లో ఆకుకూరలతో ప్రారంభించాను. అలా మొక్కలు పెంచాలనుకునే నా కోరికకు తిరిగి అవకాశం దొరికింది. ఎండాకాలంలో బుష్ బీన్స్, గోకర, టమాటా, వంగ, బీట్‌రూట్, ముల్లంగి, ఆకుకూరలు పెంచాను. తరువాత సంవత్సరం తీగజాతి మొక్కలు పెట్టాను. గ్రోబ్యాగ్స్‌లో తీగజాతులు పెద్దగా కాత రాలేదు. కంపోస్ట్ సమస్య కూడా ఉండటంతో తక్కువ మొక్కలు పెంచాను. ఐతే నేను పెంచిన వాటిలో ఎక్కువ ఆకుకూరలే కనిపిస్తాయి. వీటిని నీడలో ఆరబెట్టి జర్మనీ, అమెరికాలో ఉంటున్న మా పిల్లలకు పంపిస్తుంటాను. ఖర్చైనా పర్వాలేదు, వాళ్లు ఇంటికూరలు తింటున్నారనే భావన నాకు చాలా సంతోషాన్నిస్తుందంటారు తన్మయంగా. మనం ఈ వయసులో శ్రమ తగ్గించుకోవాలని మేమిద్దరం అనుకున్నా ఎందుకో తోటలేని జీవితాన్ని ఊహించలేకపోతున్నానంటారావిడ. పాపం పిచ్చిది రోజుకు ఐదారు గంటలు తోటలో శ్రమ పడిపోతుంది అంటారు కృష్ణమూర్తి గారు. ఇది శ్రమ కాదు ప్రేమ అంటారు లత.

ఇది పైన మొత్తం 1800 చదరపు అడుగుల స్థలం. ఇందులో 18X18 ఇంచుల హెచ్.డి.పి.ఇ గ్రోబ్యాగ్స్‌లో సపోటా, బత్తాయి, ఆల్ఫాన్సో, థాయ్ మ్యాంగో, జీడి మామిడి, వాటర్ యాపిల్, అంజీర్, కస్టర్డ్ ఆపిల్,రెడ్ యాపిల్ బేర్, ప్యాషన్ ఫ్రూట్,స్టార్ యాపిల్, చెర్రీ, పునాస మామిడి,జామ (రెడ్ జామ,కేజీ జామ, లక్నో 49,థాయ్ వెరైటీ, నాటు జామ), బార్బడో చెర్రీ, బొంత పండ్ల వంటి మొక్కలను నాటాను. 15 ఇంచుల గ్రోబ్యాగ్స్‌లో నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, దానిమ్మ నారింజ, పైన్‌యాపిల్ పెంచుతున్నాను. చిన్న చిన్న గ్రోబ్యాగ్స్‌లో, టబ్స్‌లో వంగ, బెండ, గోకర, చిక్కుడు, క్యాబేజి, చేమ దుంప, ముల్లంగి, మిర్చి, వంగ (9రకాలు) పెంచుతున్నాను. 1.5 ఎత్తు,2 అడుగుల వెడల్పు హెచ్.డి.పి.ఇ గ్రోబ్యాగ్స్‌లో చిక్కుడు, సొర, బీర, పొట్ల, కాకర, నేతి బీర, రెడ్ లాంగ్‌బీన్స్, వైట్ లాంగ్ బీన్స్, క్లైబీన్స్, దోస (2రకాలు),పుచ్చ, గుమ్మడి వంటి తీగజాతులు పెంచుతున్నాను. ఇంకా రకరకాల తొట్లలో పైకి కాసే మిరప, గుండు మిరప వంటి 4రకాల మిరప మా తోటలో కనిపిస్తాయి. కలబంద, వావిలాకు, రణపాల, గలిజే రు, నల్లేరు, మారేడు వంటి ఔషధ మొక్కలు ఉన్నాయి. కాకర పెద్ద సైజులో విపరీతంగా కాసింది. గింజలతో వచ్చిన దానిమ్మ సంవత్సరంలో మంచి పూత వచ్చింది. ఎనిమిది నెలల అంజీర్ విపరీతంగా కాస్తున్నది.

ఇక పాటింగ్ మిక్స్ విషయానికి వస్తే గ్రోబ్యాగ్స్‌లో ఎర్రమట్టి 20 శాతం, కోకోపిట్ 25శాతం, పశువుల ఎరువు, వర్మికంపోస్ట్, 55 శాతం గుప్పెడు వేపపిండి కలుపుతున్నాను. ప్రతి వారానికి ఒక సారి ఏదో ఒక ఎరువు వాడుతుంటాను. మొదట ఇంటిపంట గ్రూప్ ద్వారా తెలుసుకుని, పబ్లిక్ గార్డెన్‌లో చాలా తక్కువ ఖర్చుతో వర్మికంపోస్ట్ తెచ్చుకున్నాను. ప్రస్తుతం దగ్గరగా ఉన్న గుడిలో ఆవుల వ్యర్థాలను తెచ్చుకుని జీవామృతం తయారు చేసుకుని ప్రతి 15 రోజులకు వాడుతున్నాను. ఇవే కాకుండా దక్షిణకొరియా శాస్త్రవేత్త చోహాన్ క్యో చెప్పినటువంటి ద్రావణాలు తయారుచేసి వాడుతున్నాను. మునగాకు బెల్లం, వేపాకు బెల్లం, అరటిదూట బెల్లం కలిపి (20రోజులపాటు) వారానికి ఒకటి మార్చి 1లీటర్‌కి 5ఎం.ఎల్ వాడుతున్నాను. చిన్న చెట్లకు 1ఎం. ఎల్ సరిపోతుంది. ఫలితం చాలా బాగుంది. ఇవే కాకుండా కూరగాయల వ్యర్థాలను నీటిలో 20రోజులపాటు నానబెట్టి మొక్కల మొదళ్లలో పోస్తున్నాను. ఇది చాలా కాన్సన్‌ట్రేటెడ్ కాబట్టి లీటర్ ద్రావణానికి 15 లీటర్ల నీటిని కలపాలి. ఇంట్లో వచ్చే వ్యర్థాలను దేనినీ వృథా చేయకుండా అన్నీ తోటలో వాడుకుంటున్నాను.

తోటలో విరిగిపోయిన కొమ్మలు,రాలిన ఆకులను ఒక అట్ట డబ్బాలో వేసి కంపోస్ట్ తయారుచేసుకుంటున్నాను. బియ్యం కడిగిన నీరు,పప్పు,కూరగాయలు కడిగిన నీటిని 24 గంటలపాటు ఉంచి, వాటిలో నీటని కలిపి మొక్కలకు పోస్తున్నాను. దీంతోపాటు కుండీలో చెట్ట మొదళ్లలో ప్లాస్టిక్ బాటిల్ భాగాన్ని తిప్పి పెట్టి,పైభాగాన్ని కొద్దిగా కత్తిరించి అందులో కూరగాయల వ్యర్థాలను వేస్తాను. అది కొంచెం కుళ్లిన తరువాత ఎరువులో కలుపుకుంటాను. ఈ లోపు బాటిల్‌నుంచి వచ్చిన ద్రావణం మొక్కకు ఎరువులా ఉపయోగపడుతుంది.

తెగుళ్ల నియంత్రణకు పుల్ల మజ్జిగలో వెల్లుల్లి, దాల్చిన పొడర్, ఇంగువ, పసుపు కలిపి పిచికారీ చేసి తెగుళ్ల సమస్యనుంచి కాపాడుకుంటున్నాను. దీంతో వంగలో ఆకులకు వెనుక వచ్చే తెల్లపేను నివారించబడుతుంది. అది కూడా చాలా తక్కువగా పిచికారీలు చేస్తుంటాను. తోట పెంచుతున్నపుడు లోపలి సమస్యలే కాకుండా, అప్పుడపుడూ బయట సమస్యలు కూడా వస్తుంటాయి. కింద పెరటిలో పూల చెట్టు, పండ్ల చెట్లు చాలా ఏపుగా పెరిగాయి. దాంతో వాటి ఆకులు,కొమ్మలు రాలి పక్క ఇంట్లో పడుతున్నాయని వాళ్లతో గొడవలు. ఇవన్నీ భరించలేక గన్నేరు, దానిమ్మ, జామ, మామిడి వంటి పెద్ద చెట్లు కొట్టాల్సి వచ్చింది. చాలా పెద్ద సైజులో కాసే పదిహేను సంవత్సరాల మామిడి రసాల చెట్టుని కొట్టాల్సి రావడం మమ్మల్ని చాలా ఆవేదనకు గురిచేసింది. చెట్లతో ఒకసారి అనుబంధం ఏర్పడితే తెంచుకోవడం చాలా కష్టమనే విషయం అనుభవంలోకి వచ్చింది.

డాబా మీద నీరు పడకుండా ఉండటానికి ఇనుప స్టాండ్లను తయారుచేయించాను.10 అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పు,5 అంగుళాల ఎత్తు స్టాండ్ల మీద గ్రోబ్యాగ్స్‌ను ఉంచాను. ఇది చాలా ఉపయోగంగా ఉన్నది. ఏదేమైనా ఈ తోట మాకు ఎంతో ఆరోగ్యాన్ని, ఎనలేని మానసిక ఆనందాన్ని అందించింది అంటారామె కృతజ్ఞతాపూర్వకంగా.

–కె.క్రాంతికుమార్‌రెడ్డి, 9603214455
నేచర్స్‌వాయిస్

గార్బేజ్ ఎంజైమ్ తయారీ

150 గ్రాముల కూరగాయల పీచు (ఆలు, వెల్లుల్లి, ఉల్లి వాడరాదు.)50 గ్రాముల బెల్లం,500 మిల్లీ లీటర్ల నీళ్లు కలపాలి. ప్రతి దానిలో రెండు నుంచి మూడు నిమ్మచెక్కలు కలిపితే మంచి వాసన వస్తుంది. గ్యాస్ బయటకు వెళ్లడానికి మొదట వారంలో రోజూ మూత తీసి పెట్టాలి. దీనిని ఎండతగలని చోట ఉంచాలి. 20 రోజుల తరువాత ఎలాంటి గ్యాస్ రాదు కనుక కదపకుండా ఉంచాలి. దీనిని 3నెలల తరువాత వాడుకోవచ్చు. లీటర్ నీటికి 5ఎం.ఎల్ కలిపి వాడుతున్నాను. దీనిని మొక్కలకు, ఇంకా పలురకాలుగా వాడుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, పూల వ్యర్థాలతో కూడా దీన్ని తయారుచేసుకోవచ్చు.

epaper.ntnews.com

ముద్దుల గురించి పిల్లలకు తెలియదనుకోవడం అమాయకత్వం!

నాగార్జున

'కొత్త వాళ్ల తో పనిచేసినప్పుడు నాలో కొత్తదనం కనిపిస్తుంది. ఆ విషయాన్ని శివ, గీతాంజలి చిత్రాలు నిరూపించాయి. నేను చేసిన సినిమాలన్నింటినీ ఒకసారి పరిశీలిస్తే తొలి, మలి చిత్ర దర్శకులే అత్యధికంగా కనిపిస్తారు. వాళ్లిచ్చిన కొత్త తరహా కథలవల్లే నేను సక్సెస్‌లు చూశాను.. స్టార్‌ని కాగలిగాను' అన్నారు. నాగార్జున. కొత్తదనాన్ని, కొత్త వాళ్లని ప్రోత్సహిస్తూ తెలుగు తెరకు కొత్తతరహా చిత్రాల్ని అందించారాయన. నాగార్జున నటించిన తాజా చిత్రం 'మన్మథుడు-2' ఓ ఫ్రెంచ్ చిత్రానికి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో నాగార్జున బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

'మన్మథుడు-2' విషయంలో కాన్ఫిడెంట్‌గా వున్నారా?

హార్డ్ వర్క్ చేశాం. ఎలా వుందనేది రేపు ప్రేక్షకులే చెప్పాలి.

ఫ్రెంచ్ సినిమాను రీమేక్ చేయాలని ఎందుకు అనిపించింది?

రోమ్-కామ్ సినిమా చేయాలని చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాను. ఆ సమయంలో ఓ ఫ్రెంచ్ చిత్రాన్ని చూశాను. అది నాకు టైలర్ మేడ్ సినిమా అవుతుందనిపించింది. అందులో ఫ్రెంచ్ సినిమాల్లో పాపులర్ అయిన నటుడు నటించారు. సినిమాలో హీరో నాలాగే మిడిల్ ఏజ్డ్. పైగా బ్యాచ్‌లర్. ఇందులో రొమాన్సే కాకుండా ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్ వున్నాయి. ఓ మధ్య వయస్కుడు తన కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేశాడు?. తల్లి కోసం ఏం చేయడానికి సిద్ధపడ్డాడు? అనే అంశాలు నాకు బాగా నచ్చాయి. అలాంటి వ్యక్తి జీవితంలోకి తన కంటే చిన్న వయసుగల అమ్మాయి ఎలా ప్రవేశించింది? ఆ తరువాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అన్నదే ఇందులో ఆసక్తికరం. ఈ అంశం నచ్చే సినిమా చేశాను.

సినిమాలో మీ వయసు గురించి మీరే పంచ్‌లు వేసుకున్నట్టున్నారు?

(నవ్వుతూ) మీరు పంచ్‌లు వేసేలోపు నేనే వేసుకుంటే బెటర్ కదా అనిపించింది.

సినిమాలో మీ పాత్ర లేటు వయసులో ప్రేమలో పడటానికి కారణం?

సినిమాలో నా పాత్రకు ముగ్గురు సిస్టర్స్, ఒక మదర్ వుంటుంది. ఈ నలుగురు నా పాత్రని అతిగా గారాబం చేయడం వల్ల ఆడవాళ్లకు దూరంగా వుండాలనుకుంటాడు. అలాంటి వ్యక్తి అవంతికని చూసి ప్రేమలో పడతాడు.

కథా నేపథ్యం మొత్తం పోర్చుగల్‌లోనే సాగడానికి ప్రత్యేకమైన కారణం ఏదైనా వుందా?

మన ఫోర్త్ జనరేషన్ గతంలో విజయనగరం తదితర ప్రాంతాల నుంచి మారిషస్, యూరప్ దేశాలకు వలస వెళ్లారు. అలా వెళ్లిన ఓ కుటుంబం పోర్చుగల్‌లో వుంటే ఎలా వుంటుందని ఆ నేపథ్యాన్ని ఈ సినిమా కోసం ఎంచుకోవడం జరిగింది. పోర్చుగీసు భాషని, నేపథ్యాన్ని సినిమాలో చూపిస్తే కొత్తగా వుంటుందని భావించాం. అంతే కాకుండా ఆ దేశంలో సినిమా చిత్రీకరణ చాలా సులువుగా చేసుకోవచ్చు. ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు వుండవు. అక్కడ జనాభా కూడా చాలా తక్కువ.

ఇలాంటి కథ మన తెలుగులో తొలిసారి కదా?

ఇప్పటి వరకు ఇచ్చిన తెలుగు సినిమాల్లో ఇలాంటి కథతో వస్తున్న తొలి సినిమా ఇదే. ఇందులో నా పాత్రకు పెళ్లంటే ఇష్టం వుండదు. కానీ అతని తల్లి కోసం పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. ఇలాంటి కథ తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా వినోదాన్ని అందిస్తుందన్న నమ్మకముంది. ట్రైలర్‌లో మీరు చూసిన పంచ్ డైలాగ్‌లు చాలా తక్కువ. సినిమాలో అలాంటివి చాలా వున్నాయి.

మీ గత చిత్రాలతో పోలిస్తే ఈ చిత్రంలో డైలాగ్స్ కుటుంబ ప్రేక్షకులకు ఇబ్బందికరంగా వున్నాయని సెన్సార్ కూడా అభ్యంతరం వ్యక్తం చేసినట్టుంది?

సినిమా అంతా పోర్చుగల్‌లో తీశాం. కొన్ని సన్నివేశాల్లో కొన్ని ఇబ్బందికరమైన డైలాగ్‌లు వున్నాయి. అయితే అవి సినిమాలో ఎవరు వాడారన్నది సినిమా చూసిన తరువాత మాట్లాడితే బాగుంటుంది.

మీ సినిమాల్లో వినిపించని డైలాగ్‌లు ఈ సినిమాలో వున్నట్టున్నాయి?

సినిమాలో పాత్రలని బట్టి డైలాగ్‌లు వున్నాయి. 'అన్నమయ్య' సినిమా తరువాత స్వచ్ఛమైన తెలుగును ఈ చిత్రంలో మాట్లాడాను.

ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుకలో 'మన్మథుడు' సినిమాలోని పంచ్ డైలాగ్‌లన్నీ ఆ స్థాయిలో ఆకట్టుకున్నాయంటే దానికి కారణం దర్శకుడు విజయ భాస్కరే అన్నారు. కానీ ఆ సినిమా డైలాగ్‌లు రాసింది త్రివిక్రమ్ కదా?

నాకు కథ వినిపించింది విజయభాస్కర్. ఆ సినిమా సమయంలో నాతో రోజూ పంచ్‌లు వేసింది ఆయనే. అందుకే ఆయన పేరు చెప్పాను.

త్రివిక్రమ్ గురించి ఎందుకు చెప్పడం లేదు?

తరువాత ప్రశ్న అడగండి.

సినిమా తొలికాపీ చూసుకున్నారా? ఎలా అనిపించింది?

ఎవరేమనుకున్నా ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. కొంత మంది అంటున్నట్టు మన ముద్దుల గురించి పిల్లలకు తెలియదనుకోవడం మన అమాయకత్వం. ఈ సినిమాకు సెన్సార్ యు.ఎ ఇచ్చింది. ఐదుగురు మహిళల నేపథ్యంలో సాగే చక్కని కుటుంబ కథా చిత్రమిది. పూర్తి స్థాయి వినోదాత్మక పంథాలో చెప్పే ప్రయత్నం చేశాం.

యువ హీరోలంతా కొత్త తరహా చిత్రాలు చేస్తున్నారు. ఓ సినియర్ హీరోగా కొత్త కథల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా?

కొత్త కథల్ని ఎంచుకోవడం కష్టంగానే వుంది. ఆ విషయంలో కష్టపడుతున్నాను. ఇప్పుడు కొత్త కథలు చేస్తేనే చూస్తున్నారు. లేదంటే చూడటం మానేస్తున్నారు.

గత మూడేళ్ల కాలంలో తెలుగు సినిమా స్వరూపమే మారిపోయింది. బడ్జెట్, మార్కెట్ స్థాయి పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ద్విభాషా చిత్రాలు చేసే ఆలోచన ఎందుకు చేయడం లేదు?

ఇప్పటి వరకు నాలుగు ద్విభాషా చిత్రాలు చేశాను. కానీ ఏవీ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. మన భాష, సంస్కృతి వేరు, తమిళ, మలయాళ సంస్కృతి వేరు. మనం పంచె కట్టే విధానం ఒకలా వుంటుంది. అదే కేరళలో అయితే మరోలా కడతారు. అందుకే ద్విభాషా చిత్రాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. పరాజయాల వల్ల చాలా నేర్చుకున్నాను. అందుకే ఆ రోజుల్లో గీతాంజలి, శివ చిత్రాల్ని ఒకేసారి రెండు భాషల్లో చేయలేదు. 'ఊపిరి' తెలుగులో చేసిన తరువాతే తమిళంలో చేశాం. ఈ విషయంలో నా మార్కెట్ స్థాయిని పెంచుకోవాలని ప్రయత్నించాను కానీ అనుకున్న స్థాయిలో సక్సెస్ కాలేకపోయాను.

మీలో ఎవరు కోటీశ్వరుడికి బిగ్‌బాస్‌కి మీరు గమనించిన తేడా?

'మీలో ఎవరు కోటీశ్వరుడు' షో ద్వారా చాలా మంది వ్యక్తుల కథలు తెలుసుకున్నాను. కానీ బిగ్‌బాస్ అలా కాదు. ఈ కార్యక్రమం వల్ల వారానికో కొత్త తరహా మనుషుల్ని చూస్తున్నాను. 15 మంది ఒకే హౌజ్‌లో గడపడం మామూలు విషయం కాదు. నేనయితే అలా గడిపే వాడిని కాదు.

అఖిల్ కెరీర్ ఇంకా దారిలోపడినట్టు లేదు?

చైతూ కెరీర్ కూడా కొన్ని సినిమాల తరువాతే దారిలోపడింది. దేనికైనా టైమ్ రావాలి.

కియారా కోలీవుడ్ ఎంట్రీ..

'కబీర్‌సింగ్' చిత్రంతో కెరీర్‌లో పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నది కియారా అద్వాణీ. ప్రీతి పాత్రలో సహజనటనతో ఆకట్టుకున్నది. ఈ సక్సెస్‌తో బాలీవుడ్‌లో బిజీగా మారిపోయింది. గత ఏడాది విడుదలైన 'భరత్ అనే నేను'తో తెలుగులో అరంగేట్రం చేసిన కియారా అద్వాణీ తాజాగా కోలీవుడ్‌లో తొలి అడుగు వేయబోతున్నది. విజయ్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్నది. సామాజిక ఇతివృత్తానికి యాక్షన్ అంశాలను మేళవిస్తూ రూపొందనున్న ఈ చిత్రంలో విజయ్‌కి జోడీగా కియారా అద్వాణీ నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మిక మందన్న, కీర్తిసురేష్‌తో పాటు పలువురు నవనాయికల పేర్లు వినిపించాయి. చివరకు ఈ అవకాశం కియారా అద్వాణీని వరించినట్లు చెబుతున్నారు.

కియారా అద్వాణీ.

గ్యాంగ్‌స్టర్ యుద్ధం

శర్వానంద్, కల్యాణి ప్రియదర్శన్

శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రణరంగం'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియదర్శన్ కథానాయికలు. ఈ నెల 15న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'ఓ గ్యాంగ్‌స్టర్ కథ ఇది. 1990తో పాటు ప్రస్తుత కాలంలో అతడి జీవితంలో చోటుచేసుకున్న సంఘటనల సమాహారంగా సాగుతుంది. గ్యాంగ్‌స్టర్ ఎవరితో యుద్ధం చేశాడన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా భావోద్వేగభరితమైన పాత్రలో శర్వానంద్ కనిపిస్తారు. వాస్తవిక అంశాల స్ఫూర్తితో దర్శకుడు సుధీర్‌వర్మ వినూత్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సెన్సార్ పూర్తయింది. 'యు.ఎ' సర్టిఫికెట్ లభించింది. ఇటీవల విడుదలచేసిన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఈ సినిమా అలరిస్తుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ పిళ్లై, ఛాయాగ్రహణం: దివాకర్ మణి.

పూరి ఆఫర్ వదులుకున్నాను!

సంపూర్ణేష్‌బాబు

'సిద్ధిపేటలోని మారుమూల గ్రామంలో పుట్టిన నాకు ఈ స్థాయిలో తొలి సినిమాకే క్రేజ్ ఏర్పడుతుందని ఊహించలేదు. ఆ క్రేజ్‌ని నేను క్యాష్ చేసుకున్నానా లేదా అనే విషయంలో ఇంకా నాకు స్పష్టత రాలేదు' అన్నారు సంపూర్ణేష్‌బాబు. ఆయన త్రిపాత్రాభినయం చేసిన తాజా చిత్రం 'కొబ్బరిమట్ట'. రూపక్ రొనాల్డ్‌సన్ దర్శకుడు. సాయిరాజేష్ నీలం నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం సంపూర్ణేష్‌బాబు హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమా కోసం గత మూడేళ్లుగా వర్క్ చేస్తున్నాం. నా తొలి చిత్రం 'హృదయకాలేయం' విడుదలైన తరువాత 'కొబ్బరిమట్ట' పోస్టర్‌ని రిలీజ్ చేశాం. తొలిసారి ఈ చిత్రంలో పాపారాయుడు, పెదరాయుడు, ఆంధ్రాయుడుగా మూడు పాత్రల్లో నటించాను. ఆర్టిస్టులు కూడా ఎక్కువగా వుండటం, చిత్రీకరణ రోజులు పెరగడం వంటి కారణాలతో అనుకున్న బడ్జెట్ కన్నా ఎక్కువైంది. దాంతో సినిమా ఆలస్యం అవుతూ వచ్చింది. ఇటీవల విడుదల చేసిన మూడున్నర నిమిషాల డైలాగ్‌కు మంచి పేరొచ్చింది. ఈ వీడియో చూసిన మోహన్‌బాబు గారు ఫోన్ చేసి డైలాగ్ అద్భుతంగా చెప్పావు. ఆ శిరిడీ సాయినాథుని ఆశీస్సులు నీకు ఎల్లప్పుడూ వుంటాయని అభినందించారు. రాజేష్ నన్ను నిలబెట్టడం కోసం చేసిన సినిమా ఇది. నటుడిగా ఈ చిత్రం నా భవిష్యత్తుని నిర్ణయిస్తుందన్న నమ్మకంతో వున్నాను. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో దర్శకుడు పూరి జగన్నాథ్ మంచి ఆఫర్ ఇచ్చినా వదులుకున్నాను. సినిమాపై వున్న నమ్మకంతో మరో చిత్రాన్ని అంగీకరించకుండా ఈ చిత్రం కోసమే పనిచేశాను' అన్నారు.